


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 175

గురువారం 14-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గెలిచే జట్టు ఫైనల్‌కు...

ఆసియా కప్‌లో నేడు శ్రీలంకతో పాక్ పోరు. రద్దయితే ఫైనల్‌కు లంక -12లో



రోజుకు 5 వేల పరిహారం

రుణం తీర్చిన 30 రోజుల్లో పత్రాలన్నీ ఇచ్చేయాలన్న ఆర్‌బీఐ -13లో



నిఫా కట్టడికి సమాయత్తం

నిఫా వైరస్ సోకిన నలుగురిలో ఇద్దరు చనిపోవడంతో వైరస్ వ్యాప్తి కట్టడికి కేరళ ప్రభుత్వం రంగంలోకి దిగింది.

వివరాలు 6లో ▸



మేం రష్యా వెంటే..!

ఉక్రెయిన్‌పై యుద్ధానికి సంబంధించి రష్యాకు పూర్తి మద్దతు ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ చెప్పారు.

వివరాలు 6లో ▸



భోపాల్‌లో 'ఇండియా' ర్యాలీ

ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమి తమ మొదటి బహిరంగ సభను వచ్చే నెలలో భోపాల్‌లో నిర్వహించనుంది.

వివరాలు 6లో ▸



కశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

అనంత్‌నాగ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో ఆర్మీ కల్నల్, మేజర్, డెప్యూటీ ఎస్పీలు వీరమరణం పొందారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

సంపద పెరగాలంటే పరిశ్రమలు రావాలి



రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు సహకరించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. పరిశ్రమలు పెడితే స్థానికులకు నష్టం జరుగుతుందని కొందరు రాజకీయం కోసం వదంతులు సృష్టిస్తున్నారన్నారు.

- వివరాలు 10లో▶

బీజేపీ జమిలిని.. కేసీఆర్ జనాన్ని నమ్ముకున్నారు



'రాష్ట్రంలో బీజేపీ బిచాణా ఎత్తేసింది.. ఐదు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో ఓటమి భయంతోనే జమిలి ఎన్నికలంటోంది' అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీజేపీ జమిలిని నమ్ముకుంటే.. సీఎం కేసీఆర్ జనాలను నమ్ముకున్నారన్నారు.

- వివరాలు 2లో▶

రాక్షసులను ఎదుర్కొనేందుకే సోనియా వస్తున్నారు



కేసీఆర్..రాక్షసుడు, మోదీ..బ్రహ్మ రాక్షసుడని, వారిని ఎదుర్కొనేందుకే సోనియాగాంధీ తెలంగాణకు వస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తెలంగాణ ద్రోహి కాబట్టే సోనియా సభను అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



బుధవారం ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద పూలవర్షం కురిపిస్తూ ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం ▶



'ప్రత్యేక' ఎజెండా ఇదే

- 18న ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భారత పార్లమెంట్ 75 ఏళ్ల ప్రస్థానంపై ప్రత్యేక చర్చ: కేంద్రం
- 17న అఖిలపక్ష సమావేశం.. ఫ్లోర్ లీడర్లకు ఆహ్వానాలు: పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి

- వివరాలు 6లో▶

నిరుద్యోగులకు వెన్నుపోటు

> తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న వందల మంది యువకుల కుటుంబాలు నేడు రోడ్డున పడ్డాయి. ఇదే ధర్నా చౌక్‌లో ఏళ్ల తరబడి నిరుద్యోగులు పోరాటం చేశారు. తెలంగాణ వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయనుకుంటే వారికి ఎదురుచూపులే మిగిలాయి.

సీఎం కేసీఆర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్

- నిరుద్యోగ భృతి ఏమైందో ముఖ్యమంత్రి జవాబు చెప్పాలి
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ హయాంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం.. కాంగ్రెస్‌కు సాయం చేస్తూ బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు కేసీఆర్ ప్రయత్నం
- మోదీ చరిష్మాలో కేసీఆర్ కొట్టుకుపోవడం ఖాయం: బండి
- నిరుద్యోగులకు సంఘీభావంగా బీజేపీ నేతల 24 గంటల ఉపవాస దీక్ష
- భగ్నం చేసిన పోలీసులు.. కిషన్‌రెడ్డి తదితరుల అరెస్టు
- కిషన్‌రెడ్డికి ఫోన్ చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా



హైదరాబాద్‌లో దీక్షాస్థలి నుంచి కిషన్‌రెడ్డిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్/ ముషీరాబాద్: నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగభృతి ఏమైందో సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి వస్తుందేమోనని లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే కేసీఆర్ వారికి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఏళ్ల తరబడి ఉద్యోగాలకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా, కోర్టు కేసుల పేరిట నిరుద్యోగులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని అన్నారు. కొన్ని పరీక్షలు నిర్వహించినా ప్రభుత్వ పెద్దల అవినీతి, కేసీఆర్ చేతకానితనం వల్ల ప్రశ్నపత్రాలు లీకై లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్ ఆగమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపం ఎవరిదో కేసీఆర్ చెప్పాలన్నారు. 35 లక్షల మంది యువత అప్పులు చేసి లక్షలు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుంటే వారిని గాలికొదిలేశారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల పాలనలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులు తినడానికి తిండి లేని స్థితిలో ఉన్నారని, వారికి సంఘీభావంగా బీజేపీ దీక్ష చేస్తోందని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 24 గంటల ఉపవాస దీక్షను కిషన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.

బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాల భర్తీ

'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ముందు పెట్టి, కాంగ్రెస్ పార్టీకి సాయం చేస్తూ బీఆర్‌ఎస్‌ను గెలిపించే ప్రయత్నం కేసీఆర్ చేస్తున్నారు. కానీ తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన యువకులు నేడు కళ్లు తెరిచారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను పాతరేస్తారు. నిరుద్యోగ

మిగతా 3వ పేజీలో ▶

కుట్రదారు చంద్రబాబే..

సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో బురిడీ

ఆ విషయాన్ని స్పష్టం చేసిన సీమెన్స్ కంపెనీ

సీఐడీ అదనపు డీజీ సంజయ్ వెల్లడి

- చంద్రబాబు పన్నాగంతో 3,300 కోట్ల నకిలీ ఒప్పందం.. ఆయన ఆదేశాలతోనే నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల
- అందుకోసం 13 చోట్ల ఏ–1 చంద్రబాబు సంతకాలు
- అయిదు చోట్ల ఏ–2 అచ్చెన్నాయుడు సంతకాలు
- ఆద్యంతం సర్వం తానై చక్రం తిప్పిన బాబు.. కుంభకోణం బయట పడకూడదనే నోట్ ఫైళ్లు గల్లంతు
- ఈడీ దర్యాప్తులోనూ అక్రమాలు బట్టబయలు.. అక్రమాలన్నీ నిర్ధారించుకున్నాకే బాబుకు రిమాండ్

3 లో



ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో చంద్రబాబుకు వ్యతిరేకంగా 8 రకాల ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించాయి. అందుకే ఎఫ్‌ఐఆర్‌లో ఏ-37గా ఉన్న చంద్రబాబును ఈ కేసులో ప్రధాన నిందితుడు(ఏ-1)గా చేశాం. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ లభించే ఆధారాలను బట్టి తగిన నిర్ణయం తీసుకునే వెసులుబాటు చట్ట ప్రకారం దర్యాప్తు సంస్థలకు ఉంది.

\- సీఐడీ అదనపు డీజీ సంజయ్

చంద్రబాబు పిటిషన్‌లో కౌంటర్ వేయండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం.. విచారణ 19కి వాయిదా

- 18 వరకు పోలీసు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ కోసం ఒత్తిడి చేయొద్దు
- ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానానికి హైకోర్టు ఆదేశం
- కౌంటర్ లేకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు సాధ్యం కాదు
- చంద్రబాబు న్యాయవాదులకు తేల్చి చెప్పిన న్యాయస్థానం

3 లో

ఈ పరీక్షలు ఎప్పుడు?

గ్రూప్-3, డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ పరీక్షలపై స్పష్టత ఇవ్వని టీఎస్‌పీఎస్సీ

- నోటిఫికేషన్లు వెలువడి ఏడాది గడిచిన వైనం.. అభ్యర్థుల్లో అయోమయం.. ఈ నెలంతా ప్రభుత్వ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాలకు అర్హత పరీక్షలు
- వచ్చే నెలలో ఇతర పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ విడుదల
- ఆ మూడు పరీక్షల తేదీలపై మాత్రం తేల్చని టీఎస్‌పీఎస్సీ



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాల భర్తీ ప్రకటనలిచ్చి నెలలు గడుస్తున్నా అర్హత పరీక్షలు నిర్వహించకపోవడంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంటోంది. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడి ఏడాది గడిచింది. అదేవిధంగా గ్రూప్–3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాల ప్రకటనలు వెలువడి కూడా దాదాపు ఏడాది కావొస్తోంది. కానీ ఈ ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్షలు ఇంతవరకు నిర్వహించలేదు. వాస్తవానికి డీఏఓ పరీక్ష ఈ ఏడాది జనవరిలో నిర్వహించారు. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికీ ముహూర్తం ఖరారు కాలేదు. దీంతో పాటు ఇతర పరీక్షల నిర్వహణపై స్పష్టత లేకపోవడంతో దీర్ఘకాలంగా వీటి కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

మిగతా 10వ పేజీలో ▶

త్వరలో జెన్‌కోలో 350 ఏఈ పోస్టుల భర్తీ

దాదాపు 50 కెమిస్ట్ పోస్టులు కూడా..



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) త్వరలో దాదాపు 350 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), 50 కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనుంది. రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణ అవసరాలకు అవసరమైన ఉద్యోగులను భర్తీ చేసుకోవాలని సంస్థ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. భర్తీ చేయాల్సిన పోస్టుల సంఖ్య, నోటిఫికేషన్ ప్రకటనపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఒకటి రెండు నెలల్లో ప్రకటన వచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్ విభాగాల్లో ఏఈ పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిసింది.

పోయింది ఓ మామూలు మనిషేలే!


- అమెరికాలో తెలుగు యువతి మృతిపై చులకనగా మాట్లాడిన పోలీస్.. నవ్వుతూ, జోకులు వేస్తున్న వీడియో వెలుగులోకి..
- విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు

14 లో



5,100 డెర్నా సిటీలో వరద మృతులు

30,000 సర్వం కోల్పోయి వలస వెళ్లినవారు



లిబియాలోని డెర్నా సిటీలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

ఊహకందని మహా విషాదం

లిబియాలో వరద ఉధృతికి వేలాది మంది గల్లంతు..

నగరంలో ఎటు చూసినా శవాలే

రహదారులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం

- వివరాలు 6లో

క్లుప్తంగా...



విజయభేరికి మహిళాలోకం తరలిరావాలి

మాణిక్‌రావ్ ఠాక్రే పిలుపు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి బహిరంగ సభకు మహిళా లోకం పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఇందుకోసం మహిళా కాంగ్రెస్ నాయకత్వం కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున వచ్చేలా మహిళా కాంగ్రెస్ నేతలు చొరవ తీసుకుని సోనియాగాంధీ పాల్గొనే విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం. సునీతారావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఠాక్రే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మహిళలు ఇంటింటికీ తిరగాలని, సోనియాగాంధీ సభలో ప్రకటించనున్న ఐదు డిక్లరేషన్‌ల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

'విజయభేరి'కి పోలీసుల అనుమతి

తుక్కుగూడలోని శ్రీనగర్ గ్రామంలో ఈనెల 17న కాంగ్రెస్ నిర్వహించే విజయభేరి బహిరంగసభ నిర్వహణకు పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మల్లు రవి దరఖాస్తు చేసుకోగా.. రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్‌ఆంక్షలతో కూడిన అనుమతులిచ్చారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సభకు అనుమతులు జారీ చేశారు.

అసెంబ్లీ కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే బండ్ల

సుప్రీం స్టే ప్రతులు అందజేత



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేగా అనర్హత కేసులో సుప్రీంకోర్టులో ఊరట పొందిన గద్వాల శాసనసభ్యుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులును కలిశారు. తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈ నెల 11న సుప్రీం కోర్టు ఇచ్చిన స్టే ప్రతులను అసెంబ్లీ కార్యదర్శికి ఆయన అందజేశారు. సుప్రీంకోర్టు రెండు నెలల పాటు స్టే విధించిన విషయాన్ని అసెంబ్లీ కార్యదర్శికి వివరించడంతో పాటు స్పీకర్ కార్యాలయంలోనూ ప్రతులను అందజేశారు. సుప్రీంనిర్ణయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి 'సాక్షి'కి వెల్లడించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ మాజీ ఎమ్మెల్యే డీకే అరుణ కోర్టును ఆశ్రయించారని, ఇదే అంశాన్ని సుప్రీం దృష్టికి తీసుకెళ్లడంతో స్టే విధించిందని స్పష్టం చేశారు.

'సాయుధ' ఉత్సవాలను అధికారికంగా నిర్వహించే దమ్ముందా?

కేసీఆర్‌కు కూనంనేని సవాల్




దొడ్డా నారాయణరావు దంపతులను సన్మానిస్తున్న కూనంనేని తదితరులు

చిలుకూరు: తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాలను అధికారికంగా నిర్వహించే దమ్ము, ధైర్యం సీఎం కేసీఆర్‌కు లేవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఎద్దేవా చేశారు. ఆయన బుధవారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించాలని ఉద్యమాలు చేసిన కేసీఆర్.. ప్రస్తుతం మాట తప్పారని విమర్శించారు. కమ్యూనిస్టులు రూపాయి ఖర్చు లేకుండా ఎన్నికల్లో నిలబడతారని, అక్రమ సంపాదనలు ఉండవన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. కాగా, సీపీఐ సీనియర్ నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డా నారాయణరావు, సక్కు బాయమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు.

స్థానిక సంస్థల్లో యువతకు 30 శాతం రిజర్వేషన్

బహుజన విద్యార్థిగర్జన సభలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ



సంగారెడ్డి అర్బన్: స్థానిక సంస్థల్లో యువతకు 30శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్రఅధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన బహుజన విద్యార్థి గర్జనసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 13 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం, కేవలం 5,089 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యార్థులకు మెట్రోతో సహా, ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పిస్తామన్నారు. ప్రతి ఏడాది టీఎస్పీఎస్సీ జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు.

నెలాఖరుకు బీజేపీ | తొలి జాబితా?

ఏకైక అభ్యర్థులున్న 25- 30 స్థానాల ప్రకటన

- ఈ జాబితాలో కిషన్‌రెడ్డి, బండి, డీకే అరుణ, ఈటల, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ తదితరులు ఉండే అవకాశం
- ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సీఈసీ భేటీలో బీజేపీ అగ్రనాయకత్వం నిర్ణయం?
- వచ్చేనెల రెండో వారానికి పూర్తి జాబితా ప్రకటనకు కసరత్తు



సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరలో జరగనున్న తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించిన బీజేపీ అగ్రనాయకత్వం, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో తన కసరత్తును వేగవంతం చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందుగా గత నెల మధ్యప్రదేశ్‌లో 39 స్థానాలకు, ఛత్తీస్‌గఢ్‌లో 21 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల శంఖారావాన్ని పూరించిన బీజేపీ నాయకత్వం తెలంగాణలో కూడా ఈ నెలాఖరులోగా తొలి జాబితా ప్రకటించాలనే దృఢ నిశ్చయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దరఖాస్తుల సేకరణ ప్రక్రియ ముగిసినందున, వాటిని జల్లెడ పట్టి ఏకైక అభ్యర్థులు, గట్టి నేతలు ఉన్న 25–30 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాలని పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

ముందుగా ఏకైక అభ్యర్థులు ఉన్న స్థానాల గుర్తింపు..

ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయంలో సీఈసీ సమావేశం జరిగింది. దీనికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, భూపేంద్ర యాదవ్, శర్బానంద సోనోవాల్, ఎంపీ కె.లక్ష్మణ్, బీజేపీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల ఎంపికపై చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను సమీక్షించడంతో పాటు నేతల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి 6 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్న దృష్ట్యా, ముందుగా ఏకైక అభ్యర్థులు ఉన్న స్థానాలను గుర్తించి ఈ నెలాఖరులోగా అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయించారు. అలాంటి స్థానాలు 25–30 వరకు ఉంటాయని గుర్తించినట్లు తెలుస్తోంది.

తొలిజాబితాలో కిషన్‌రెడ్డి, బండి, ఈటల తదితరుల పేర్లు!

ఇదిలా ఉండగా ముఖ్యనేతలైన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ఎంపీ ధర్మపురి అరవింద్, జితేందర్ రెడ్డి, వివేక్, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆచారి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, విజయశాంతి, బూర నర్సయ్యగౌడ్, చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, చెన్నమనేని వికాస్, మహేశ్వర్‌రెడ్డిల పేర్లు తొలి జాబితాలో ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. ఇక మిగతా స్థానాలకు అభ్యర్థుల ఎంపికను వేగిరం చేసే క్రమంలో భాగంగా ప్రతిస్థానం నుంచి ముగ్గురి పేర్లను ఎంపిక చేసి కమిటీకి పంపిస్తే, సర్వేలు, నేతల బలాబలాలు, కుల సమీకరణల ఆధారంగా అక్టోబర్ రెండో వారానికి మిగతా అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయాలని సీఈసీలో నిర్ణయించినట్లు సమాచారం. తర్వాత జరిగే సీఈసీ భేటీ, పూర్తిగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సన్నద్ధతపైనే ఉంటుందని తెలుస్తోంది. కాగా, సీఈసీ భేటీకి ముందే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఇన్‌చార్జిలు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, ఇతర ముఖ్య నేతలతో బీఎల్ సంతోష్ భేటీ అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

బీజేపీ జమిలిని.. కేసీఆర్ జనాన్ని | నమ్ముకున్నారు

- మంత్రి హరీశ్‌రావు
- నల్లాలు ఇచ్చిన బీఆర్ఎస్ కావాలా? నల్ల చట్టాల బీజేపీ కావాలో ప్రజలు తేల్చుకోవాలి
- ఎవరెన్ని ట్రిక్కులు చేసినా కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం



సాక్షి, సిద్దిపేట: 'రాష్ట్రంలో బీజేపీ బిచాణా ఎత్తేసింది.. ఐదు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో ఓటమి భయంతోనే జమిలి ఎన్నికలంటోంది'అని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. బీజేపీ జమిలిని నమ్ముకుంటే.. ముఖ్యమంత్రి కేసీఆర్ జనాలను నమ్ముకున్నారని పేర్కొన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలతో జరిగిన సభలో మాట్లాడారు. ఇండియా–పాకిస్తాన్, హిందూ – ముస్లింల మధ్య కొట్లాట పెట్టి బీజేపీ ఎన్నికల్లో గెలవాలనుకుంటోందని విమర్శించారు. నల్లాలు ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా? నల్ల చట్టాలు తెచ్చిన బీజేపీ కావాలా? అని ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ తిట్లలో పోటీపడితే.. తెలంగాణ ప్రభుత్వం కిట్లతో పోటీ పడుతోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. తిట్లు కావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని, కిట్లు కావాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. 'సీడబ్ల్యూసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నందుకు స్వాగతిస్తున్నాం.. తెలంగాణలో అమలవుతున్న పథకాలను మీ ప్రాంతాల్లో ప్రవేశపెట్టి అమలు చేయండి'అని కాంగ్రెస్‌కు హితవు పలికారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిని చూసి నేర్చుకోవాలని సీడబ్ల్యూసీ సమావేశానికి వచ్చే కాంగ్రెస్ నేతలకు సూచించారు. కాంగ్రెస్ ప్రకటించే డిక్లరేషన్లను ఆ పార్టీ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీకి వణుకు పుట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ చీప్ ట్రిక్కులకు, మాయమాటలకు ప్రజలు మోసపోవద్దన్నారు. తెలంగాణ సమాజం మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని సెల్ఫ్ డిక్లరేషన్ చేసుకుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని ట్రిక్కులు చేసినా కేసీఆర్ మూడోసారి సీఎంగా హ్యాట్రిక్ కొట్టడం ఖాయం అని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఎమ్మెల్యే సతీశ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా శర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే.. 4కోట్ల మంది విజయం

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ రూరల్/హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రాష్ట్రంలో 4కోట్ల మంది ప్రజలు గెలిచినట్లని భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం నల్లగొండలో నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశానంతరం వెంకట్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. 76 నుంచి 80 సీట్లలో విజయం సాధించి మరో 90 రోజుల్లో అధికారంలోకి రాబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాలో కొత్తగా ఎవరినీ కాంగ్రెస్‌లో చేర్చుకోవడం లేదని, ఉన్న వారికే సీట్లు లేవని స్పష్టం చేశారు. వచ్చే నెల 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామన్నారు. దళిత బంధుపై హైకోర్టులో పిటిషన్ వేశామని, గురువారం రిజిస్టర్ అవుతుందని తెలిపారు. హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. తాను నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని కోమటిరెడ్డి చెప్పారు.

ఒకటో తేదీనే జీతాలిస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తుందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండే ఈ కొద్దినెలలైనా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలివ్వాలని కోరుతూ ఆయన బుధవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. తాము అధికారంలోకి వస్తే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామని ఆ లేఖలో పేర్కొన్నారు.

రాక్షసులను ఎదుర్కొనేందుకే సోనియా వస్తున్నారు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

హన్మకొండ: కేసీఆర్.. రాక్షసుడు, మోదీ.. బ్రహ్మ రాక్షసుడని, వారిని ఎదుర్కొనేందుకే సోనియాగాంధీ తెలంగాణకు వస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ద్రోహి కాబట్టే సోనియాగాంధీ సభను అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కేవీపీతో తాను కలిసి పనిచేస్తున్నానని కేటీఆర్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కేవీపీ, సీఎం కేసీఆర్ కలుసుకున్న సందర్భాలు చాలా ఉన్నాయని, ఒకే సామాజికవర్గానికి చెందిన వీరు కలిసి ఆంధ్రాలో పనిచేస్తున్న ఐపీఎస్ అధికారిని తెలంగాణకు తీసుకొచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. త్వరలో వీరు కలిసిన ఫొటోలు ప్రజల ముందుకు తీసుకొస్తానన్నారు. అమెరికా, దుబాయిలో నెల రోజులు తిరిగిన కేటీఆర్ నిషాలో ఉండి.. సోనియా తెలంగాణ ఇవ్వలేదని, కేసీఆర్ వల్లే వచ్చిందని మాట్లాడుతున్నాడని, సోనియా తెలంగాణ ఇచ్చినప్పుడు కేటీఆర్ అమెరికాలో బాత్రూంలు కడుగుతున్నాడని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ కోసం తుక్కుగూడ రైతులు ముందుకొచ్చి 200 ఎకరాల భూమి ఇచ్చారన్నారు. ఈ నెల 17న సాయంత్రం తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో విజయ భేరి మోగించేందుకు సోనియా రాబోతున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్ ధళ్వి, మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బంద్రు శోభారాణి పాల్గొన్నారు.

కేయూ విద్యార్థి దీక్షలకు సంఘీభావం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వారంరోజులుగా కొనసాగుతున్న విద్యార్థి జేఏసీ నిరసన దీక్షల శిబిరాన్ని బుధవారం రేవంత్‌రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్ల అవకతవకలపై ప్రశ్నించి ఆందోళన చేసినందుకు విద్యార్థులను వీసీ, రిజిస్ట్రార్లు పోలీసులను పిలిపించి కాళ్లు చేతులు విరగొట్టించటం పాశవిక చర్య అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనంతరం విద్యార్థులకు జ్యూస్ ఇచ్చి దీక్షలు విరమింపజేశారు.

కాంగ్రెస్ దిక్కులేక రేవంత్‌ను పెట్టుకుంది

మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శలు



గీసుకొండ: 'రేవంత్ రెడ్డి ఓ ఫోర్ ట్వంటీ.. ఒక ఎమ్మెల్యేను కొనబోయి దొరికిపోయిన దొంగ.. జైలుకు పోయిన దొంగ.. నూరేళ్ల చరిత్ర కలిగిన పార్టీకి దిక్కులేక అలాంటి వాడిని పెట్టుకుంది' అని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. బుధవారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఎలుకుర్తిహవేలిలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తన ప్రసంగంలో గత కాంగ్రెస్ పాలనపై, రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేశారు. దీనిపై స్థానిక కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడినుంచి పంపించారు. అనంతరం మంత్రి సత్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు ఎకరాల భూమి కన్నా ఎక్కువ ఉన్న రైతు లేడని, మూడు గంటల కరెంటు చాలని దేశంలోనే కాదు అమెరికాకు వెళ్లి చెప్పిన ఘనుడు రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. అలాంటి వాళ్ల నోళ్లు మూయించే జ్ఞానం లేదు కానీ, మన మీటింగ్‌కు వచ్చి ఇబ్బంది పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులనుద్దేశించి వ్యాఖ్యలు చేశారు.

సీడబ్ల్యూసీ సమావేశాల కోసం ఆరు కమిటీలు

రిసెప్షన్ కమిటీలో రేవంత్‌తో పాటు 39 మందికి చోటు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్ వేదికగా జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల నిర్వహణ కోసం టీపీసీసీ ఆరు కమిటీలను ఏర్పాటు చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు 39 మంది ముఖ్య నేతలతో రిసెప్షన్ కమిటీని నియమించింది. సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, సీడబ్ల్యూసీ ఆహ్వానితులు దామోదర రాజనర్సింహ, వంశీచందర్‌రెడ్డిలతో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలకు ఈ కమిటీలో చోటు కల్పించింది. మాజీమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా ఏడుగురితో సోషల్ మీడియా కమిటీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ చైర్మన్‌గా ఏడుగురితో ట్రాన్స్‌పోర్టు కమిటీని ఏర్పాటు చేసింది. ఖమ్మం మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా, గాలి అనిల్‌కుమార్ కోచైర్మన్‌గా పబ్లిసిటీ అండ్ బ్రాండింగ్ కమిటీ, అజారుద్దీన్ చైర్మన్‌గా జీహెచ్ఎంసీ పబ్లిసిటీ కమిటీ, టీపీసీసీ ప్రొటోకాల్ కమిటీ చైర్మన్ హర్కర వేణుగోపాల్ రావు చైర్మన్‌గా ప్రొటోకాల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో 29 మందిని సభ్యులుగా నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెండో రోజు టీపీసీసీ | మేనిఫెస్టో కమిటీ భేటీ

- హాజరైన భట్టి తదితరులు
- సూచనలు ఇచ్చిన సోషల్ డెమొక్రటిక్ ఫోరం ప్రతినిధులు



మాట్లాడుతున్న ఆకునూరి మురళి. చిత్రంలో భట్టి, శ్రీధర్‌బాబు, రాజనర్సింహ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో ఓటర్లకు ఇచ్చే హామీల కూర్పుపై టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ వరుసగా రెండోరోజు సమావేశమైంది. మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన బుధవారం గాంధీభవన్‌లో జరిగిన ఈ సమావేశానికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులు హాజరై మేనిఫెస్టోలో పొందుపర్చాల్సిన అంశాలపై చర్చించారు. కాగా, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలోని సోషల్ డెమొక్రటిక్ ఫోరం ప్రతినిధులు గాంధీభవన్‌కు వచ్చి మేనిఫెస్టో కమిటీతో చర్చించారు. తెలంగాణలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధి, అవినీతి నిర్మూలన, రాష్ట్రంలో చేపట్టాల్సిన కులగణన వంటి అంశాలపై కమిటీకి పలు సూచనలందించారు. దామోదర రాజనర్సింహ, పొన్నాల లక్ష్మయ్య, మేనిఫెస్టో కమిటీ వైస్ చైర్మన్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చార్జిషీట్ కమిటీ సమావేశం

టీపీసీసీ చార్జిషీట్ కమిటీ భేటీ గురువారం గాంధీభవన్‌లో కమిటీ చైర్మన్ సంపత్‌కుమార్ అధ్యక్షతన జరగనుంది. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు జెట్టి కుసుమకుమార్ అధ్యక్షతన టీపీసీసీ కమ్యూనికేషన్స్ కమిటీ సమావేశం జరగనున్నట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

రైతు రాజ్యస్థాపనే మా లక్ష్యం

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: గుంట జాగా లేకపోయినా వ్యవసాయంపై ఉన్న మమకారంతో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులకు ఎలాంటి ఆదరణ లభించడం లేదని, పంట రుణాలు, పెట్టుబడి సాయం, పరిహారం లాంటి సాయాలు అందక నరకయాతన అనుభవిస్తూ, కౌలు రైతులు వెక్కిరింపు జీవితాలను అనుభవిస్తున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పక్షాలలో ఎవరు రైతు పక్షమో చరిత్ర చూస్తే తెలిసిపోతుందని, రైతును రాజు చేసే దిశలో వరంగల్ రైతు డిక్లరేషన్ సాక్షిగా ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన రాష్ట్రంలోని కౌలు రైతులకు బహిరంగ లేఖ రాశారు. కాగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో పదే పదే రాష్ట్ర మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్న మాటలు.. చరిత్ర తెలియని అజ్ఞానమా? అవకాశవాద రాజకీయమా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటు గురించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై బుధవారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు.

కాంగ్రెస్‌లో డిష్యూం.. డిష్యూం

సత్తుపల్లి టికెట్‌పై ఇద్దరు నేతల అనుచరుల కుమ్ములాట



డీసీసీ కార్యాలయంలో కుర్చీలు విసిరేసుకుంటున్న సత్తుపల్లి నేతల అనుచరులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా కాంగ్రెస్‌లో రోజురోజుకు గ్రూపు తగాదాలు పెరుగుతూనే ఉన్నాయి. ఈనెల 17న హైదరాబాద్‌లో జరగనున్న విజయభేరి సభను జయప్రదం చేసేందుకు ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఖమ్మం, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహ్మద్ ఆరిఫ్ నసీంఖాన్, కేంద్ర మాజీమంత్రి రేణుకా చౌదరి తదితరులు పాల్గొనగా, ఖమ్మం టికెట్ బీసీలకు కేటాయించాలని పుచ్చకాయల వీరభద్రం కోరారు. వైరా నియోజకవర్గాల నాయకులు కష్టపడే వారికి గుర్తింపునివ్వాలని విన్నవించారు. అనంతరం సత్తుపల్లి టికెట్ ఆశిస్తున్న మానవతారాయ్, మట్టా దయానంద్ వర్గీయులు నినాదాలు చేస్తూ కుర్చీలు విసురుకున్నారు. ఇందులో ఒకరిద్దరికి గాయాలయ్యాయి. బీసీ కేటగిరీకి చెందిన మట్టా దయానంద్‌కు ఎస్సీ రిజర్వ్ స్థానంలో టికెట్ కేటాయించొద్దని మానవతారాయ్ అనుచరులు అడ్డు చెప్పగా, వివాదం పెరిగి దాడుల దాకా వెళ్లింది. ఎంత సర్దిచెప్పినా వినకపోవడంతో రేణుకా చౌదరి బయటకు వెళ్లారు. ఆతర్వాత టికెట్ తమకే ఇవ్వాలని మానవతారాయ్, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, డాక్టర్ మట్టా రాగమయి తదితరులు కోరారు.

ప్రగతిభవన్‌కు నేతల క్యూ

- అవకాశం ఇచ్చినందుకు కొందరు.. దక్కక మరికొందరు
- అందరికీ అవకాశాలు దక్కుతాయని నేతలకు భరోసా



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదలై 25 రోజులు కావొస్తున్నా, ఆ పార్టీ నేతలు ఇంకా ప్రగతిభవన్‌కు క్యూ కడుతూనే ఉన్నారు. అభ్యర్థుల జాబితా ప్రకటన తర్వాత సీఎం కేసీఆర్‌ను కలిసిన నేతలు తమకు టికెట్ కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టికెట్ దక్కిన నేతలు కుటుంబసభ్యులు, సన్నిహితులతో తరలిరావడంతో దాదాపు వారం రోజులపాటు ప్రగతిభవన్‌లో సందడి కనిపించింది. టికెట్ దక్కని అసంతృప్త నేతలు కేసీఆర్‌ను కలిసేందుకు ప్రయత్నించినా, కొందరికే అవకాశం దక్కింది. ఇదిలా ఉంటే అభ్యర్థుల ప్రకటన సమయంలో అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 20 రోజుల తర్వాత ఈ నెల 6న తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. దీంతో పార్టీ టికెట్ దక్కిన ఎమ్మెల్యేలు, నేతలు ఆయన్ను కలిసి ధన్యవాదాలు తెలిపేందుకు తరలివస్తుండటంతో మరోమారు ప్రగతిభవన్‌లో సందడి కనిపిస్తోంది.

అసంతృప్తులతో కేటీఆర్ వరుస భేటీలు

టికెట్ దక్కని నేతలు, సిట్టింగ్ ఎమ్మెల్యేల పట్ల అసంతృప్తితో ఉన్నవారు కేటీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. సిట్టింగ్‌లకు మళ్లీ టికెట్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలకు మరోమారు అవకాశం ఇస్తామనే మాటకు కట్టుబడి ఉండాల్సి రావడం, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం వంటి కారణాలతో అవకాశం ఇవ్వలేకపోయినట్టు అసంతృప్త నేతలను కేటీఆర్ బుజ్జగిస్తున్నారు. సర్వేలు, ఇతర వర్గాల నుంచి అందిన సమాచారాన్ని క్రోడీకరించిన తర్వాతే టికెట్లు ఇచ్చినట్టు కేటీఆర్ వారికి వివరిస్తున్నారు. అక్టోబర్ మొదటివారంలో ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే అంచనాల నేపథ్యంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, బదిలీలు, ఇతర సిఫారసుల కోసం కేటీఆర్‌ను కలుస్తున్నారు.

నియోజకవర్గాల్లో పరిస్థితిపై 'స్కానింగ్'

అభ్యర్థుల జాబితా ప్రకటన తర్వాత నియోజకవర్గాల్లో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్ స్థితిగతులు, అభ్యర్థుల పనితీరుపై సర్వే సంస్థలతో పాటు ప్రభుత్వ నిఘా విభాగాల నుంచి పార్టీ అధినేత కేసీఆర్‌కు నివేదికలు అందాయి. వీటి ఆధారంగా సమస్యాత్మక నియోజకవర్గాలోపరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను కేటీఆర్‌తో పాటు కొందరు ముఖ్య నేతలకు అప్పగించారు. ఇప్పటికే ఆదిలాబాద్, వరంగల్ తదితర జిల్లాల నేతలతో ఆయన భేటీ అయ్యారు. నర్సాపూర్ టికెట్ ఆశిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ వంటి నేతలను కలిశారు.

విపక్ష శిబిరంపై స్పెషల్ నజర్

బీఆర్ఎస్ విపక్ష శిబిరాల్లోని కదలికలపైనా దృష్టి సారించింది. కాంగ్రెస్, బీజేపీలో టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న నేతలు, వారిలో టికెట్ దక్కే అవకాశం బలంగా ఉన్నవారు, ఆయా నేతల బలాలు, బలహీనతలపై బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. బీఎస్పీ, ఉభయ కమ్యూనిస్టులు పోటీ చేసేందుకు అవకాశమున్న స్థానాలు, ఆయా పార్టీల అభ్యర్థులు సాధించే ఓట్లు తదితరాలపైనా బీఆర్ఎస్ సూక్ష్మస్థాయిలో లెక్కలు వేస్తోంది. కాంగ్రెస్, బీజేపీలో టికెట్ దక్కని నేతలు ఎటు వైపు అడుగులు వేసే అవకాశముంది.. వారిని పార్టీలో చేర్చుకునేందుకు ఉన్న అవకాశాలపైనా బీఆర్ఎస్ అంతర్గతంగా కసరత్తు చేస్తోంది. ఎన్నికల షెడ్యూలు వెలువడేలోగా సొంతగూటిని చక్కదిద్దుకొని, దూకుడుగా వెళ్లేందుకు అవసరమైన వ్యూహాలు, కార్యాచరణకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతోంది.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పోల్ మేనేజ్‌మెంట్ శిక్షణ

టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్ పొన్నం



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై అసెంబ్లీ సెగ్మెంట్ స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్టు టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బూత్ మేనేజ్‌మెంట్, ఎలక్షన్ మేనేజ్‌మెంట్‌లపై బూత్ కమిటీ, మండల కమిటీలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో పొన్నం అధ్యక్షతన టీపీసీసీ శిక్షణ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ కమిటీ బాధ్యతలు, శిక్షణల నిర్వహణపై రోడ్‌మ్యాప్‌ను సభ్యులకు వివరించారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల వారీగా, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నేతలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కమిటీ కన్వీనర్ పవన్ మల్లాది తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ కమిటీ సమావేశం

టీపీసీసీ ఏర్పాటు చేసిన బీసీ డిక్లరేషన్ కమిటీ బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సమావేశమైంది. కమిటీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలువురు బీసీ సంఘాల నేతలు, ప్రొఫెసర్లు, ఉద్యమకారులు హాజరై బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొనాల్సిన అంశాలు, ఇవ్వాల్సిన హామీల గురించి తమ అభిప్రాయాలు, సూచనలు వెలిబుచ్చారు.

గుడుంబా పోయి.. కేసీఆర్ బాటిల్ వచ్చింది

బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల



సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో గుడుంబా సీసాలు పోయి.. కేసీఆర్ బాటిల్ వచ్చిందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, కొల్లాపూర్ పట్టణాల్లో బుధవారం నిర్వహించిన బీజేపీ నియోజకవర్గ స్థాయి బూత్ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఏటా రూ.10,700 కోట్లున్న మద్యం ఆదాయం.. ఇప్పుడు రూ.45 వేల కోట్లకు చేరిందని ఆరోపించారు.

మాజీ మంత్రి చిత్తరంజన్‌తో భేటీ

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత చిత్తరంజన్‌దాస్‌తో కల్వకుర్తిలోని ఆయన నివాసంలో ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చిత్తరంజన్ దాస్‌ను ఈటల బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలు, అనుచరులతో చర్చించాక నిర్ణయం తీసుకుంటానని చిత్తరంజన్‌దాస్ 'సాక్షి'కి తెలిపారు.

కత్తి తీసి పోరాడటమే సరైనది

చంద్రబాబు లాయర్ సిద్ధార్థ లూథ్రా ఆసక్తికర ట్వీట్



సాక్షి, అమరావతి: స్కిల్ కుంభకోణంలో అరెస్ట్ అయిన చంద్రబాబు తరఫున వాదిస్తున్న సుప్రీం కోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. హైకోర్టు బుధవారం క్వాష్ పిటిషన్‌ను వాయిదా వేస్తూ తీర్పు ఇచ్చిన అనంతరం.. ఈ రోజు మా నినాదం ఇదే.. అంటూ గురు గోవింద్ సింగ్ సూక్తిని ఉటంకించారు. 'అన్ని విధాలుగా ప్రయత్నించినా న్యాయం కనుచూపు మేరలో లేదని తెలిసినప్పుడు కత్తి తీసి పోరాడటమే సరైనది' అని ట్వీట్ చేశారు.

బాబు కోసం పవన్ 'ఆరాటం'

- వారం రోజుల్లోనే రాష్ట్రానికి రెండోసారి వస్తున్న పవన్
- జైలులో ఉన్న చంద్రబాబుతో నేడు భేటీ
- ముద్రగడను, మహిళలను బాబు, లోకేశ్ దూషించి, వేధించినా మాట్లాడని పవన్
- చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఎక్కడా లేని హడావుడి



సాక్షి, అమరావతి: స్కిల్ కుంభకోణం కేసులో జైలులో ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడి కోసం దత్తపుత్రుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పడుతున్న ఆరాటం చూసి సొంత పార్టీ నేతలే విస్తుపోతున్నారు. ఒక అవినీతి కేసులో జైలుకు వెళ్లిన వ్యక్తి కోసం ఇంత హడావుడిగా హైదరాబాద్ నుంచి రావాలా అని ప్రశ్నిస్తున్నారు. పవన్ వారం రోజుల్లో రెండో సారి రాష్ట్రానికి రావడమే వారి ప్రశ్నకు ఒక కారణం. పవన్ పార్టీ పెట్టినప్పటి నుంచి ఇంత స్వల్ప వ్యవధిలో రాష్ట్రానికి వచ్చిన దాఖలాలు లేవని పార్టీ నేతలే చెబుతున్నారు. ఒకసారి రాష్ట్రంలో పర్యటించి (అదీ.. కొద్ది రోజులే) హైదరాబాద్ వెళ్లాక మళ్లీ నెలకో రెండునెలలకో.. ఎప్పుడో వీలు కుదిరినప్పుడు వచ్చి పోయే వారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కాపు ఉద్యమం తీవ్ర స్థాయిలో జరిగినప్పుడు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని, ఆయన కుటుంబాన్ని, మహిళలను చంద్రబాబు, లోకేశ్ దుర్భాషలాడి, వేధించి, కేసులు పెట్టినా పవన్ ఒక్క మాట మాట్లాడలేదు. కానీ, పవన్ ఇప్పుడు చంద్రబాబు అరెస్టు తర్వాత మాత్రం వారంలో రెండోసారి వస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు అరెస్టయిన రోజున (శనివారం) హడావుడిగా రాష్ట్రానికి వచ్చిన పవన్.. జైలులో ఉన్న చంద్రబాబుతో ములాఖత్ అయ్యేందుకు గురువారం రాజమండ్రి వెళ్లనున్నట్లు ఆయన రాజకీయ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవన్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాజమండ్రి వస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

చంద్రబాబు పిటిషన్‌లో కౌంటర్ వేయండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం.. విచారణ 19కి వాయిదా

- 18 వరకు పోలీసు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ కోసం ఒత్తిడి చేయొద్దు
- ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానానికి హైకోర్టు ఆదేశం
- కౌంటర్ లేకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు సాధ్యం కాదు
- ఏ కేసులోనైనా కౌంటర్ తర్వాతే మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయం
- చంద్రబాబు న్యాయవాదులకు తేల్చి చెప్పిన న్యాయస్థానం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సీఐడీ పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం వరకు విచారణ చేపట్టవద్దని విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ వాదన వినకుండా ఈ కేసులో ప్రస్తుత దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడం సాధ్యం కాదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన చంద్రబాబు నాయుడు జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మంగళవారం ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఈ కేసు ఆధారంగా విజయవాడ ఏసీబీ కోర్టు తనకు రిమాండ్ విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సైతం కొట్టేయాలని తన పిటిషన్‌లో కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు.

మీరు ఈ వ్యాజ్యంపై విచారించేందుకు అభ్యంతరం లేదు

విచారణ ప్రారంభం కాగానే వాదనలు వినిపించేందుకు చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సిద్ధమవుతుండగా, న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. వాదనలు వినిపించే ముందు తాను ఓ విషయం చెప్పదలచుకున్నానని తెలిపారు. తాను పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా ఉన్న సమయంలో కొన్ని కేసుల్లో పిటిషనర్ చంద్రబాబుకు వ్యతిరేకంగా హాజరయ్యానని, దీనిపై మీకు అభ్యంతరం ఉంటే విచారణ నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. దీనిపై లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ, తమకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ గట్టిగా చెప్పారు. ఈ వ్యాజ్యాన్ని మీరే వినాలని కోరారు. దీంతో న్యాయమూర్తి విచారణను కొనసాగించారు. లూథ్రా వాదనలు మొదలుపెడుతుండగా, సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, ఇందుకు తమకు కొంత గడువు కావాలని కోర్టుకు స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలుకు ఆదేశాలిస్తానని చంద్రబాబు న్యాయవాదులను ఉద్దేశించి న్యాయమూర్తి చెప్పగా, తాము వాదనలు వినిపిస్తామని వారు తెలిపారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

చంద్రబాబు రిమాండ్ చెల్లదు..

సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు అరెస్ట్ అక్రమమన్నారు. అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 17ఏ ప్రకారం పబ్లిక్ సర్వెంట్‌ను విచారించాలన్నా, కేసు నమోదు చేయాలన్నా అందుకు గవర్నర్ నుంచి అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ఈ కేసులో అలాంటి అనుమతి ఏదీ తీసుకోలేదన్నారు. ఇది చట్ట విరుద్ధమని తెలిపారు. గవర్నర్ అనుమతి తప్పనిసరి అని సుప్రీంకోర్టు కూడా చెప్పిందన్నారు. సెక్షన్ 17ఏను ఏసీబీ ప్రత్యేక కోర్టు సరైన కోణంలో అర్థం చేసుకోలేదన్నారు. 2018 జూలై తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 2018 తర్వాత నమోదైన కేసులకు గవర్నర్ అనుమతి తప్పనిసరి అని తెలిపారు. గవర్నర్ అనుమతి తీసుకోకుండా నమోదు చేసిన కేసు, అరెస్ట్, రిమాండ్ ఇవన్నీ కూడా చెల్లవన్నారు. అదువల్ల చంద్రబాబు రిమాండ్ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని కోరారు.

నిబంధనల ప్రకారమే కస్టడీ పిటిషన్ వేశాం

ఈ సమయంలో అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, లూథ్రా పూర్తి స్థాయిలో వాదనలు వినిపిస్తున్నారని, తాము కౌంటర్ దాఖలు చేసిన తర్వాత వాదనలు వినిపించుకోవచ్చన్నారు. సెక్షన్ 17ఏ విషయంలో చట్టం చాలా స్పష్టంగా ఉందని, అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని లూథ్రా కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. అవతలి పక్షానికి సైతం అవకాశం ఇద్దామని తెలిపారు. కౌంటర్ల దాఖలకు ఎంత సమయం కావాలని ప్రశ్నిస్తూ.. తొలుత శుక్రవారం కల్లా కౌంటర్ దాఖలు చేయాలని అదనపు ఏజీకి చెప్పారు. అంత తక్కువ సమయం సరిపోదని అదనపు ఏజీ తెలిపారు. నిబంధనల ప్రకారం రిమాండ్ విధించిన మొదటి 14 రోజుల లోపు పోలీసు కస్టడీ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగానే ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. అయితే విచారణను సోమవారానికి వాయిదా వేస్తానని, అప్పటి లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. సోమవారం వినాయక చవితి సెలవు అని సుధాకర్‌రెడ్డి చెప్పడంతో అలా అయితే మంగళవారం విచారణ చేపడతానని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

ఈ సమయంలో లూథ్రా జోక్యం చేసుకుంటూ, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. కౌంటర్ లేకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదని న్యాయమూర్తి అన్నారు. ఈ కేసులో మాత్రమే కాదని, సాధారణంగా తాను ఏ కేసులో కూడా కౌంటర్ లేకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వనని తెలిపారు. ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో సీఐడీ పోలీసులు చంద్రబాబు కస్టడీ కోసం పిటిషన్ దాఖలు చేశారని, ఈ వ్యాజ్యంలో తమను కౌంటర్ దాఖలు చేయాలంటూ ఏసీబీ కోర్టు ఒత్తిడి చేస్తోందని లూథ్రా న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. పోలీసు కస్టడీ పిటిషన్‌పై ఈ దశలో విచారణ జరిపితే తమకు నష్టం జరుగుతుందన్నారు. అందువల్లే కస్టడీ పిటిషన్‌పై విచారణను నిలిపేయాలని కోరుతున్నామన్నారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ, అలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఈ దశలో సాధ్యం కాదని లూథ్రాకు తేల్చి చెప్పారు. సోమవారం వరకు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ దాఖలుకు ఒత్తిడి చేయకుండా ఉండే విషయంలో మీకేమైనా అభ్యంతరం ఉందా? అని అదనపు ఏజీని ప్రశ్నించారు. సహచర న్యాయవాదులతో చర్చించిన అనంతరం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అదనపు ఏజీ స్పష్టం చేశారు. దీంతో న్యాయమూర్తి, సోమవారం వరకు పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు న్యాయవాదులను ఒత్తిడి చేయవద్దని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆదేశించారు.

'స్కిల్' కుంభకోణం కుట్రదారు బాబే

సీఐడీ అదనపు డీజీ సంజయ్

> ఈ కేసులో సీఐడీ దర్యాప్తును మరింత వేగవంతం చేస్తుంది. విదేశాలకు పరారైన చంద్రబాబు పీఎస్ శ్రీనివాస్, మనోజ్ పార్థసానిని అరెస్ట్ చేసేందుకు త్వరలోనే ఆ దేశాలకు ప్రత్యేక బృందాలను పంపనుంది. అచ్చెన్నాయుడుతోపాటు ఇతరులపై కూడా త్వరలోనే చర్యలు తీసుకుంటాం. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూములు, ఫైబర్ నెట్ తదితర కేసుల్లో నారా లోకేశ్ కీలక పాత్ర పోషించారు. ఆయనపై కూడా త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటాం.
> \- సీఐడీ అదనపు డీజీ సంజయ్

సాక్షి, అమరావతి: 'టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం ప్రధాన కుట్రదారుడు చంద్రబాబు నాయుడే. సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో ఒప్పందం కుదుర్చుకున్నట్టుగా మోసపూరితంగా వ్యవహరించారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల వరకు ఆయనే సర్వం తానై వ్యవహరించారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫైళ్లలో ఏ–1 చంద్రబాబు 13 చోట్ల సంతకాలు చేశారు. ఏ–2 అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంతకాలు అయిదు చోట్ల ఉన్నాయి' అని సీఐడీ అదనపు డీజీ సంజయ్ వెల్లడించారు. వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఎస్పీ ఫకీరప్పతో కలసి బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ గురించిగానీ ఒప్పందం గురించిగానీ తమకు తెలియదని సీమెన్స్ కంపెనీయే ఈ మెయిల్ ద్వారా న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ వాంగ్మూలం ద్వారా స్పష్టం చేసిందని తెలిపారు. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా మళ్లించిన రూ.371 కోట్లలో షెల్ కంపెనీల ద్వారా రూ.241 కోట్లు చంద్రబాబుకే చేరాయన్నారు. సీఐడీతోపాటు సమాంతరంగా దర్యాప్తు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఈ ప్రాజెక్ట్ పేరిట షెల్ కంపెనీల ద్వారా నిధులు కొల్లగొట్టారని నిర్ధారించిందని చెప్పారు. విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం ఈ కేసును పది గంటలపాటు సుదీర్ఘంగా విచారించి.. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని పూర్తి ఆధారాలు ఉన్నాయని సంతృప్తి చెందాకే ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. సీఐడి అదనపు డీజీ సంజయ్ ఇంకా ఏం చెప్పారంటే..

కుంభకోణం సూత్రధారి చంద్రబాబే

- కేబినెట్ ఆమోదం లేకుండానే రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)ను చంద్రబాబు ఏర్పాటు చేశారు. ఆ కార్పొరేషన్ పేరిట ప్రజాధనం కేటాయింపు అంతా గంటా సుబ్బారావు అనే ప్రైవేటు వ్యక్తి చేతిలో పెట్టారు. అందుకోసం ఆయనకు ఏకంగా నాలుగు పోస్టులు కట్టబెట్టారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ–ఈసీవోగా మొదట నియమించి, అనంతరం ఉన్నత విద్యా శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి, స్కిల్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ శాఖ కార్యదర్శి పోస్టుతోపాటు ఏకంగా సీఎం ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా కూడా నియమించారు.
- డిప్యూటీ సీఈవోగా అపర్ణను నియమించారు. ఆమె భర్త సీమెన్స్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నారు. ఇది పరస్పర ప్రయోజనాల కిందకు వస్తుంది. ఇక టీడీపీకే చెందిన జె.వెంకటేశ్వర్లు అనే చార్టెడ్ అకౌంటెంట్‌కు ఏపీఎస్ఎస్‌డీసీలో పోస్టు కట్టబెట్టారు. ఉన్నత విద్యా శాఖను బైపాస్ చేశారు. ఎలాంటి ప్రాతిపదిక లేకుండా బడ్జెట్‌ను ఆమోదించారు. పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలన్న ప్రతిపాదనను బేఖాతరు చేస్తూ ఏకపక్షంగా ఆరు చోట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

సీమెన్స్ కంపెనీ పేరుతో మోసం

- టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్, అందుకోసం ఒప్పందం గురించి సీమెన్స్ కంపెనీకి తెలియనే తెలీదు. చంద్రబాబు కేవలం నిధులు కొల్లగొట్టడానికే ఆ కంపెనీ పేరును వాడుకుని మోసానికి పాల్పడ్డారు. జర్మనీలోని సీమెన్స్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు ఆ జీవో గురించి, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని వెల్లడించింది.
- ఏపీఎస్ఎస్‌డీసీ చెబుతున్న రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌తో తమకు సంబంధం లేదని, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని స్పష్టం చేసింది. తాము 90 శాతం నిధులను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తామని ఎవరికీ చెప్పలేదని.. అసలు ఆ వ్యవహారంతో సీమెన్స్ కంపెనీకి సంబంధం లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా వివరించడంతోపాటు న్యాయస్థానంలో 164సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం కూడా ఇచ్చింది.
- సీమెన్స్ కంపెనీ అంతర్గతంగా కూడా దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ఏపీఎస్ఎస్‌డీసీ, సీఐడీలకు అందించింది. భారత్‌లో సీమెన్స్ కంపెనీ ప్రతినిధిగా ఉన్న సుమన్ బోస్ మరికొందరు నిందితులతో కలసి జర్మనీలోని ప్రధాన కార్యాలయానికి తెలియకుండా ఈ కుట్రలో భాగస్వాములయ్యారని నిర్ధారించింది. ఈ మేరకు సుమన్ బోస్, ఇతరులు డిలీట్ చేసిన ఈ మెయిల్స్, వాట్సాప్ మెసేజ్‌లు, మెసేజ్‌లు, ఇతర డాటాను రిట్రైవ్ చేసి సీఐడీకి అందించింది.
- డిజైన్ టెక్ కొరితే తాము రూ.58.80 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే ఆ కంపెనీకి విక్రయించామని తెలిపింది. ఎవరైనా తమ వద్ద నుంచి సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసుకోవచ్చని, అంత మాత్రాన తాము ఆ ఒప్పందంలో భాగస్వాములమైనట్టు కాదని వెల్లడించింది.

రూ.3,300 కోట్లు ప్రాజెక్ట్‌గా నకిలీ ఒప్పందం

- సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఇచ్చిన వాంగ్మూలంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కేవలం రూ.58 కోట్ల ప్రాజెక్ట్‌ను రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌గా చూపిస్తూ చంద్రబాబు భారీగా ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు పన్నాగం పన్నారు. అందుకోసమే జీవోకు విరుద్ధంగా నకిలీ ఒప్పందాన్ని తీసుకువచ్చారు. డిజైన్ టెక్ అనే కంపెనీని భాగస్వామిని చేశారు.
- సీమెన్స్ కంపెనీ నుంచి 90 శాతం నిధులు రావని తెలుసు. ఎందుకంటే వారికి అసలు ఒప్పందం గురించే తెలియదు. అందుకే ప్రభుత్వ వాటా 10 శాతం నిధులను నిబంధనలకు విరుద్ధంగా డిజైన్‌టెక్ కంపెనీకి చెల్లించి.. పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి మళ్లించి.. అక్కడి నుంచి వివిధ షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు రూ.241 కోట్లు దక్కించుకున్నారు.

బాబు ఒత్తిడితోనే రూ.371 కోట్లు విడుదల

- జీవోలో పేర్కొన్నట్టు రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌లో గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా 90 శాతం వాటాలో ఒక్క రూపాయి కూడా రాలేదు. కానీ ప్రభుత్వ వాటా 10 శాతం జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లను డిజైన్ టెక్ కంపెనీకి ఏకపక్షంగా విడుదల చేశారు. దీనిపై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ విషయాన్ని నోట్ ఫైళ్లలో స్పష్టంగా పేర్కొన్నారు.
- కానీ నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లు విడుదల చేయాలని అప్పటి సీఎం హోదాలో చంద్రబాబు ఆదేశించారు. అదే విషయాన్ని అధికారులు నోట్ ఫైళ్లలో స్పష్టంగా పేర్కొంటూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే నిధులు విడుదల చేస్తున్నట్టు స్పష్టం చేశారు. అనంతరమే నిధులు విడుదల చేశారు.

షెల్ కంపెనీల ద్వారా బాబుకు రూ.241 కోట్లు

- డిజైన్ టెక్ కంపెనీకి విడుదల చేసిన రూ.371 కోట్లలో ఆ కంపెనీ సీమెన్స్ కంపెనీ నుంచి రూ. 58.80 కోట్ల సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి అందించింది. మిగిలిన రూ.311 కోట్లను డిజైన్ టెక్ కంపెనీ వివిధ షెల్ కంపెనీలకు మళ్లించింది.
- వాటిలో షెల్ కంపెనీలకు కమీషన్లు పోగా, మిగిలిన రూ.241 కోట్లు చంద్రబాబుకు చేర్చారు. అంటే ఈ కుంభకోణం ద్వారా చంద్రబాబు రూ.241 కోట్లు అక్రమంగా కొల్లగొట్టారన్నది ఆధారాలతోసహా నిర్ధారణ అయ్యింది.

గుజరాత్ మోడల్ కాదు..

- యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం గుజరాత్‌లో అమలు చేస్తున్న ప్రాజెక్ట్‌నే ఏపీలో అమలు చేశామని టీడీపీ చెబుతుండటం సరికాదు. అధికారుల బృందం గుజరాత్‌లో పర్యటించి అక్కడి ప్రాజెక్ట్‌ను పరిశీలించింది. కానీ అందుకు విరుద్ధంగా ఏపీలో ప్రాజెక్ట్‌ను రూపొందించింది.
- 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ అన్నది జీవోలో చూపించారు గానీ ఒప్పందంలో లేదు. ఇక పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసి ఫలితాలను చూసి నిర్ణయం తీసుకుందామన్న అధికారుల ప్రతిపాదనను పట్టించుకోలేదు. కేవలం రూ.371 కోట్లు కొల్లగొట్టడానికే ఈ ప్రాజెక్ట్‌ను తెరపైకి తెచ్చారు.

బాబు ముఠా ద్వారా అక్రమ నిధుల తరలింపు

- షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లించిన నిధులు చంద్రబాబు తన ముఠా మనుషుల ద్వారా పొందారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్‌గుప్తా ఇందులో కీలక పాత్ర పోషించారు.
- డిజైన్‌టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లలో రూ.241 కోట్లు వివిధ షెల్ కంపెనీల ద్వారా యోగేశ్ గుప్తాకు చేరాయి. ఆయన ఆ రూ.241 కోట్లు డ్రా చేసి నగదును మనోజ్ పార్థసానికి ముంబయిలో అందించారు. మనోజ్ పార్థసాని ఆ రూ.241 కోట్ల నగదును హైదరాబాద్ తీసుకువచ్చి చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. ఆయన ఆ నగదును చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- నిధుల తరలింపులో పాత్రధారులుగా వ్యవహరించిన పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తాలే చంద్రబాబు ఇతర కుంభకోణాల్లోనూ నిధుల తరలింపులో కీలకంగా వ్యవహరించారు. అమరావతిలో తాత్కాలిక రాజధాని భవనాల నిర్మాణం, రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల కాంట్రాక్టులు కట్టబెట్టిన కుంభకోణంలో నిధులను షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు చేర్చారు.
- ఆ విషయం ఆదాయ పన్ను శాఖ దర్యాప్తులో వెల్లడైంది. దాంతో ఆదాయ పన్ను శాఖ మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, పెండ్యాల శ్రీనివాస్‌లకు నోటీసులు జారీ చేసి వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. తాము అక్రమ నిధులను చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కే అందించామని మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా వాంగ్మూలంలో స్పష్టం చేశారు. షెల్ కంపెనీల ద్వారా మళ్లించిన నిధులను వారిద్దరి నుంచి చంద్రబాబు తరఫున తాను స్వీకరించానని పెండ్యాల శ్రీనివాస్ కూడా అంగీకరిస్తూ వాంగ్మూలం ఇవ్వడం గమనార్హం.

నోట్ ఫైళ్లు మాయం

- ఈ కుంభకోణం బయట పడకూడదనే ఉద్దేశంతో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నోట్ ఫైళ్లను ఉద్దేశ పూర్వకంగా గల్లంతు చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు జీవోకు సంబంధించిన నోట్ ఫైళ్లు, నిధుల విడుదలకు సంబంధించిన ఆదేశాల నోట్ ఫైళ్లను మాయం చేశారు. కానీ సీఐడీ వాటిని రిట్రైవ్ చేసింది.
- ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు గురించి జీవో 4, సీమెన్స్‌తో ఒప్పందం గురించి జీవో 5 జారీ చేశారు. కానీ ఆ రెండు జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను మాయం చేశారు. కానీ జీవో 8 ద్వారా అంతకు ముందు ఇచ్చిన జీవోలు 4, 5 లోని అంశాలను సీఐడీ గుర్తించి వెలికి తీయడంతో ఈ కుంభకోణం వెనుక ఉన్న కుట్ర బయటపడింది.

ఈడీ దర్యాప్తులోనూ 'స్కిల్' బట్టబయలు

- ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ పేరిట షెల్ కంపెనీల ద్వారా నిధులు అక్రమంగా తరలించిన అంశంపై కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. ఈ ప్రాజెక్ట్‌లో భారీగా అవినీతి జరిగిందని నిర్ధారించి ఇప్పటి వరకు డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్, సీమెన్స్ కంపెనీ భారత ప్రతినిధిగా గతంలో వ్యవహరించిన సుమన్ బోస్‌లతోపాటు నలుగురిని అరెస్ట్ చేసింది.
- డిజైన్ టెక్ కంపెనీకి చెందిన రూ.31.32 కోట్ల బ్యాంకు ఖాతాలను జప్తు చేసింది. ఈ మేరకు ఈడీ పత్రికా ప్రకటన జారీ చేయడంతోపాటు ట్వీట్ కూడా చేసింది. డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌ను ఈడీ ఈ ఏడాది మార్చి 10న అరెస్ట్ చేస్తే, మే 12 వరకు జైలులో ఉండి బెయిల్‌పై విడుదలయ్యారు.
- ఈ కుంభకోణంలో చంద్రబాబు భాగస్వామి అయిన ఆయన ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌లో అసలు అక్రమాలే జరగలేదని వీడియోలు విడుదల చేయడం విడ్డూరం. అక్రమాలు చేయకపోతే ఈడీ ఆయనపై కేసు పెట్టి ఎందుకు అరెస్ట్ చేసి జైలుకు పంపిందో సమాధానం చెప్పాలి. సీఐడీ కూడా బాబుతోపాటు ఇప్పటికే వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌తోపాటు 9 మందిని అరెస్ట్ చేసింది.
- సీఐడీ నమోదు చేసిన కేసుపై విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం పది గంటలపాటు సుదీర్ఘంగా విచారించింది. ఇరుపక్షాల వాదనలను పూర్తిగా ఆలంకించింది. అనంతరం ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టులో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారనడానికి పూర్తి ఆధారాలు ఉన్నాయని సంతృప్తి చెందడంతోనే ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది.

రాష్ట్రీయం

నిరుద్యోగులకు వెన్నుపోటు

▶ మొదటి పేజీ తరువాయి


యువతకు తెలుసు. కాంగ్రెస్ హయాంలో ఎలాంటి అన్యాయం జరిగిందనేది. కాబట్టి ఈ రెండు పార్టీలను యువత క్షమించదు. కచ్చితంగా బుద్ధి చెబుతారు. ఈ ధర్నా చౌక్ నుంచి తెలంగాణ ప్రజలకు చెబుతున్నా. బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తాం. నిరుద్యోగులు, యువత బీజేపీకి మద్దతు తెలిపాలి..' అని కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

జమిలి అంటే జంకెందుకు?: బండి

జమిలి ఎన్నికలంటే కేసీఆర్ కుటుంబానికి అంత జంకెందుకని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో మోదీ చరిష్మా సునామీలో కేసీఆర్ కొట్టుకు పోవడం ఖాయమన్నారు. దేశద్రోహుల పార్టీని సంతృప్తి పరిచేందుకే కేసీఆర్ జాతీయ సమైక్యతా రాగం అందుకున్నారని విమర్శించారు. తెలంగాణలో 2.5 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదన్నారు. శ్రీకాంతాచారి, ఇషాంత్ రెడ్డి, సుమన్, పోలీస్ కిష్టయ్యవంటి యువకుల బలిదానాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో కేసీఆర్ సర్కార్‌ను గద్దె దించేదాకా పోరాడుతామని యువతకు సంజయ్ పిలుపునిచ్చారు.

నవంబర్‌లో తెలంగాణకు పట్టిన మకిలి వీడుతుంది: తరుణ్‌ఛుగ్

ఉద్యమ సమయంలో కేసీఆర్ యువతను సెంటిమెంట్‌తో రెచ్చగొట్టి 1200 మంది యువత ప్రాణాలు కల్లుకున్న కుటుంబం బలిగొన్నదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. ఆంధ్రా పాలకులే ఉద్యోగాలు దోచుకుంటున్నారని చెప్పిన కేసీఆర్.. తాను అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నాడని విమర్శించారు. ఈ నవంబర్‌లో తెలంగాణకు పట్టిన కేసీఆర్ అనే మకిలి వీడుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ వ్యాఖ్యానించారు. 'కేసీఆర్..నువ్వు ఇస్తానని చెప్పిన డబుల్ ఇండ్లు ఏవి? దళిత బంధు ఏది? ఎందరికి ఇచ్చావు?' అంటూ నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబాన్ని పారదోలాలని పిలుపునిచ్చారు. కాగా, కేంద్ర మంత్రి అమిత్ షా.. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. తెలంగాణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కేసీఆర్ ప్రభుత్వంపై ఇదే స్ఫూర్తితో పోరాటాన్ని కొనసాగించాలని, దీనికి కేంద్ర పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసానిచ్చారు. ఆయన కిషన్‌రెడ్డికి ఫోన్ చేసి భరోసానిచ్చారు. పార్టీ నేతలు మురళీధర్‌రావు, జి.విజయరామారావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, చింతల రామచంద్రారెడ్డి, డి.ప్రదీప్‌కుమార్, డా.జి.మనోహర్‌రెడ్డి, కాంతికుమార్, గీతామూర్తి, గూడూరు నారాయణరెడ్డి, నాగూరావు నామాజీ, బండ కార్తీకరెడ్డి, డా.గౌతంరావు, శ్యాంసుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




24 గంటల దీక్షలో కిషన్‌రెడ్డి. చిత్రంలో ప్రేమేందర్‌రెడ్డి, విజయరామారావు, డీకే అరుణ, తరుణ్‌ఛుగ్ మురళీధర్‌రావు, చింతల రామచంద్రారెడ్డి, బూర నర్సయ్యగౌడ్

దీక్ష భగ్నంతో తీవ్ర ఉద్రిక్తత

బీజేపీ ఆధ్వర్యంలో కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా ధర్నా చౌక్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సాయంత్రం ఆరు గంటలకే ధర్నాచౌక్ వద్దకు చేరుకున్న పోలీసులు దీక్షను విరమించాలని కిషన్‌రెడ్డిని కోరారు. కానీ గురువారం ఉదయం 11 గంటల దాకా దీక్షను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కొంతసేపటికి పెద్దసంఖ్యలో పోలీసులు చేరుకోగా, అదే సమయంలో విషయం తెలుసుకున్న కార్యకర్తలు కూడా భారీగా అక్కడకు చేరుకున్నారు. దీక్ష భగ్నం చేయడాన్ని, అరెస్టులను తీవ్రస్థాయిలో ప్రతిఘటించారు. కేసీఆర్ డౌన్‌డౌన్, బీఆర్ఎస్ డౌన్ డౌన్ అంటూ పెద్దగా నినాదాలు చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కరెంట్ సరఫరాను నిలిపివేయడంతో అక్కడ ఏమి జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే దీక్ష సాయంత్రం ఆరు గంటల వరకే అనుమతి ఉందంటూ పోలీసులు బలవంతంగా దీక్షను భగ్నం చేశారు. రాత్రి 8.15 ప్రాంతంలో కిషన్‌రెడ్డిని పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఆ సమయంలో పలువురు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి ఆయన్ను అక్కడి నుంచి తరలించారు.

దీక్ష కొనసాగింపు..వైద్య పరీక్షలు


కిషన్‌రెడ్డి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దీక్ష కొనసాగిస్తున్నారు. రాత్రి కార్యాలయం వద్ద బలవంతంగా తరలింపు నేపథ్యంలో కిషన్‌రెడ్డి సొమ్మసిల్లి పోయారు. ఛాతీ, చేతులపై అక్కడక్కడా గోళ్లు గీరుకున్న గాయాలు అయ్యాయి. రాత్రి 9.30 ప్రాంతంలో వైద్యులు ఆయనకు బీపీ చెకప్, ఇతర పరీక్షలు నిర్వహించారు. గురువారం ఉదయం ఛాతీ ఎక్స్‌రే తీయించుకోవాలని సూచించారు. ఇతర పారామీటర్లు బాగానే ఉన్నట్లు తెలియజేశారు.



కిషన్‌రెడ్డికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కాగా దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని బీజేపీ నేతలు తరుణ్ ఛుగ్, బండి సంజయ్, డీకే అరుణ, ఎన్వీ సుభాష్ తదితరులు ఖండించారు. దీక్షకు అన్ని అనుమతులు తీసుకున్నప్పటికీ పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని తరుణ్ ఛుగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి దీక్షకు తెలంగాణ నిరుద్యోగ యువత నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించడంతో జీర్ణించుకోలేక కేసీఆర్ ఇలా పోలీసులను పురమాయించారని విమర్శించారు.

'ఎన్నికల' గందరగోళానికి కేటీఆర్ ప్రయత్నం: జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ, బీఆర్ఎస్‌లు బొమ్మా బొరుసూ లాంటివని, బీజేపీ సహకారంతోనే గతంలో బీఆర్ఎస్ ముందస్తు ఎన్నికలకు వెళ్లిందని, ఇప్పుడు బీఆర్ఎస్ సహకారంతోనే జమిలీ ఎన్నికలంటూ బీజేపీ కొత్త నాటకానికి తెర తీసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయనే విషయంలో ప్రజలు, రాజకీయ పార్టీలను గందరగోళంలో పడేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని, అందులో రాష్ట్ర మంత్రి కేటీఆర్ భాగస్వామి అని ఆయన చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. అమిత్‌షా చేతిలో కేసీఆర్ జుట్టు ఉందని, అందుకే బీజేపీ ఏం చెప్పినా తలూపుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదం అని, 2004 సాధారణ ఎన్నికల సమయంలో ఆయన అమెరికాలో ఉన్నారని చెప్పారు. యూపీఏ ప్రభుత్వంలో కేసీఆర్ మంత్రి అయిన తర్వాతే తెలంగాణకు కేటీఆర్, కవిత వచ్చారని, కేసీఆర్ తెలంగాణ నినాదాన్ని అనవసరంగా ఎత్తుకున్నారని కేటీఆర్ అన్న మాటలకు చాలామంది సాక్షులు ఉన్నారని వ్యాఖ్యానించారు. ఏపీలో పార్టీ ఉనికి కోల్పోయినా తెలంగాణ ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, కేసీఆర్ మాత్రం ఆకాశం నుంచి ఊడిపడినట్లుగా మాట్లాడుతున్నాడని జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.



దేవుడు పాపులను భరిస్తాడు:
కానీ శాశ్వతంగా కాదు.
– మిగెల్ సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 14 సెప్టెంబర్ 2023

చేజేతులా చేసుకున్నదే!

జీ20 ముగిసినా దాని ప్రకంపనలింకా తగ్గలేదు. ఢిల్లీ శిఖరాగ్ర సదస్సుకు హాజరై, భారత ఆత్మీయ ఆతిథ్యాన్ని అందుకున్న మిగతా ప్రపంచ నేతలందరికీ ఇది చిరస్మరణీయ అనుభవమేమో కానీ, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు మటుకు ఇది పీడకలగా పరిణమించింది. భారత ప్రధాని నుంచి సాదర స్వాగతం అందకపోగా, ఖలిస్తానీ తీవ్రవాదులకు అడ్డుకట్ట వేయకపోవడంపై ద్వైపాక్షిక చర్చల్లోనూ భారత్ ఆయనకు తలంటి పంపినట్టు వార్త. ఎలాగోలా సదస్సు ముగియగానే తిరుగు ప్రయాణం అవుదామంటే ప్రత్యేక విమానంలో సాంకేతిక సమస్యలు. భారత్‌లో కెనడా ప్రధాని చేదు అనుభవాలన్నీ సొంత గడ్డపై ప్రతిపక్షాలకు కావాల్సినంత మేత ఇచ్చాయి. మంగళవారం ట్రూడో తిరుగు పయనమయ్యారు కానీ, భారత్ పర్యటనలో ఆయనకు వ్రతం చెడ్డా ఫలితం దక్కలేదు.

భారత్ నుంచి పంజాబ్‌ను వేరుచేయాలని కోరుతున్న ఖలిస్తానీ ఉద్యమకారులు, వారి మద్దతుదార్లపై కెనడా మెతకగా వ్యవహరిస్తోందని భారత వాదన. ట్రూడో మాత్రం భావ ప్రకటన స్వేచ్ఛ తమ దేశీయ విధానమని సమర్థించుకుంటున్నారు. తమ అంతర్గత రాజకీయాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందనేది కెనడా సర్కార్ ఆరోపణ. జీ20 వేళ ఆదివారం ట్రూడో, మోదీల మధ్య భేటీలో ఇరుపక్షాలూ తమ తమ ఆందోళనలు వ్యక్తం చేశాయి. భారత– కెనడా సంబంధాలు ఇటీవల అంతకంతకూ దిగజారుతున్నాయనడానికి ఆ భేటీ వార్తలే తార్కాణం. ఇరుదేశాల మధ్య చర్చల్లో ఉన్న వాణిజ్య ఒప్పందమూ నత్తనడకన సాగే ప్రమాదంలో పడింది. ఇది ఎవరికీ శ్రేయోదాయకం కాదు.

గతంలో 2018లో ప్రధానిగా ట్రూడో తొలి భారత సందర్శన సైతం ఘోరంగా విఫలమైంది. శిక్ష పడ్డ తీవ్రవాదిని విందుకు ఆహ్వానించి, అప్పట్లో ఆయన గందరగోళం రేపారు. అప్పటితో పోలిస్తే, ఇప్పటి పర్యటన మరీ ఘోరం. కీలక మిత్రదేశాల నుంచి దూరం జరిగిన కెనడా, భారత్‌తో తనబంధాన్ని మరింత బలహీనపరుచుకుంది. వెరసి, ఈ ప్రాంతంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలైన చైనా, భారత్‌లు రెంటికీ కెనడా దూరమైంది. ఎన్నికల్లో జోక్యం, కెనడియన్ పౌరుల కిడ్నాప్, ఆర్థిక యుద్ధతంత్రం వగైరాల వల్ల చైనాకు దూరం జరగడం అర్థం చేసుకోదగినదే. కానీ, రాజకీయ కారణాలతోనే ట్రూడో భారత్‌ను దూరం చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. కెనడా జనాభా 4 కోట్ల యితే, భారత జనాభా 140 కోట్లు. కెనడా ఆర్థిక వ్యవస్థకు భారత ఆర్థిక వ్యవస్థ దాదాపు రెట్టింపు. అలా చూస్తే, భారత్‌తో బంధం కెనడాకు అవసరం, లాభదాయకం. ఆ సంగతి ట్రూడో విస్మరించారు.

మునుపటి ప్రధాని స్టీఫెన్ హార్పర్ హయాంలో ఢిల్లీతో వాణిజ్యాన్ని ఒటావా విస్తరించింది. వ్యవసాయ సామగ్రి, ఎరువులు, అణువిద్యుత్‌కు అవసరమయ్యే యురేనియమ్ భారత్‌కు కెనడా అందిస్తూ వచ్చింది. ట్రూడో హయాంలో ఎలాంటి వివరణా ఇవ్వకుండానే ఇటీవలే సరికొత్త వాణిజ్య ఒప్పందంపై చర్చల్ని ఆపేశారు. భారత్‌లో మోదీ విధానాలు కెనడాలో తన రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తాయని ట్రూడో భావన. అందుకే, వీలైనంత దూరం జరగాలని చూస్తున్నారు. కెనడాలో ఎక్కువగా ప్రవాసీ సిక్కులుండడంతో, వారి మద్దతుకై తంటాలు పడుతున్నారు. భారత్‌లో 2020 నాటి రైతుల ఆందోళనలపై ట్రూడో మాట్లాడుతూ ఇప్పుడు జీ20లో అన్నట్టే భావప్రకటన స్వేచ్ఛల్ని ప్రబోధించారు. తీరా కెనడాలో అలాంటి నిరసనలే ఎదురైతే, అత్యవసర చట్టం ప్రయోగించారు. మైనారిటీలపై మోదీ ప్రభుత్వ కఠిన వైఖరిని తప్పుపడుతున్న ట్రూడో కెనడాలో చేస్తున్నది అదే!

అంతర్జాతీయ సంబంధాల్లో కెనడా ఇప్పుడు దోవ తప్పింది. ఐరాస భద్రతామండలి తాత్కాలిక సభ్యత్వం కోసం ఆ దేశం చేసిన గత రెండు ప్రయత్నాలూ విఫలమయ్యాయి. 20వ శతాబ్దిలో శాంతి పరిరక్షణ ప్రయత్నాలకు మారుపేరుగా, ఐరాస శాంతిపరిరక్షక దళానికి సృష్టికర్తగా నిలిచిన కెనడా ఇప్పుడు ఆ ఊసే ఎత్తని స్థితికి చేరింది. ఒకప్పుడు వర్ణవివక్షపై పోరాటంలో, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఏర్పాటులో ముందుండి, మానవ భద్రతకై మందుపాతరల నిషేధ ఒప్పందం కావాలని కూడా పోరాడిన దేశం గత రెండు దశాబ్దాల్లో ఊహించని మార్గం పట్టింది. 2005 తర్వాత ఆ దేశం తన విదేశాంగ విధానాన్ని సమీక్షించుకోనే లేదు. దేశంలో, ప్రపంచ పరిస్థితుల్లో శరవేగంతో మార్పులు వచ్చినా ఎప్పటికప్పుడు తాత్కాలిక ప్రతిస్పందనతోనే విదేశాంగ వాహనాన్ని నెట్టుకొస్తోంది. ఫలితంగా ప్రపంచంలో కెనడా పేరుప్రతిష్ఠలే కాదు... ప్రభావమూ దెబ్బతింటోంది. తక్షణమే కెనడా విదేశాంగ విధానానికి దశ, దిశ కావాలని విశ్లేషకులు అంటున్నది అందుకే!

గత ఇరవై ఏళ్ళలో డయాస్పొరా రాజకీయాలు, వ్యక్తిగత రాగద్వేషాలతో కెనడా విదేశాంగ విధానం తప్పటడుగులు వేస్తోంది. మధ్యప్రాచ్యంపై మునుపటి హార్పర్ ప్రభుత్వం, భారత్‌తో వ్యవహారంలో ఇప్పటి ట్రూడో సర్కార్ వైఖరి అందుకు మచ్చుతునక. చమురు, సహజవాయువు, జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తిలో కెనడాది అగ్రపీఠం. అలాగే, యురేనియమ్, అనేక కీలక ఖనిజాలు అక్కడ పుష్కలం. దాన్ని సానుకూలంగా మలుచుకొని విదేశాంగ విధానాన్ని తీర్చిదిద్దుకొనే అద్భుత అవకాశం ఉన్నా అక్కడి పాలకులు ఆ పని చేయట్లేదు. ఇప్పటికైనా కెనడా బయటి ఒత్తిళ్ళను బట్టి నడవడం మానాలి. దేశాన్ని కలసికట్టుగా నిలిపే స్పష్టమైన లక్ష్యాలను పౌరులకు అందించాలి. కీలక అంతర్జాతీయ అంశాల్లో తమ వైఖరిని స్పష్టం చేయాలి. భారత్‌తో బంధాన్ని మళ్ళీ బలోపేతం చేసుకోవడంతో ఆ పనికి శ్రీకారం చుట్టాలి. ఎందుకంటే, పాలకుల పనికిమాలిన చర్యల వల్ల కెనడాకు ఆర్థిక నష్టం కలిగితే అది పాలకుల పాపమే. ట్రూడో ఇకనైనా స్వార్థ రాజకీయ ప్రయోజనాలు వదిలి, విశ్వవేదికపై సమస్త కెనడియన్ల ప్రయోజనాలపై దృష్టి పెడితే మంచిది.

‘జమిలి’ ఎన్నికలు రాజ్యాంగ ఉల్లంఘన



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

దశాబ్దాలుగా రాజ్యాంగ మౌలిక స్వరూపం చెదరకుండా ప్రజలు కాపాడుకుంటూ వచ్చారు. అయితే ఇటీవల కాలంలో ‘ఒకే దేశం – ఒకే ప్రజ’ వంటి ఆకర్షణీయ నినాదాలతో దేశ సమాఖ్య తత్వాన్నీ, లౌకిక స్వభావాన్నీ దెబ్బతీసే ప్రతిపాదనలను కేంద్రపాలకులు ముందుకు తెస్తున్నారు. మెజారిటీ వాదాన్ని ప్రోత్సహిస్తున్నారు. అలాగే రాజకీయ పార్టీల్లో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ధోరణి పెరిగిపోతోంది. ఫలితంగా రాజకీయాలు నేరమయం, ధనమయం అయిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రం ‘జమిలి ఎన్నికలు’ అంశాన్ని మరోసారి ముందుకు తెచ్చింది. కేంద్ర, రాష్ట్ర చట్ట సభలకు ఒకేసారి ఎన్నికలు జరిపించాలనే ఆలోచన ఏ మాత్రం ఆచరణ సాధ్యం కాదు. దీనివల్ల రాజ్యాంగ పరమైన సమస్యలు తలెత్తుతాయి.

‘ఒక దేశం, ఒక ఎన్నిక’ అన్న ఎజెండా ద్వారా, ‘ఒకే పన్ను, ఒకే రేషన్ కార్డు’ ఇత్యాది నినాదాలూ, విధానాల ద్వారా దేశంలో ఐక్యతను కాపాడగలమన్న సరికొత్త భావనను ప్రవేశపెట్టడానికి కేంద్ర పాలకులు ప్రయత్నిస్తున్నారు. తద్వారా కేంద్ర పాలకులు తమ చేతుల్లో పరిపాలనా, రాజకీయ అధికారాన్ని బహుముఖంగా కేంద్రీకరించుకుని, రాష్ట్రాల అధికారాలను బలహీనపరచడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ తతంగం 2014 నుంచే ప్రారంభమైందని మరవరాదు. ఈ తంతులో భాగంగానే పార్లమెంటును పాలకులు విస్పష్ట నిర్ణయాలు తీసుకోకుండా తటస్థపరిచారు. ఇక మీడియా దాదాపు పాలకుల సేవికగా మారింది. న్యాయ వ్యవస్థను చాలావరకు మెదలు వంచారు, పౌర సమాజాన్ని నిర్వీర్యపరిచారు.’’
– సీనియర్ జర్నలిస్టు సి. రాం మనోహర్ రెడ్డి (11.9.2023)

దేశ తొలి అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్, ఆయన ఆధ్వర్యంలో నియమితులైన నాటి రాష్ట్రాల గవర్నర్లు వ్యవహరించిన తీరుతో ఇటీవలి కాలంలో మన దేశ అధ్యక్షులు, గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరుతెన్నులను పోల్చి చూస్తే రాజ్యాంగం ఏ విధంగా అతిక్రమణకు గురవుతోందో అర్థమవుతుంది. రాజ్యాంగ ప్రవేశికలో ‘భారత ప్రజలమైన మేము రూపొందించుకొని, అంకితమిచ్చుకున్న ప్రజా రాజ్యాంగం’ అని సగర్వంగా ప్రకటించుకున్న మనం ఇప్పుడు రాజ్యాంగ ఉల్లంఘనలను చూసి తల దించుకోవలసి వస్తోంది. ఆ తొల్లింటి రాజ్యాంగ హామీలు, ఇంకా ఇప్పుడు అమలు జరుగు తున్నాయనుకోవడం ప్రజల భ్రమ అవుతుంది. ఎందుకంటే ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని, విధానాలను మనసారా అభిలషించి ‘దేశంలో కొలది మంది మోతుబరుల చేతుల్లో దేశ సంపద, అధికారాలు కేంద్రీకృతం కారాదని’ శాసించిన జాతిపిత గాంధీజీని ప్రేమించినట్టు నటించి ఆయనను హతమార్చినవాళ్లే గాంధీ బొమ్మలు పెట్టుకుని ఊరేగుతున్నారు.

దేశ స్వాతంత్ర్య తొలి సంవత్సరాల్లో కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఒకేసారి ఎన్నికలు నిర్వహించేవారు. కానీ 1960లలో కేంద్ర (కాంగ్రెస్) పాలకులు రాజ్యాంగంలోని 356వ నిబంధనను తమ స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుని రాష్ట్రాలలో తమకు ఇష్టం లేని ప్రభుత్వాలను కూల్చడానికి జంకలేదు. శాసనసభ విశ్వాసాన్ని చూరగొన్న రాష్ట్ర ప్రభుత్వాలే పాలనలో ఉండాలి. ఆ విశ్వాసం సడలినప్పుడు అవి దిగిపోయి, తిరిగి ప్రజల విశ్వాసం చూరగొనేందుకు ఎన్నికలకు వెళ్లాలి. ఈ పద్ధతిని తారుమారు చేసి, కేంద్ర పాలనను (రాష్ట్రపతి పాలన) రుద్దడానికి పాలకులు అలవాటు పడటం ద్వారా అటు ఫెడరల్ వ్యవస్థ లక్ష్యాలనూ, ఇటు ప్రజాస్వామ్య విలువల్నీ ఏకకాలంలో ధ్వంసం చేయడానికి తెగబడ్డారు. అదే సమయంలో రాష్ట్రాలూ, కేంద్రానికీ ఎన్నికలు వేరు వేరు సమయాల్లో జరప వలసిన అవసరం ఏర్పడింది. ఇప్పుడు కేంద్రం ‘జమిలి ఎన్నికలు’ అంశాన్ని మరోసారి ముందుకు తెచ్చింది. కేంద్ర, రాష్ట్ర చట్ట సభలకు ఒకేసారి ఎన్నికలు జరిపించాలనే ఆలోచన ఏమాత్రం ఆచరణ సాధ్యం కాదు. దీనివల్ల అనేక రాజ్యాంగ పరమైన సమస్యలు తలెత్తుతాయి.

రెండో మాట



తొలినాటి ప్రజాస్వామిక విలువలు మచ్చుకు కూడా కానరాకుండా పోవడం నేటి రాజకీయాల్లో మనం చూస్తున్న విషాదం. ఎవరు ఎంత డబ్బు ఖర్చుపెడితే అంతగా ఎన్నికల్లో గెలవవచ్చు అనే నమ్మికతో రాజకీయపార్టీలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ధనవంతులూ, నేరప్రవృత్తి కలిగినవారూ రాజకీయాల్లో అత్యధికంగా పాల్గొనడం కళ్లెదుట కనిపిస్తున్న రాజకీయ చిత్రం. తాజా ఏడీఆర్ రిపోర్ట్‌ను గమనిస్తే మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత ‘నిఖార్సు’గా పరిఢవిల్లుతోందో అర్థమవుతుంది. రాజ్యాంగం ప్రకారం ఏమాత్రం మన రాజకీయపార్టీలు నడుచుకోవడం లేదనీ, అవి కేవలం ఏదో విధంగా అధికారంలోకి రావడానికే ప్రయత్నిస్తున్నాయనీ... పైకి మాత్రం రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు నటిస్తున్నాయని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పుడు రాజ్యాంగ సూత్రాలనూ, సమాఖ్య తత్వాన్నీ, లౌకికత్వాన్నీ యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ అనేక ప్రతిపాదనలు బహిరంగంగానే ముందుకొస్తున్నాయి. ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే వ్యక్తి పాలన’ అటువంటిదే.

చైతన్యశీలి, ప్రజాస్వామ్యవాది అయిన నేటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ పదవీ స్వీకారం చేసిన తర్వాత అడుగడుగునా కేంద్ర పాలకుల దుందుడుకు విధానాలను వ్యతిరేకిస్తూండటంతో కొంతలో కొంత వారు దూకుడు తగ్గించుకుంటున్నారు. అయితే మళ్లీ అధికారం చేజిక్కించుకోవడానికి ఎప్పటిలాగే తమ పాత విధానాన్ని అనుసరించి కుల, మత, వర్గ సంఘర్షణలకు ప్రజల మధ్య ‘చిచ్చు’ రగిలిస్తున్నారు. ఇదేమాత్రం వారికి అమానవీయం అనీ, రాజ్యాంగ విరుద్ధమనీ అనిపించడంలేదు. మెజారిటీ వాదాన్ని ముందుకు తెచ్చి తమ చర్యలను ప్రతిభావంతంగా సమర్థించుకుంటున్నారు.

బహుశా అందుకే మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు ఒక పాత్ర ద్వారా చెప్పించిన మాటలు ఈ సందర్భంగా గుర్తుకొస్తున్నాయి:

‘నేను చేసిన పాపాలు అనేకమయినా, నా జిహ్వకు మాత్రం అవి పానకాలే!’ అందుకే, అలాంటి ‘పానకాల రాయుళ్ల’ను పాలకులుగా పెరగనివ్వకుండా ఉంచడానికే నేటి చైతన్యశీలమైన సుప్రీంకోర్టు విశ్వ ప్రయత్నం! దాని కృషికి చేదోడు వాదోడుగా నిలవడం – బాధ్యతగల భారత పౌర సమాజ ధర్మం!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వండర్ హ్యారీ



హ్యారీ పాటర్ పుస్తకాల మ్యాజిక్‌కు 25 సంవత్సరాలు! ఇది నమ్మడం కష్టంగా ఉంది... ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు!
– జె.కె. రౌలింగ్, ‘హ్యారీ పాటర్’ సిరీస్ రచయిత్రి

వృథా ఖర్చు



జీ20 సదస్సు కోసం ఇండియా 4,100 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఒక వైపేమో మన పిల్లల కోసం తగినన్ని పాఠశాలలు లేవు, కూర్చోవడానికి కుర్చీలు లేవు. వీటి మీద ఎందుకు చర్చ జరగడం లేదు? ఈ విషయం ఎందుకు మనకు కోపం తెప్పించడం లేదు?
– శివమ్ విజ్, జర్నలిస్ట్

న్యాయ విజయం



డిగ్రీ సర్టిఫికెట్లు లేకపోవడం లేదా ‘ఈడబ్ల్యూఎస్’కు సంబంధించిన చిన్న లేఖక దోషాల వల్ల చాలామంది విద్యార్థులను ఈ ఏడాది మెయిన్స్ పరీక్ష రాయడానికి అనుమతించకుండా వారి అడ్మిట్ కార్డులను రద్దు చేసింది యూపీఎస్సీ. దీన్ని ‘ప్రో బోనో’(ప్రజా సంక్షేమార్థం) కేసుగా తీసుకున్నాం. అడ్మిట్ కార్డులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇవ్వాళ యూపీఎస్సీని నిర్దేశించింది.
– ఆతిశ్ మాథుర్, న్యాయవాది

మంచి మనిషి



స్పెయిన్‌లో పేషెంట్లను ఉచితంగా హాస్పిటల్‌కు తీసుకెళ్లిన ఒక ట్యాక్సీ డ్రైవర్‌కు అదే హాస్పిటల్ నుంచి ఇంకో పేషెంట్‌ను తీసుకెళ్లమని కాల్ వచ్చింది. రాగానే, ఆయన్ని ఆశ్చర్యపరుస్తూ – డాక్టర్లు, నర్సులు నిలబడి చప్పట్లతో జేజేలు పలికారు (వీడియో షేర్ చేశారు).
– హరీందర్ సింగ్ కుక్రేజా, ఆంట్రప్రెన్యూర్

ఎందుకు సిగ్గుపడాలి?



గతంలో నేను భయానికి గురైన చిన్నారిని. ఇప్పుడు శక్తిమంతురాలైన మహిళను. సిగ్గు పడాల్సింది అత్యాచారం జరిపినవాళ్లు, ఆ బాధకు గురైనవాళ్లు కాదు. ఈ సాధికారతా ప్రచారాన్ని మొదలుపెట్టిన ఎమ్మా జేన్ టేలర్‌కు ధన్యవాదాలు (‘నాట్ మై షేమ్’ అనివున్న టీ షర్ట్‌ను ధరించిన ఫొటోను షేర్ చేశారు).
– నదియా జమీల్, నటి

పగటి కలలు



అంతర్గత భద్రతను సాధించకుండా, పొరుగు దేశాలతో శాంతిని నెలకొల్పకుండా ఏ దేశం కూడా సూపర్ పవర్ కాలేదు. చరిత్ర చెప్పే పాఠం ఇదే. కాబట్టి మనల్ని మనం మభ్యపెట్టుకోవడం ఆపుదాం. మనం ఇంకా చాలా దూరం ప్రయాణించాలి. ఉమ్మడిగా ఆ లక్ష్య సాధన కోసం పనిచేద్దాం.
– నీరా చందోక్, డిస్టింగ్విష్డ్ ఫెలో

మీరా మాట్లాడేది?



అజహరుద్దీన్ నుంచి జహీర్ నుంచి భారత్‌లో ఎందరో మైనారిటీ క్రికెటర్లు. ఇప్పుడు సిరాజ్. అదే పాకిస్తాన్‌లో ఒక్క క్రిస్టియన్ ఆటగాడు యూసుఫ్ యొహానా ఉండేవాడు. ఆయన్ని కూడా బలవంతాన మతం మారేలా చేశారు. డానిష్ కనేరియా అయితే బహిరంగంగా తన జట్టు సభ్యులను విమర్శించాడు. మళ్లీ వాళ్లు లౌకికవాదం గురించి మాట్లాడుతారు.
– జాఫర్, వ్యాఖ్యాత

మనకు తెలియని మన చరిత్ర

సందర్భం




అఫ్సర్

చరిత్ర పుటలు కొన్ని ఎందుకో చిరిగిపోతాయి. ఏ గాలులకో ఎగిరి ఎటో వెళ్లిపోతాయి. అంత దూరం నుంచే కొన్నిసార్లు వాటి మీది నెత్తుటి మరకలు కనిపిస్తూ ఉంటాయి. హైదరాబాద్ ఎంత అందమైన నగరమో! కానీ, ఈ నగరం కడుపులో చాలా గుండె కోతలున్నాయి. కదిలిస్తే చాలు, కన్నీరు పెల్లుబికే ఘటనలూ ఉన్నాయి. అలాంటిదే 1948 సెప్టెంబర్ 14 నుంచి 18 దాకా అయిదు రోజుల పాటు జరిగిన పోలీసు చర్య.

అప్పుడు దేశమంతా స్వాతంత్ర్య వేడుకల సంబరాలు జరుగుతున్నాయి. కానీ, ఇండియా – పాకిస్తాన్ సరిహద్దులు మాత్రం విభజన విషాదంలో కూరుకుపోయి ఉన్నాయి. ఆ విషాదానికి మతం లేదు. దానికి ఎర అయినవాళ్ళల్లో ముస్లింలు మాత్రమే లేరు. అంతే సంఖ్యలో హిందువులూ ఉన్నారు. ఆ వలసలూ, కన్నీటి కథలూ సరిహద్దులకే పరిమితం కాలేదు. సరిహద్దులకు దూరంగా ఉన్న ప్రాంతాలు కూడా విభజన రేఖ కింద నలిగి పోయాయి. ఆ విభజన విషాదాన్ని అనేక కోణాల నుంచి చరిత్ర నమోదు చేసింది. కానీ, హైదరాబాద్ వేదన మాత్రం అధికారిక చరిత్ర పేజీల బరువు కింద అణగిపోయింది. నిజాం రాజు స్వయం ప్రతిపత్తి కోరుకోవడంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం బలవంతంగా హైదరాబాద్ స్టేట్‌ని యూనియన్‌లో విలీనం చేసుకుంది. నిజాంనీ, స్థానిక రాజకీయ శక్తుల్నీ అణచివేయడానికి యూనియన్ మిలిటరీ రంగంలోకి దిగింది. అదే ‘పోలీసు చర్య’. నిజానికిది మిలిటరీ దురాక్రమణ అని అప్పటి చరిత్రకారులు రాశారు. జాతీయ వాదం పేరుతో ముస్లింల ఏరివేత జరిగింది. అసలైన రజాకార్లు సరిహద్దులు దాటివెళ్లిపోతే, ఇక్కడ సామాన్య ముస్లింలు మాత్రం రోజువారీ హింసలకి గురయ్యారు.

ఈ పోలీసు చర్య జరిగిన వెంటనే నెహ్రూ నియమించిన ‘సుందర్ లాల్ కమిటీ’ హైదరాబాద్, దక్కన్‌లలో అనేక ప్రాంతాలలో కాళ్ళకి బలపం కట్టుకొని తిరిగింది. కొన్ని వందలమంది బాధితులనీ, పోలీసు చర్య సాక్షులనూ ఇంటర్వ్యూలు చేసింది. ఆ కమిటీ తేల్చిందేమిటంటే: కేవలం అయిదు రోజుల్లో కొన్ని వేల మంది ముస్లింలను పోలీసు చర్య పేరుతో బలి తీసుకున్నారు. ఇంకా కొన్ని వేల మంది పాకిస్తాన్‌తో సహా ఇతర దేశాలకు వలస వెళ్లారు. ఇదే సమయంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని అణచివేయడానికి కూడా పోలీసు చర్య ఒక ముసుగుగా మారింది.

అయితే, ఆ కమిటీ నివేదికను ‘జాతీయ భద్రత’ పేరుతో మొన్న మొన్నటిదాకా బయటికి తీయలేదు ప్రభుత్వం. హైదరాబాద్ చరిత్రను అధ్యయనం చేస్తున్న పరిశోధకుల కృషి ఫలితంగా ఈ నివేదిక పూర్తి పాఠం చివరికి బ్రిటిష్ లైబ్రరీలో బయటపడింది. నిజానికి ఆ నివేదిక చెప్పని కథలు ఇంకా చాలా ఉన్నాయి. అవి ఏ చరిత్రలోనూ, ఏ నివేదికలోనూ, ఏ పత్రాల్లోనూ నమోదు కాలేదు. 1948 నుంచి అయిదారేళ్ళ పాటు హైదరాబాద్ కేంద్రంగా అచ్చయిన కొన్ని కథల్లో, ఆత్మకథల్లో, నవలల్లో, వ్యక్తిగత జ్ఞాపకాల్లో మాత్రమే అవి మిగిలిపోయాయి. అంతేకాకుండా, ఆ రక్తపాతాన్నీ, అణచివేతనీ కళ్ళారా చూసిన వాళ్ళలో చాలా మంది మొన్న మొన్నటి కోవిడ్ లోనో, వయోభారం మీద పడడం వల్లనో కన్ను మూశారు. అదే సమయంలో హైదరాబాద్ కేంద్రంగా వెల్లువెత్తిన సాంస్కృతిక, సాహిత్య, సామాజిక మార్పులు తెలంగాణకి దిక్సూచి అయ్యాయి.



చరిత్రను అర్థం చేసుకోడానికి అధికారిక పత్రాలు కొంతమేరకే పనికి వస్తాయి. సాధారణ జన జీవనంలోకి వెళ్ళి, ఆ చరిత్రను అవగాహన చేసుకుంటే, అట్టడుగున పడివున్న చరిత్ర బయటికి వస్తుంది. 1998లో హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో అద్వానీ ఈ పోలీసు చర్యను ‘‘హైదరాబాద్ విముక్తి ఉత్సవం’’గా ప్రకటించిన తరవాత అసలు సంఘటన మీద అనేక కొత్త పొరలు కమ్ముకొచ్చాయి. ఇది నిజంగా విముక్తి ఉత్సవమా? లేకపోతే, హిందూత్వం దీన్ని తిన్నగా తన ముస్లిం వ్యతిరేక అజెండాలోకి మార్చుకుందా అన్న ప్రశ్నలూ తలెత్తాయి. అలాంటి ‘‘రాజకీయ’’ కథనాల మధ్య అసలు కథను ఎలా అర్థం చేసుకోవాలన్న ప్రశ్న ఇప్పటి తరాన్ని సతమతం చేస్తోంది. ఆ సతమతం చేయడంలో మతం పాత్ర కూడా తక్కువేమీ కాదు. మతం పాత్రను గుర్తిస్తూనే, ఒక సామాన్యుడి బతుకు సమరాన్ని అర్థం చేసుకోవాల్సిన సందర్భం ఇది. సామాన్యుడి జీవితమే కేంద్రంగా, హిందూ–ముస్లింల ఉమ్మడి సంస్కృతి ఆధారంగా రూపుదిద్దుకున్న కొత్త హైదరాబాద్ చరిత్రను తెలుసుకోవాలి.

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత
(‘రీ మేకింగ్ హిస్టరీ: 1948 పోలీస్ యాక్షన్ అండ్ ది ముస్లిమ్స్ ఆఫ్ హైదరాబాద్’ పేరుతో వ్యాసకర్త రాసిన పుస్తకాన్ని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఈ నెలలో ప్రచురించింది.)

బ్రిక్స్ దేశాలు సాధించింది శూన్యం

అభిప్రాయం



పంకజ్ మిశ్రా

దక్షిణాఫ్రికా వేదికగా ‘బ్రిక్స్’ దేశాల 15వ సమావేశం ముగిసింది. అంతర్జాతీయ సమాజం ఈ సమావేశాలపై అనూహ్యంగా తన దృష్టిని కేంద్రీకరించింది. వ్యాఖ్యాతలు కొందరు ఇంకో అడుగు ముందుకేసి దీన్ని 1955 నాటి బండుంగ్ (ఇండోనేషియా) సమావేశాలతో పోల్చారు. బండుంగ్ వేదికగానే భారత్ సహా చైనా, ఇండోనేషియా, ఈజిప్ట్ యుగొస్లావియా కలసికట్టుగా అలీనోద్యమాన్ని ప్రకటించాయి. తాజా సదస్సులో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా నవతరం నేతలు అమెరికా ఆధిపత్య ప్రపంచానికి ప్రత్యామ్నాయాన్ని సృష్టించే ప్రయత్నం చేసినంత హడావిడి జరిగింది.

ప్రత్యామ్నాయం ఏమిటి?

అయితే... సమావేశాలు నడుస్తున్న కొద్దీ వీటి డొల్లతనం ఇట్టే బయటపడింది. ఆతిథ్య దేశమైన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి రాకపోవడంతో, భారత ప్రధాని నరేంద్ర మోదీ విమానంలోంచి దిగేందుకు నిరాకరించినట్లు ప్రముఖ దక్షిణాఫ్రికా వెబ్‌సైట్ ఓ వార్త ప్రచురించింది. ఇతర నాయకులతో పాటు వీడియో లింక్ ద్వారా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉపన్యసించిన ప్రారంభ సమావేశంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కారణం చెప్పకుండా, ఇవ్వాల్సిన ఉపన్యాసం ఇవ్వలేదు.

యుద్ధ నేరాల పేరుతో ఎక్కడ తనను అరెస్ట్ చేస్తారో అన్న భయంతో దక్షిణాఫ్రికాకు రాలేకపోయిన పుతిన్ యథావిధిగానే ఉక్రెయిన్ మీద తమ యుద్ధానికి బాధ్యత పాశ్చాత్య దేశాలదేనని నిందించారు. చైనా అధ్యక్షుడు తన ప్రసంగంలో పేరు చెప్పకుండా, కానీ దేని గురించో తెలిసేట్టుగా ఒక దేశం ‘తన ఆధిపత్యాన్ని ఎలాగైనా కొనసాగించాలన్న పంతంతో’ ఉందనీ, చైనా ప్రగతిని అడ్డుకుంటోందనీ వ్యాఖ్యానించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా ప్రసంగం మాత్రం కొంత కల్లోలం చేసిందని చెప్పాలి. డీ–డాలరైజేషన్, బ్రిక్స్‌కు ప్రత్యామ్నాయం వంటి అంశాలపై ఈయన మాట్లాడారు. కానీ ఏ ఫలితమూ రాలేదు.

బ్రిక్స్ సభ్యదేశాల సంఖ్యను పెంచే విషయంతో ఈ శిఖరాగ్ర సమావేశాలు ముగిశాయి. సంక్షోభంలో ఉన్న అర్జెంటీనా, ఇథియోపియాలతోపాటు చమురు నిల్వలు పుష్టిగా ఉన్న సౌదీ అరేబియా, ఇటీవలిదాకా దీని ప్రత్యర్థి దేశం ఇరాన్ ఇప్పుడు బ్రిక్స్ బృందంలో చేరనున్నాయి. అయితే ఏ ప్రత్యామ్నాయ సంస్థలు బ్రిక్స్ నిర్మిస్తుందో మాత్రం స్పష్టం కాలేదు. ఈ అంశాలపై స్పష్టత ఇవ్వడం కోసం జరగాల్సిన విలేఖరుల సమావేశాన్ని కాస్తా, జర్నలిస్టులకు ‘విశ్రాంతి’ పేరుతో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా చివరి నిమిషంలో రద్దు చేశారు.

అమెరికా సెక్యూరిటీస్ సంస్థలో పెట్టుబడులను రాబట్టేందుకు ఓ బ్రిటిష్ ఆర్థికవేత్త యథాలాపంగా పెట్టిన ‘సంక్షిప్త నామం’తో నడుస్తున్న బ్రిక్స్ సదస్సు నుంచి ఇంతకంటే గొప్పగా ఏమీ ఆశించలేము. అయితే అమెరికా నేతృత్వంలోని వ్యవస్థకు ప్రతిగా ఏర్పాటైన చాలా ముఖ్యమైన సంస్థ బ్రిక్స్ అని డబ్బా కొట్టుకోవడాన్ని మాత్రం ఎలా పరిహరించవచ్చో ఆలోచించాలి. పాశ్చాత్య దేశాల భాగోగోళిక, ఆర్థిక పెత్తనానికి చెక్ పెట్టేందుకు ఒక దీటైన సంస్థ కోసం ప్రపంచం శతాబ్దానికి పైగా ఎదురు చూస్తోంది. అయితే ఇలాంటి ఓ సంస్థ ప్రాముఖ్యతను గుర్తించడంలో పాశ్చాత్య జర్నలిస్టులు విఫలమవుతూండటం విచారకరం.



దూరదృష్టి కరవు

ఒక విషయమైతే స్పష్టం. బ్రిక్స్‌కూ, అలీనోద్యమానికీ ఏమాత్రం సారూప్యత లేదు. 1950లు అంటే ఇండియా, ఈజిప్టు, చైనా... జాతీయోద్యమాలు, వలస పాలనకు వ్యతిరేక సంఘర్షణల నుంచి అప్పుడప్పుడే బయట పడుతున్న కాలం అది. ఆర్థికాభివృద్ధి విషయంలో అందరికీ సమాన అవకాశాలిచ్చే అంతర్జాతీయ వ్యవస్థ ఒకటి అవసరమని అప్పటి నాయకులు నిజాయితీగా నమ్మారు. ఈ నమ్మకంలో భాగంగానే న్యూ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఆర్డర్ వంటివి బయటకు వచ్చాయి. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే... బండుంగ్ సమావేశపు ప్రతి నిధులకు ఉన్న దార్శనికత, దూరదృష్టి దక్షిణాఫ్రికా బ్రిక్స్ సదస్సులో అస్సలు కనిపించకపోవడం. వాస్తవానికి మారిపోతున్న పరిస్థితుల్లో తామేం చేయాలన్నది ఇప్పుడిప్పుడే వీళ్లు నేర్చుకుంటున్నట్టుగా కనిపిస్తుంది.

కొత్తగా చేరిన సభ్యులతో సహా అన్ని బ్రిక్స్ దేశాల సాధారణ ‘విజన్’ ఏంటంటే– వాణిజ్యం, టెక్నాలజీ, మిలిటరీ ఒప్పందాల్లో తమకు ప్రాధాన్యం ఎక్కువ ఉండేలా అమెరికా, యూరప్‌లతో బేరాలు సాగించగలగడం. ఇంతకంటే భిన్నంగా ఉండే అవ కాశం లేదు.

భారత్‌నే ఉదాహరణగా తీసుకుందాం. వ్యూహాత్మకంగా శత్రువైనప్పటికీ చైనా నుంచి చౌక వస్తువులు కావాలి. చౌక ధరల్లో రష్యా నుంచి ముడి చమురు కావాలి. మిలిటరీ టెక్నాలజీ, ఆయుధాల్లాంటివి అమెరికా, యూరప్‌ల నుంచి తెచ్చుకోవాలి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి పెట్టుబడులూ కావాలి. అందుకు తగ్గట్టుగానే భారత్ విదేశాంగ విధా నమూ ఉంటుంది. ఒంటరిగానైనా, గుంపుగానైనా ఆయా దేశాలకు కట్టుబడి ఉండేలా వ్యవహరిస్తుందన్నమాట! గ్లోబల్ సౌత్‌కు నేతృత్వం వహిస్తున్నామనీ, అందుకే వరి, చక్కెరల ఎగుమతులపై నిషేధం విధిస్తున్నామనీ కూడా భారత్ ప్రకటించుకోలేదు. ఈ విషయంలో చైనాకు ఎంతో కొంత మంచి పేరున్నా... రోజురోజుకూ ముదిరిపోతున్న ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోవడంలోనే ఆ దేశం తలమునకలై ఉంది. సభ్యులు, పెరిగినా, తగ్గినా బ్రిక్స్‌తో ప్రయోజనం శూన్యమని అర్థం చేసుకునేందుకు బహుశా వచ్చే ఏడాది రష్యాలో జరగనున్న సదస్సు వరకూ వేచి చూడాల్సిన అవసరం లేదేమో!

వ్యాసకర్త నవలా రచయిత, సామాజిక విశ్లేషకుడు
(‘బ్లూమ్‌బర్గ్’ సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: అమావాస్య పూర్తి (24గంటలు), నక్షత్రం: పుబ్బ తె.5.09 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి ఉత్తర, వర్జ్యం: ఉ.11.26 నుండి 1.12 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.55 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.46 నుండి 3.35 వరకు, అమృతఘడియలు: రా.10.03 నుండి 11.34 వరకు, పోలాల అమావాస్య : రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.03.

క్లుప్తంగా...

విషమంగానే డి.శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ఆయన రక్తపోటును నియంత్రించేందుకు, శ్వాసక్రియను మెరుగుపరిచేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సిటీ న్యూరో ఆసుపత్రి తాజాగా హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. శ్వాస కోస వ్యాధులతో తీవ్రంగా బాధపడుతున్న సీనియర్ నేత.. శ్రీనివాస్ సెప్టిక్ షాక్‌లో ఉన్నారని రక్తపోటు నియంత్రణకు చికిత్స అందిస్తున్నామని, నాన్ ఇన్వాసివ్ వెంటిలేషన్, వాసోప్రెసర్ సపోర్ట్‌పై ఇంటెన్సివ్ కేర్‌లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని బులెటిన్ వెల్లడించింది.

నాడు మాట ఇచ్చాం.. నేడు నిలబెట్టుకున్నాం



నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నాడు మాట ఇచ్చి.. నేడు నిలబెట్టుకుంటున్నామని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పాల మూరు–రంగారెడ్డి ఎత్తిపోతలతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సస్య శ్యామలం అవుతుందన్నారు. ఈ నెల 16న నార్లాపూర్ పంప్‌హౌస్ వెట్‌రన్ ప్రారంభానికి, కొల్లాపూర్‌లో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగసభకు పాలమూరు ప్రతి పల్లె నుంచి ప్రజలు కదిలిరావాలని బుధవారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. జూరాల బ్యాక్‌వాటర్ నుంచి పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల అనే వాదన హాస్యాస్పదమన్నారు. జూరాల రిజర్వాయర్ సామర్థ్యం 9 టీఎంసీలు, అందుబాటులో ఉండేది 6 టీఎంసీలన్నారు. 6 టీఎంసీల నీళ్లుండే జూరాల నుంచి 70 టీఎంసీల పాలమూరు–రంగారెడ్డికి నీళ్లు ఎత్తిపోయడం సాధ్యమయ్యే పనేనా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమాన్ని పక్కదారి పట్టించడం, పాలమూరు ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు హడావుడిగా దానిని ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో 263 టీఎంసీల సామర్థ్యంగల శ్రీశైలం బ్యాక్‌వాటర్ ప్రాంతం నుంచి పాల మూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు నీళ్లు తీసుకుంటున్నారన్నారు.


అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ. 2 కోట్ల విలువగల బంగారం, వజ్రాల పట్టివేత

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్టెవాడ, హనుమకొండ, సుబేదారి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 అపార్ట్ మెంట్లలో చోరీలకు పాల్పడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు సీపీ రంగనాథ్ తెలిపారు. ఈ నెల 5న వరంగల్ నగరంలోని 9 అపార్ట్‌మెంట్లలో వరుస చోరీలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముఠాను అరెస్ట్ చేశారు. బుధవారం కమిషనరేట్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టిన సీపీ వారి వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌కు చెందిన అక్బర్ ఖురేషీ, మీరట్ జిల్లాకు చెందిన కపిల్ జాటోవు, ఘజియాబాద్‌కు చెందిన మహ్మద్ షరీఫ్, మహ్మద్ షహజాద్ ఖాన్‌లు ఈ నెల 5న వరంగల్‌లోని తొమ్మిది అపార్ట్‌మెంట్లలో వరుస చోరీలు చేశారని తెలిపారు. వీరినుంచి రూ.2 కోట్ల విలువగల 2 కిలోల 380 గ్రాముల బంగారు, వజ్రాభరణాలు, రూ.5.20 లక్షల విలువగల 104 కిలోల గంజాయి, ఒక పిస్తోల్, 5 రౌండ్ల బుల్లెట్లు, కారు, 4 సెల్‌ఫోన్లు, 2 వాకీటాకీలు, 4 నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వివరించారు.

పరిహారం దక్కడం లేదని..

- భూ నిర్వాసితుడి ఆత్మహత్య




అల్లోజీ

సాక్షి, నాగర్‌కర్నూల్: తమకున్న భూమి మొత్తం రిజర్వాయర్ కింద కోల్పోవాల్సి రావడం.. ప్రభుత్వం నుంచి న్యాయమైన పరి హారం అందడం లేదన్న మనస్తాపంతో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం సమీపంలోని కుమ్మెర గ్రామానికి చెందిన అనంత అల్లోజీ (45)తోపాటు ముగ్గురు సోదరులకు కలిపి మొత్తం 19 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కింద చేపట్టిన వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ కోసం వీరికి చెందిన 19 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. బోరు సౌకర్యం ఉన్న భూమిలో ఎకరాకు రూ.5.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించడంతో న్యాయమైన పరిహారానికి 2019లో అల్లోజీ కుటుంబం హైకోర్టును ఆశ్రయించింది. మొదటి విడత పరిహారం కింద ఎకరాకు రూ.2.04 లక్షల చొప్పున ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెప్పారు. ఓ వైపు తమ భూమి మొత్తం రిజర్వాయర్‌లో కోల్పోతుండటం, రూ.లక్షల విలువైన భూమికి సరైన పరిహారం దక్కడం లేదన్న మనస్తాపంతో అల్లోజీ మంగళవారం రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్టు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. అల్లోజీకి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

రిజర్వాయర్ల నీళ్లు.. పూడిక పాలు!

- ఏటేటా పూడుకుపోతున్న శ్రీశైలం, నాగార్జునసాగర్
- 253 టీఎంసీలకు నుంచి 188 టీఎంసీలకు తగ్గిపోయిన శ్రీశైలం లైవ్ స్టోరేజీ
- 202 టీఎంసీల నుంచి 189 టీఎంసీలకు పడిపోయిన సాగర్ లైవ్ సామర్థ్యం
- సీడబ్ల్యూసీ, రిమోట్ సెన్సింగ్ డైరెక్టరేట్ సర్వేలలో వెల్లడి
- నీటి నిల్వ తగ్గడంతో భవిష్యత్తులో తాగు, సాగునీటికి కష్టాలు
- పూడిక నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సీడబ్ల్యూసీ సూచనలు



శ్రీశైలం



నాగార్జునసాగర్

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదిపై ఉన్న కీలక ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం భారీగా తగ్గిపోతోంది. ఏటేటా పూడిక పేరుకుపోతుండటంతో.. శ్రీశైలం లైవ్ స్టోరేజీ (వాడుకోదగిన నీళ్లు) సామర్థ్యం 253.058 టీఎంసీల నుంచి 188.71 టీఎంసీలకు.. నాగార్జునసాగర్ లైవ్ స్టోరేజీ సామర్థ్యం 202.47 టీఎంసీల నుంచి 189.295 టీఎంసీలకు పడిపోయింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), రిమోట్ సెన్సింగ్ డైరెక్టరేట్, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ (ఎస్‌ఆర్‌ఎస్)' సర్వేలలో ఈ అంశం వెల్లడైంది. జలాశయాల్లో గరిష్ట, కనిష్ట నీటి మట్టాల పరిస్థితిని సెంటినల్ 1ఏ/ఏబీ ఉపగ్రహాల డేటా ఆధారంగా పరిశీలించి, విశ్లేషించడం పూడిక పరిస్థితిపై నివేదికను సిద్ధం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే రెండు రాష్ట్రాలు తాగు, సాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

13.182 టీఎంసీలు తగ్గిన సాగర్ సామర్థ్యం

నాగార్జునసాగర్ డ్యామ్‌ను 1956–1968 మధ్య నిర్మించారు. అప్పట్లో జలాశయం లైవ్ స్టోరేజీ సామర్థ్యం 202.47 టీఎంసీలుకాగా, 1999లో నిర్వహించిన శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ సర్వేలో సామర్థ్యం 195.806 టీఎంసీలకు తగ్గిపోయిందని తేలింది. 2001, 2009లలో నిర్వహించిన రిజర్వాయర్ హైడ్రోగ్రాఫిక్ సర్వేలలో మాత్రం సాగర్ లైవ్ స్టోరేజీ సామర్థ్యం వరుసగా 217.47 టీఎంసీలు, 213.388 టీఎంసీలని తేలింది. తాజాగా శాటిలైట్ డేటాను విశ్లేషించగా.. 2020 నాటికి సాగర్ లైవ్ స్టోరేజీ సామర్థ్యం 189.295 టీఎంసీలకు తగ్గినట్టు తేలింది. అంటే 1968–2020 మధ్య 52 ఏళ్లలో 13.182 టీఎంసీల (6.511శాతం) నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయింది. సగటున ఏటా 0.125 శాతం నిల్వ సామర్థ్యాన్ని నష్టపోతోంది.

శ్రీశైలానికి 64.339 టీఎంసీల నష్టం

కృష్ణా నదిపై శ్రీశైలం జలాశయాన్ని 1981లో నిర్మించగా.. 1984 నుంచి నీళ్లను నిల్వ చేస్తున్నారు. 253.058 టీఎంసీల లైవ్ స్టోరేజీ, 55 టీఎంసీల డెడ్ స్టోరేజీ (అడుగున ఉండి వినియోగించుకోవడానికి వీల్లేని నీళ్లు) కలిపి మొత్తం 308.06 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. తాజా అధ్యయనంలో శ్రీశైలం లైవ్ స్టోరేజీ 188.71 టీఎంసీలకు తగ్గినట్టు తేలింది. అంటే 1984–2021 మధ్య 37 ఏళ్లలో శ్రీశైలం ఏకంగా 64.339 టీఎంసీల (25.425శాతం) సామర్థ్యాన్ని నష్టపోయిందని, ప్రాజెక్టు ఏటా 0.687 శాతం లైవ్ స్టోరేజీని కోల్పోతోందని వెల్లడైంది. ఇంతకుముందు 1990, 1999లలో నిర్వహించిన రిమోట్ సెన్సింగ్ సర్వేల్లో శ్రీశైలం లైవ్ స్టోరేజీ సామర్థ్యం 194.437 టీఎంసీలు, 181.95 టీఎంసీలకు తగ్గిపోయినట్టు గుర్తించారు. తాజా సర్వేతో పోల్చితే 1990, 1999 నాటి సర్వేలు ఎక్కువ నష్టం జరిగినట్టు పేర్కొన్నా.. అప్పట్లో వాటర్ స్ప్రెడ్ ఏరియాను సరిగ్గా అంచనా వేయక కచ్చితమైన ఫలితం రాలేదని తాజా సర్వేలో సీడబ్ల్యూసీ పేర్కొంది.

పూడికను నివారించేదిలా?

జలాశయాల్లో పూడికను తొలగించడం అత్యంత ఖర్చుతో కూడిన పని అని.. ఆ ఖర్చుతో కొత్త జలాశయమే నిర్మించవచ్చని నిపుణులు చెప్తున్నారు. అయితే తక్కువ ఖర్చు, సులువుగా జలాశయాల్లో పూడిక చేరకుండా నివారించవచ్చని సీడబ్ల్యూసీ చెప్తోంది. ఈ మేరకు తమ నివేదికలో పలు సిఫారసులు చేసింది.

- అడవుల నిర్మూలన, చెట్ల నరికివేతతో వరదల వేగం పెరిగి జలాశయాల్లో పూడిక చేరుతుంది. దీనిని అడ్డుకునేందుకు పరీవాహక ప్రాంతాల్లో విస్తృతంగా చెట్లను పెంచాలి.
- నదీ తీరాల్లో రివిట్‌మెంట్లు, చెట్లతో పరీవాహక ప్రాంతం కోతకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి.
- నదుల్లో ఎక్కడికక్కడ నీళ్లను నిల్వ చేసేలా కాంటూర్ గుంతలు, చెక్ డ్యాంలు, చిన్న రిజర్వాయర్లు నిర్మిస్తే వరదల వేగం తగ్గి.. పెద్ద జలాశయాల్లోకి పూడిక రాదు.
- వ్యవసాయ పద్ధతుల్లోనూ మార్పు తేవాలి. భూమిని దున్ని వదిలేస్తే వేగంగా కోతకు గురై నదుల్లోకి మట్టి చేరుతుంది.
- రిజర్వాయర్లలోకి రాక ముందే మధ్యలోనే ఎక్కడికక్కడ పూడికను తొలగించాలి.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం తన నివాసంలో ఆయుత చండీయాగం నిర్వహించారు

- యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనలను ఉల్లంఘించిన ప్రైవేటు యూనివర్సిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గురునానక్, శ్రీనిధి వర్సిటీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన విద్యార్థుల ప్రవేశాలతో తలెత్తిన ఇబ్బందులు, రాష్ట్రంలోని 9 ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలు యూజీసీ నిబంధనలు ఉల్లంఘిస్తున్న తీరుపై డాక్టర్ ఎ.సతీశ్ ఫిర్యాదు చేశారు.

విద్యుత్ వైరు తెగిపడి.. దంపతుల మృతి



అంజయ్య, జంగమ్మ

వలిగొండ: పొలంలో గడ్డి కోస్తుండగా స్తంభం పైనుంచి విద్యుత్ వైరు తెగి పడడంతో విద్యుదాఘాతానికి గురై భార్యాభర్తలు మృతిచెందారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని నాగారం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. నాగారం గ్రామానికి చెందిన బండ అంజయ్య (50), జంగమ్మ(45) దంపతులు బుధవారం సాయంత్రం తమ పొలంలో గడ్డికోసే యంత్రంతో వరాలకు ఉన్న గడ్డిని కోస్తున్నారు. ఈ క్రమంలో పొలం పక్కనే ఉన్న స్తంభంపైనుంచి కరెంట్ వైరు తెగి పడింది. అంజయ్య అది గమనించకపోవడంతో తెగిపడిన కరెంట్ వైరు గడ్డికోసే యంత్రానికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడిని కాపాడే ప్రయత్నంలో భార్య జంగమ్మ కూడా కరెంటు షాక్‌కు గురై మృతిచెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

పల్లె లక్ష్మణరావును కీలక పదవిలో నియమించాలి

- గౌడ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సభ్యుల తీర్మానం



సనత్‌నగర్ (హైదరాబాద్): తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావు గౌడ్‌ను ప్రభుత్వం కీలక పదవిలో వెంటనే నియమించాలంటూ ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గౌడ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం పల్లె లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం బేగంపేట పర్యాటక భవన్‌లోని ప్లాజా హోటల్‌లో జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి అధ్యక్షులతో పాటు ఇతర కమిటీ సభ్యులు హాజరై పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా తెలంగాణ జనాభాలో 14 శాతంగా ఉన్న గౌడ్‌ల కు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 10 అసెంబ్లీ, 3 లోక్‌సభ, 4 ఎమ్మెల్సీలు, 1 రాజ్యసభ స్థానాలను గౌడ సామాజిక వర్గానికే కేటాయించాలని తీర్మానించారు. స్థానిక ఎన్నికల్లో సైతం గౌడ్‌లకి తగిన ప్రాధాన్యత కల్పించిన పార్టీ లకే మద్దతుగా నిలుస్తామన్నారు. గౌడ్‌లకు మరిన్ని కార్పొ రేషన్లు కేటాయించాలని, మునుగోడు ఉప ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు గౌడ్‌లకి తక్షణమే ద్విచక్ర వాహనాలను అందించాలని కోరారు. జనగామ జిల్లాకి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే వచ్చే నెలలో లక్షమందితో గౌడ గర్జనను తల పెట్టాలని కమిటీ తీర్మానం చేసింది. కాగా, రాష్ట్ర, జిల్లా కార్యవర్గాలు మరింత చురుగ్గా పనిచేయాలని పల్లె లక్ష్మణరావు గౌడ్ సూచించారు.

ఓట్ల తొలగింపుపై దృష్టి సారించండి

- ఈసీకి బీజేపీ నేత శశిధర్‌రెడ్డి బృందం వినతి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఓట్ల తొలగింపుపై దృష్టి సారించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి బృందం విజ్ఞప్తి చేసింది. తెలంగాణలో ఓటరు జాబితా పరిశీలనకు ప్రత్యేక అధికారిని నియమించాలని విజ్ఞప్తి చేసింది. బుధవారం మర్రి శశిధర్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కేతినేని సరళ, కొల్లూరు పవన్‌కుమార్, వీఎస్ భరద్వాజ్, ఈ.అజయ్‌కుమార్ తదితరులు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్‌లతో సమావేశమయ్యారు. అనంతరం మర్రి శశిధర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ ఒత్తిడితో ఓట్ల తొలగింపు జోరుగా సాగుతోందని ఆరోపించారు. గేటెడ్ కమ్యూనిటీల్లో ఓట్లు నమోదు చేయడం లేదన్నారు. 19 వరకూ ఓటరు జాబితా రూపకల్పనకు గడువున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారిని పరిశీలనకు పంపాలని కోరగా.. కమిషన్ సానుకూలంగా స్పందించిందని శశిధర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఒకే ఇంటి నంబరుపై అనేక ఓట్లు నమోదవడంపై చర్యలు తీసుకోవాలని సీఈసీని కోరినట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

లిక్కర్ స్కామ్‌లో తెలంగాణ నేతల సంగతేమిటి?

- వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు?
- ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ కటకం మృత్యుంజయం

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం సిసోడియాను అరెస్ట్ చేసి, ఈ కేసులో ప్రమేయమున్న తెలంగాణ రాజకీయ నాయకులపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ కటకం మృత్యుంజయం ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మొదలు.. ముఖ్యనేతలంతా తెలంగాణలో అవినీతిపాలన సాగుతోందని, కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఏటీఎంగా మారిందని తీవ్ర విమర్శలు చేయడం తప్ప సిట్ ఏర్పాటు, మరేదైనా దర్యాప్తునకు ఎందుకు డిమాండ్ చేయడం లేదని నిలదీశారు. బీఆర్‌ఎస్ సర్కార్ అవినీతిపై బీజేపీ పోరాడుతుందనే నమ్మకం సన్నగిల్లడంతో ఆ పార్టీకి రాజీనామా చేసి ఏఐఎఫ్‌బీలో చేరినట్టు తెలిపారు. బుధవారం పార్టీనేతలు బి. సురేందర్‌రెడ్డి, ప్రసాద్, రామరాజు, దేశ్‌పాండేలతో కలసి మృత్యుంజయం మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 119 స్థానాలకు ఏఐఎఫ్‌బీ పోటీచేస్తుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు ఎవరి రాజకీయ అవసరాలు వారికున్నాయి కాబట్టి రాష్ట్రాన్ని ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కాళేశ్వరం ద్వారా ఏ ఒక్క నియోజకవర్గంలోనైనా పదివేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారన్నది నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. ఈసారి జమిలి ఎన్నికలు జరిగే అవకాశాలు లేవని, ప్రజలను మభ్యపెట్టేందుకే కొందరు జమిలి అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను మించిన తెలంగాణ ద్రోహులు మరెవరూ లేరని మండిపడ్డారు.

అప్రూవర్‌గా మారిన అరుణ్ పిళ్లై!



సాక్షి, న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ రామచంద్ర పిళ్లైఅప్రూవర్‌గా మారినట్లు తెలిసింది. బుధవారం పిళ్లైప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వద్ద ఈ మేరకు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. కాగా ఈడీ అధికారులు ఇప్పటివరకు దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

ఇక 'లెవల్' క్లియర్

లెవల్ క్రాసింగ్స్ లేకుండా రైల్వే లైన్లు

- రోడ్లు దాటే చోట్ల స్థాయిని బట్టి ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణం
- ప్లానింగ్ సమయంలోనే నిర్ధారణ..
- తదనుగుణంగానే ప్రాజెక్టు అంచనా
- ఇప్పటికే పనులు మొదలైన ప్రాజెక్టులకూ వర్తింప చేయాలని రైల్వేశాఖ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారుల తరహాలో క్రాసింగ్స్ లేకుండా రైల్వే లైన్లను నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. రైలు మార్గాన్ని రోడ్లు క్రాస్ చేసే ప్రాంతాల్లో, వాటి మీదుగా వెళ్లే వాహనాల రద్దీ ఆధారంగా రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, రోడ్ అండర్ బ్రిడ్జీలు, తక్కువ ఎత్తున్న అండర్‌పాస్‌లను నిర్మించనున్నారు. ప్రాజెక్టు ప్రణాళికల సమయంలోనే ఇందుకు ఏర్పాట్లు చేసి అంచనా వ్యయాన్ని నిర్ధారించనున్నారు. ప్రస్తుతం కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారుల్లో ఎక్కడా ఇతర రోడ్లు క్రాస్ చేయకుండా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే తరహాలో రైల్వే లైన్లను కూడా నిర్మించాలని తాజాగా రైల్వే శాఖ నిర్ణయించింది. నిర్ణయించటమే కాకుండా వెంటనే అమలులోకి తెచ్చింది.

ఇప్పటికే మొదలైన ప్రాజెక్టుల్లో సైతం: ఈ నిర్ణయం తీసుకునేసరికే మొదలై పనులు జరుగుతున్న ప్రాజెక్టుల విషయంలోనూ దీన్ని అమలు చేయాలని నిర్ణయించటం విశేషం. ప్రస్తుతం రాష్ట్రంలో మనోహరాబాద్–కొత్తపల్లి కొత్త లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇది కీలక ప్రాజెక్టు. మేడ్చల్ సమీపంలోని మనోహరాబాద్ స్టేషన్ నుంచి ఈ కొత్త లైన్ మొదలై గజ్వేల్, సిద్దిపేట మీదుగా కొత్తపల్లి (కరీంనగర్ సమీపం) వరకు ఇది కొనసాగుతుంది. ప్రస్తుతం సిద్దిపేట వరకు పనులు పూర్తయ్యాయి. గజ్వేల్ సమీపంలోని కొడకండ్ల–సిద్దిపేట మధ్య ఈనెల 15న రైల్వే సేఫ్టీ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఇది పూర్తి అయ్యాక వీలైనంత తొందరలో సిద్దిపేట నుంచి రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధమవుతోంది. ఈమేరకు అనుమతి ఇవ్వాల్సిందిగా రైల్వే బోర్డుకు లేఖ కూడా రాసింది. ఈ ప్రాజెక్టులో కీలక ప్రాంతాల్లో ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు ప్లాన్ చేసినా.. ఇంకా నాలుగు లెవల్ క్రాసింగ్స్ ఉన్నాయి.

మనోహరాబాద్–కొత్తపల్లి లైన్‌లోని ఆ నాలుగు లెవల్ క్రాసింగ్స్ కూడా తొలగింపు

తాజాగా రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం మేరకు, ఆ నాలుగు లెవల్ క్రాసింగ్స్‌ను కూడా తొలగించాలని నిర్ణయించటం విశేషం. గజ్వేల్ దాటిన తర్వాత ఉన్న కొడకండ్ల శివారులోని రామచంద్రాపూర్ రోడ్డు వద్ద లెవల్ క్రాసింగ్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు అక్కడ 3.5 మీటర్ల ఎత్తుతో లిమిటెడ్ ఆర్‌యూబీ నిర్మించాలని నిర్ణయించారు. కుకునూరుపల్లి దాటిన తర్వాత కొండపోచమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన లెవల్ క్రాసింగ్‌ను తొలగించి ఆర్‌యూబీ నిర్మించనున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొమురవెల్లికి వెళ్లే రెండో కమాన్ రోడ్డు వద్ద ఉన్న లెవల్ క్రాసింగ్‌ను తొలగించి దాదాపు అరకి.మీ. నిడివితో ఏడు మీటర్ల ఎత్తు గల ఆర్‌ఓబీని నిర్మించాలని నిర్ణయించారు. సిద్దిపేట శివారులోని రంగదామ్‌పల్లి లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యూబీ నిర్మించాలని నిర్ణయించారు.

ఇంకా 1,150 లెవల్ క్రాసింగ్స్...

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పాత లైన్ల మీద ఇంకా 1,150 వరకు లెవల్ క్రాసింగ్స్ ఉన్నాయి. కాపలా లేని క్రాసింగ్స్‌ను పూర్తిగా తొలగించినా, కాపలా ఉన్న లెవల్ క్రాసింగ్స్ ఇంకా కొనసాగుతున్నాయి. వాటిని దశల వారీగా తొలగించే పని జరుగుతోంది. కానీ, కొత్తగా చేపట్టిన, చేపట్టబోయే ప్రాజెక్టుల్లో మాత్రం అసలు లెవల్ క్రాసింగ్స్ ఉన్న ఊసే ఉండకపోవటం విశేషం.

క్లుప్తంగా...

కార్లలో 6 ఎయిర్‌బ్యాగ్స్ తప్పనిసరి కాదు: గడ్కరీ

న్యూఢిల్లీ: ప్యాసింజర్ కార్లలో ఆరు ఎయిర్‌బ్యాగుల నిబంధనపై కేంద్ర ఉపరితల రవాణా, జాతీయరహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టతనిచ్చారు. ఈ నిబంధనను తప్పనిసరి చేసే ఆలోచన ఏదీ ప్రభుత్వానికి లేదని ఆటోమొబైల్ పరికరాల తయారీ సంస్థల సమాఖ్య ఏసీఎంఏ వార్షిక సమావేశంలో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఈ నిబంధన అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఎయిట్ సీటర్ వాహనాల్లో తయారీ సంస్థలు తప్పనిసరిగా ఆరు ఎయిర్‌బ్యాగులు ఏర్పాటు చేసే నిబంధనను 2022 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని భావించింది. అయితే, అంతర్జాతీయంగా సరఫరాపరమైన సమస్యలు నెలకొన్న నేపథ్యంలో దానిని 2023 అక్టోబర్ ఒకటో తేదీకి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

పార్క్‌లో సరదాగా..

బార్ అసోసియేషన్ సభ్యులతో సీజేఐ

న్యూఢిల్లీ: నిత్యం కీలకమైన కేసుల విచారణ, వాదోపవాదనలను ఆలకించడంలో బిజీగా ఉండే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం కొద్దిసేపు అవన్నీ పక్కనబెట్టారు. మధ్యాహ్నం వేళ కొన్ని కేసుల వాదనలు విన్నాక మధ్యలో కొద్దిసేపు విరామం ప్రకటించారు. వెంటనే కొందరు జడ్జీలతో కలిసి అక్కడే ఉన్న ప్రముఖమైన సుప్రీంకోర్టు పార్క్‌లో కలియతిరిగారు. అక్కడికి వచ్చిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులతో సరదాగా మాట్లాడారు. అక్కడి కెఫెటేరియాలో టీ తాగారు. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలు సీజేఐతోపాటు నడిచారు.

బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానికి ఘన స్వాగతం

న్యూఢిల్లీ: ఇటీవల భారత్ సారథ్యంలో జీ20 శిఖరాగ్ర భేటీని విజయవంతంగా నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద ఘన స్వాగతం లభించింది. బుధవారం సాయంత్రం బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) సమావేశానికి హాజరైన సందర్భంగా ప్రధానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తదితరులు స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో హాజరైన పార్టీ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ప్రధానిపై పూల వర్షం కురిపిస్తూ కార్యాలయంలోకి ఆహ్వానించారు. జీ20 విజయవంతంగా ముగియడం, ప్రపంచ నేతలు మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించడం తెలిసిందే. ఈ భేటీ తర్వాత బీజేపీ ప్రధాన కార్యాలయంలోకి ప్రధాని రావడం ఇదే మొదటిసారి.

మేం మీ వెంటే..!

సామ్రాజ్యవాద శక్తులపై రష్యా పోరాటానికి బేషరతు మద్దతు ఇస్తున్నట్టు కిమ్ ప్రకటన

- ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని పరోక్షంగా సమర్థించిన ఉత్తర కొరియా నియంత
- రష్యాలోని వోస్తోక్నీ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో పుతిన్‌తో కిమ్ భేటీ
- మిలటరీ, అంతరిక్ష రంగాల్లో పరస్పర సాయంపై నాలుగు గంటల పాటు చర్చలు
- సోవియట్ కాలం నుంచీ ఉత్తర కొరియా వద్ద పోగుపడ్డ ఆయుధాలు
- వాటిని రష్యాకు ఇచ్చేందుకు కిమ్ ఓకే
- ప్రతిగా మిలటరీ ఉపగ్రహాల అభివృద్ధికి రష్యా సాయం చేయాలని కోర్కె

సియోల్: ఉక్రెయిన్‌పై యుద్ధానికి సంబంధించి రష్యాకు ఉత్తర కొరియా పూర్తి మద్దతు ప్రకటించింది. తమ జాతీయ భద్రత కోసం రష్యా చేస్తున్న పోరాటంలో ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు బేషరతుగా పూర్తిస్థాయి మద్దతు ఇస్తున్నట్టు ఉత్తర కొరియా నియంతృత్వ పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ వెల్లడించారు. అంతేకాదు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని 'పవిత్ర పోరాటం'గా అభివర్ణించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను ఎదుర్కొనేందుకు తమ దేశం ఎల్లప్పుడూ రష్యాకు మద్దతుగా నిలబడుతుందని తెలిపారు. ఉక్రెయిన్‌పై దాదాపు ఏడాదిన్నర కింద రష్యా యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యూరప్ దేశాలు, అమెరికా ఆయుధాలు సాయం చేయడంతో ఈ యుద్ధంలో ఉక్రెయిన్ సమర్థవంతంగా రష్యాకు ఎదురొడ్డి నిలిచింది. ఇన్నాళ్లుగా నిరంతర దాడులతో రష్యాకు ఆయుధాల కొరత తలెత్తింది. ఈ క్రమంలో ఉత్తర కొరియా నియంత కిమ్‌తో పుతిన్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా తూర్పు కొసన సైబీరియా ప్రాంతంలో ఉన్న వోస్తోక్నీ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో బుధవారం పుతిన్‌తో కిమ్ భేటీ అయ్యారు.

ఆయుధాలు, ఆర్థిక అంశాలపై..

రష్యా, ఉత్తరకొరియా మీడియా సంస్థల కథనాల ప్రకారం.. సోవియట్ కాలం నుంచీ ఉత్తరకొరియాకు అండగా ఉన్న విషయాన్ని పుతిన్ తమ భేటీలో గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అంశాన్ని కిమ్ పరోక్షంగా ప్రస్తావిస్తూ.. రష్యాకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ''సామ్రాజ్యవాద శక్తుల నుంచి తన సార్వభౌమ హక్కులను, భద్రతను పరిరక్షించుకునేందుకు రష్యా 'పవిత్ర పోరాటం' చేస్తోంది. రష్యా ప్రభుత్వానికి డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (ఉత్తర కొరియా) ఎల్లప్పుడూ బేషరతుగా పూర్తి మద్దతు ఇస్తోంది. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేసేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుంటాం..'' అని కిమ్ ప్రకటించారు.



బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ కరచాలనం

ఆ ఆయుధాలు ఇవ్వండి

సోవియట్ యూనియన్ కాలం నుంచి ఉత్తర కొరియా, రష్యా మధ్య స్నేహ సంబంధాలు ఉన్నాయి. 1950–53 మధ్య జరిగిన కొరియన్ యుద్ధంలో సోవియట్ యూనియన్ ఉత్తర కొరియాకు అండగా నిలిచింది. పెద్ద ఎత్తున ఆయుధాలను అందించడం ద్వారా దక్షిణ కొరియాపై ఉత్తర కొరియా ఆక్రమణకు సహకరించింది. ఆ సమయంలో దక్షిణ కొరియాకు అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు అండగా నిలవడంతో.. చాలా కాలం యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తర కొరియాకు సోవియట్ యూనియన్ ఆయుధాల సరఫరా, సహకారం కొనసాగింది. ఈ క్రమంలో నాటి ట్యాంక్ షెల్స్, లాంఛర్లు, మినీ రాకెట్లు లక్షల సంఖ్యలో ఉత్తర కొరియా వద్ద పోగుపడ్డాయి. సోవియట్ డిజైన్ ఆయుధాలే కాబట్టి రష్యా వాటిని నేరుగా వినియోగించుకోగలదు. ఇప్పుడు ఉక్రెయిన్‌పై యుద్ధంలో వాడేందుకు ఆ ఆయుధాలు ఇవ్వాలని ఉత్తర కొరియాను పుతిన్ కోరారు.

మాకు గూఢచర్య ఉపగ్రహ టెక్నాలజీ — కిమ్ షరతు

రష్యా, చైనా తదితర దేశాల సాయంతో ఉత్తర కొరియా క్షిపణులు, అణ్వస్త్ర సాంకేతికతల విషయంలో ఓ మోస్తరుగా అభివృద్ధి సాధించినా.. ఉపగ్రహాల టెక్నాలజీలో చాలా వెనుకబడి ఉంది. అణు సామర్థ్యమున్న క్షిపణుల ప్రయోగం, ఇతర సైనిక అవసరాల కోసం మిలటరీ/గూఢచర్య ఉపగ్రహాలు తప్పనిసరి. ఈ దిశగా ఉత్తర కొరియా పలుమార్లు ప్రయోగాలు జరిపినా విఫలమైంది. తాజాగా రష్యా ఆయుధాలు అడుగుతున్న నేపథ్యంలో.. మిలటరీ గూఢచర్య ఉపగ్రహాల అభివృద్ధి, సాంకేతికత విషయంలో సాయం చేయాలని కిమ్ షరతు పెట్టినట్టు సమాచారం.

ప్రత్యేక రైల్లో.. లిమోజిన్‌తో సహా..



ఉత్తర కొరియా నుంచి కిమ్ ఏకంగా ఓ ప్రత్యేక రైలులో రష్యాకు వెళ్లారు. క్షిపణి దాడులు జరిగినా కూడా తట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన బోగీలు, వెంటనే ఎదురుదాడి చేయడానికి వీలుగా భారీ స్థాయిలో సిద్ధంగా అమర్చి పెట్టిన ఆయుధాలు ఈ రైలు సొంతం. దీనితోపాటు ఎలాంటి దాడులనైనా ఎదుర్కొనే ప్రత్యేకమైన వాహనాన్ని (లిమోజిన్) కూడా వెంట తీసుకెళ్లారు. వోస్తోక్నీ అంతరిక్ష కేంద్రం సమీపంలోకి రైలు చేరుకున్నాక.. కిమ్ తన లిమోజిన్‌లో భేటీ అయ్యే స్థలానికి చేరుకోవడం గమనార్హం. కిమ్‌కు పుతిన్ ఎదురెళ్లి స్వాగతం పలికారని, ఇద్దరూ సుదీర్ఘంగా నాలుగు గంటల పాటు చర్చించుకున్నారని.. భేటీ అనంతరం కిమ్‌కు పుతిన్ ప్రత్యేక విందు ఇచ్చారని రష్యా మీడియా వెల్లడించింది. ఈ పర్యటన సందర్భంగా రష్యా అంతరిక్ష కేంద్రంలో కిమ్ కలియదిరిగారని, అక్కడి ప్రత్యేకతలను తెలుసుకున్నారని వివరించింది.

శాటిలైట్ల కోసమేగా వచ్చింది! పుతిన్

రష్యా స్వయం సమృద్ధ దేశమని, అయితే కొన్ని అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉందని.. వాటిపై కిమ్‌తో చర్చించానని పుతిన్ వెల్లడించారు. కిమ్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తర కొరియా ఉపగ్రహాలు అభివృద్ధి చేసేందుకు రష్యా సహకరిస్తుందా? అని మీడియా ప్రశ్నించగా.. ''అందుకేగా మేం ఇక్కడికి (భేటీ కోసం) వచ్చింది. రాకెట్ టెక్నాలజీపై ఉత్తర కొరియా నేత చాలా ఆసక్తి కనబరుస్తున్నారు. ఉత్తర కొరియా నుంచి ఆయుధాల కొనుగోలు, మిలటరీ సాయం, ఆంక్షల విషయంలో మాట్లాడేందుకు ఇంకా చాలా సమయం ఉంది..'' అని పేర్కొన్నారు. రష్యా, ఉత్తరకొరియా మధ్య రవాణా, వ్యవసాయం వంటి పరస్పర ప్రయోజనాలున్న ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయని చెప్పారు. పొరుగు దేశమైన ఉత్తర కొరియాకు మానవతా సాయం అందిస్తున్నామన్నారు. రష్యాలోని మరో రెండు నగరాల్లో కిమ్ పర్యటిస్తారని, యుద్ధ విమానాల ప్లాంట్‌ను, రష్యా పసిఫిక్ నౌకాదళ కేంద్రాన్ని సందర్శిస్తారని వెల్లడించారు.

ఆంక్షలతో కలిసిన ఇద్దరు

ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించాయి. చమురు కొనుగోళ్లు, ఇతర లావాదేవీల విషయంలో సమస్యలతో రష్యా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. మరోవైపు అణ్వస్త్ర క్షిపణుల అభివృద్ధి, ఇటీవల వరుసగా ప్రయోగాలు జరపడం నేపథ్యంలో ఉత్తర కొరియాపై భారీగా ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ఇలా పాశ్చాత్య ప్రపంచం దూరం పెట్టిన ఇరుదేశాల నేతలు పరస్పర సహకారం కోసం కలవడం గమనార్హం. అయితే ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు కొనడంగానీ, ఆ దేశానికి రాకెట్, శాటిలైట్ టెక్నాలజీని ఇవ్వడంగానీ దారుణమైన పరిస్థితులకు దారితీస్తాయన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

కశ్మీర్‌లో ఉగ్రఘాతుకం

- ఆర్మీ గాలింపు వేళ ఉగ్రవాదుల ఎదురుకాల్పులు
- కల్నల్, మేజర్, డిప్యూటీ ఎస్పీ వీరమరణం



కల్నల్ మన్‌ప్రీత్ సింగ్



డిప్యూటీ ఎస్పీ భట్

రాజౌరీ/జమ్మూ: ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారంతో ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టిన సైన్యంపై ఉగ్రవాదులు మాటువేసి మెరుపుదాడి చేశారు. ఈ దుర్ఘటనలో ఆర్మీ కల్నల్, మేజర్, డిప్యూటీ ఎస్పీలు వీరమరణం పొందారు. ఈ ఘటన జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని గరోల్ దగ్గర్లోని కొకొరెనాగ్ కొండ ప్రాంతంలో జరిగింది. రాజౌరీలో ఉగ్రకాల్పుల్లో జవానును కాపాడబోయి సైనిక జాగిలం కెంట్ ప్రాణాలు కోల్పోయిన మరుసటి రోజే ఈ కాల్పుల ఘటన జరగడం విషాదకరం. బుధవారం ఉదయం సైనిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కొకొరెనాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారంతో మంగళవారం రాత్రి సైన్యం, కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. బలగాల రాకను పసిగట్టిన ఉగ్రవాదులు వెంటనే తూటాల వర్షం కురిపించారు. దీంతో 19వ రాష్ట్రీయ రైఫిల్స్ కమాండింగ్ అధికారి అయిన కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, మేజర్ ఆశిశ్ ధోనక్, డిప్యూటీ ఎస్పీ హుమయూన్ భట్ నేలకొరిగారు. జమ్మూకశ్మీర్ మాజీ ఐజీ గులామ్ హసన్ భట్ కుమారుడే ఈ హుమయూన్. కాల్పుల ఘటనకు నిషేధిత రెసిస్టెంట్ ఫ్రంట్ సంస్థ బాధ్యత ప్రకటించుకుంది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ లష్కరే తోయిబానే ఈ రెసిస్టెంట్ ఫ్రంట్ సంస్థను వెనక ఉండి నడిపిస్తోంది. ఆగస్టు నాలుగో తేదీన కుల్గామ్ జిల్లాలోని హలన్ అటవీప్రాంతంలో ముగ్గురు జవాన్ల మరణానికి కారకులైన వారే బుధవారం దాడి చేశారని సైనిక నిఘా వర్గాలు వెల్లడించాయి.

భోపాల్‌లో 'ఇండియా' మొట్టమొదటి ర్యాలీ

- అక్టోబర్ మొదట్లో జరపాలని కూటమి సమన్వయ కమిటీ నిర్ణయం
- భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపిణీపై త్వరలోనే చర్చలు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమి తమ మొట్టమొదటి బహిరంగసభను వచ్చే నెలలో భోపాల్‌లో నిర్వహించనుంది. అదేవిధంగా, భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపిణీకి సంబంధించిన చర్చలను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించనుంది. ఇండియా కూటమి సమన్వయ కమిటీ మొదటి సమావేశం బుధవారం ఢిల్లీలో జరిగింది. ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ నివాసంలో జరిగిన ఈ భేటీకి కమిటీలోని 14 మంది సభ్యులకు గాను 12 మంది హాజరయ్యారు. సనాతనధర్మంపై డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల దుమారం నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. కమిటీ సభ్యుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అనంతరం మాట్లాడుతూ, విచారణకు రావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేయడంతో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ భేటీకి రాలేదని చెప్పారు. హాజరైన వారిలో..ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్, కాంగ్రెస్ నుంచి కేసీ వేణుగోపాల్, జార్ఖండ్ సీఎం, జేఎంఎం నేత హేమంత్ సోరెన్, సీపీఐ నేత డి.రాజా, ఎస్పీ నుంచి జావెద్ అలీ ఖాన్, డీఎంకే నుంచి టీఆర్ బాలు, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, జేడీయూకు చెందిన సంజయ్ ఝా, ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లా, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, శివసేన(యూబీటీ)కి చెందిన సంజయ్ రౌత్ ఉన్నారు. 'సీట్ల పంపకాల ప్రక్రియను ప్రారంభించాలని సమన్వయ కమిటీ నిర్ణయించింది. భాగస్వామ్య పక్షాలు చర్చలు జరిపి సాధ్యమైనంత త్వరగా సీట్ల పంపణీని ఖరారు చేయాలి.. కూటమి ఉమ్మడి సమావేశాలను దేశవ్యాప్తంగా చేపట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా మొట్టమొదటి సభను అక్టోబర్ మొదటి వారంలో భోపాల్‌లో చేపట్టాలని అంగీకారానికి వచ్చారు. బీజేపీ పాలనలో పెరిగిన అవినీతి, నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం ప్రధాన ఎజెండాగా ఈ సభలు జరుగుతాయి' అని కమిటీ ఉమ్మడి ప్రకటనను వేణుగోపాల్ చదివి వినిపించారు. మహారాష్ట్ర, తమిళనాడు, బిహార్‌ల్లో సీట్ల పంపకం సులువుగా కనిపిస్తుండగా, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌ల్లో మాత్రం భాగస్వామ్య పక్షాల మధ్య ఏకాభిప్రాయం సాధ్యమయ్యే సూచనలు కనిపించడం లేదు.

నిఫా కట్టడికి కేరళ సమాయత్తం

- వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో ఆంక్షలు
- వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రాష్ట్రానికి పలు బృందాల రాక
- ఇది బంగ్లాదేశ్ వేరియంట్: కేరళ మంత్రి

కోజికోడ్: అత్యంత ప్రమాదకర నిఫా వైరస్ మరోసారి కేరళ రాష్ట్రంలో అప్రమత్త పరిస్థితులను సృష్టించింది. ఇప్పటికే సోకిన నలుగురిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో వైరస్ వ్యాప్తి కట్టడికి రాష్ట్ర ప్రభుత్వ రంగంలోకి దిగింది. ఏడు జిల్లా పంచాయతీలను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించి ఆంక్షల చట్రాన్ని బిగించింది. తదుపరి నోటీసు వచ్చేదాకా ఆ ప్రాంతాలకు ప్రయాణాలు నిషేధమని కోజికోడ్ కలెక్టర్ గీత చెప్పారు. బ్యాంకులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీలను మూసేయించారు. జనం భయపడొద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ విజ్ఞప్తిచేశారు. వైరస్ బారినపడిన వారిలో తొమ్మిదేళ్ల బాలుడు ఉన్నాడని కేరళ వైద్య శాఖ మహిళా మంత్రి వీణా జార్జ్ చెప్పారు. సేకరించిన ఐదు శాంపిళ్లలో మూడు పాజిటివ్‌గా వచ్చాయి. నిఫా సోకడంతో ఆగస్టు 30న ఒక వ్యక్తి మరణించాడు. మొదట అతను కాలేయ క్యాన్సర్‌తో మరణించాడని భావించారు. తర్వాత నిఫా నిర్ధారణ పరీక్షలు చేయడంతో ఈసారి ఈ వైరస్‌తో ప్రాణాలు కోల్పోయిన తొలి వ్యక్తి ఇతనేనని నిర్ధారించుకున్నారు. ఇతని కుమారుడు, బంధువుకూ నిఫా సోకింది. కుమారుడికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

కేరళకు పుణే వైరాలజీ బృందం

నిఫా వ్యాధి నిర్ధారణపరీక్షలతోపాటు గబ్బిలాలపై సర్వే చేసేందుకు పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ నిపుణుల బృందం కేరళకు పయనమైంది. కోజికోడ్ జిల్లాలో నలుగురికి వైరస్ సోకడంతో అప్రమత్తమై పలు బృందాలు రాష్ట్రానికి వస్తున్నాయని బుధవారం శాసనసభలో ఆరోగ్య మంత్రి వీణ వెల్లడించారు. 'ఇది బంగ్లాదేశ్ వేరియంట్ వైరస్. మనుషుల నుంచి మనుషులకు నెమ్మదిగా వ్యాప్తి చెందుతుంది. ఇన్ఫెక్షన్ శాతం తక్కువ ఉన్నా మరణాల రేటు అధికంగా ఉండటం ఆందోళన కల్గిస్తోంది' అని ఆమె చెప్పారు. చెన్నై నుంచి మరో బృందం రాబోతోంది. నిఫా రోగుల చికిత్సలో వాడే మోనోక్లోనల్ యాంటీబాడీలను సరఫరా చేసేందుకు భారతీయ వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) అంగీకారం తెలిపింది.

ప్రత్యేక సెషన్ ఎజెండా ఇదే..

న్యూఢిల్లీ: ఈ నెల 18 నుంచి మొదలయ్యే అయిదు రోజుల ప్రత్యేక సెషన్‌లో మొదటి రోజున భారత పార్లమెంట్ 75 ఏళ్ల ప్రస్థానంపై ప్రత్యేక చర్చ ఉంటుందని ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. 1946లో ఏర్పాటైన భారత రాజ్యాంగ సభ(కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ ఆఫ్ ఇండియా) మొదలుకొని పార్లమెంట్ 75 ఏళ్ల ప్రస్థానం, విజయాలు, అనుభవం, జ్ఞాపకాలు, పాఠాలు' అంశంపై చర్చ ఉంటుంది. మిగతా ఇతర కార్యకలాపాలు కూడా ఉంటాయని తెలిపింది. ఈ సమావేశాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలను నియంత్రించే బిల్లును ప్రవేశపెడతామని తెలిపింది. ఈ బిల్లును వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ ఆమోదించింది. నియామక ప్యానెల్‌లో ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధాని నామినేట్ చేసిన కేంద్ర మంత్రి ఒకరు ఉంటారు. ఇందులో నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)ని తొలగిస్తామని చెప్పడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టిన ది అడ్వొకేట్స్(సవరణ)బిల్లు–2023, ది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు–2023, ది పోస్టాఫీస్–2023 బిల్లులను కూడా ఈ సెషన్‌లో భాగంగా లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

17న అఖిలపక్ష సమావేశం

పార్లమెంటు ప్రత్యేక సెషన్ నేపథ్యంలో ఈ నెల 17న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం 'ఎక్స్'లో వెల్లడించారు. 'ఈ నెల 18 నుంచి పార్లమెంటు సమావేశాల సందర్భంగా ముందు రోజు సాయంత్రం 4.30 గంటలకు అఖిలపక్ష ఫ్లోర్ లీడర్ల సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఈ మేరకు అందరికీ ఈ–మెయిల్ ద్వారా ఆహ్వానాలు పంపించాం''అని జోషి అందులో పేర్కొన్నారు.

మరో 75 లక్షల 'ఉజ్వల'కనెక్షన్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన(పీఎంయూవై)కింద అదనంగా 75 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.1,650 కోట్లు కేటాయించింది. దీంతోపాటు, ఈ కోర్ట్స్' ప్రాజెక్టు మూడో దశకు అనుమతి మంజూరుచేసింది. ఇందుకు గాను రూ.7,210 కోట్లు వెచ్చించాలని తీర్మానించింది. ఇటీవల ముగిసిన జీ20ని విజయవంతం చేసి, భారత్ ప్రతిష్టను ఇనుమడింప జేసిన ప్రధాని మోదీని ఈ సమావేశం అభినందించింది. ఈ వివరాలను భేటీ అనంతరం కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. కొత్తగా జారీ అయ్యే 75 లక్షల ఉజ్వల ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లను 2023–24 నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరం వరకు అందజేస్తామని తెలిపారు. వీటితో కలిపి ఉజ్వల లబ్ధిదారుల సంఖ్య 10.35 కోట్లకు చేరుకుంటుందన్నారు. దిగువ కోర్టుల్లో రికార్డుల డిజిటైజేషన్, క్లౌడ్ స్టోరేజీ, వర్చువల్ కోర్టుల ఏర్పాటు తదితరాల కోసం నాలుగేళ్లపాటు అమలయ్యే ఈకోర్ట్స్ ప్రాజెక్టు ఫేజ్–3కి రూ.7,210 కోట్లు కేటాయించేందుకు కూడా కేబినెట్ అంగీకరించిందని ఠాకూర్ చెప్పారు. ఇందులో భాగంగా 3,108 కోట్ల డాక్యుమెంట్లు డిజిటల్ రూపంలోకి మారుతాయని అంచనా.

వియత్నాంలో ఘోర అగ్ని ప్రమాదం

హనోయి: వియత్నాం రాజధాని నగరం హనోయి ఘోర అగ్నిప్రమాదానికి నిలయంగా మారింది. హనోయిలో మంగళవారం రాత్రి తొమ్మిది అంతస్తుల భవంతి పార్కింగ్ ప్రాంతంలో మొదలైన అగ్నికీలలు వెనువెంటనే భవనం మొత్తాన్నీ చుట్టేశాయి. అత్యవసరంగా బయటపడే మార్గం ఈ భవనానికి లేదు. దీంతో తప్పించుకునే మార్గం కానరాక ఏకంగా 56 మంది అగ్నికి ఆహుతయ్యారు. వీరిలో నలుగురు చిన్నారులు ఉన్నారు. 37 మంది గాయపడ్డారు. 150 కుటుంబాలు నివసిస్తున్న ఈ భవనం ఇరుకైన దారిలో నిర్మించారు. దీంతో మంటలు ఆర్పే అగ్నిమాపక సిబ్బంది భవనం దాకా చేరుకోలేకపోయారు. ఇరుకైన మార్గం కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. మంటలు అంటుకుంటాయనే భయంతో కొందరు భవనం మీద నుంచి కిందకు దూకారు. ఇలా గాయపడిన వారిని హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రుల్లో చికిత్సనందిస్తున్నారు. పొగపీల్చడంతో ఇబ్బందులు పడుతున్న వారికీ చికిత్సచేస్తున్నారు.

లిబియాలో ఊహకందని మహా విషాదం

5,100 దాటిన వరద మృతుల సంఖ్య

- ఇంకా వేలాది మంది జాడ గల్లంతు !
- నగరంలో ఎటుచూసినా శవాలే
- రహదారులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం

డెర్నా: అస్థిర ప్రభుత్వాలు, సంక్షోభం, ఎవరికీ పట్టని ప్రజా సంక్షేమంతో సమస్యల వలయంలో చిక్కిన లిబియాపై ప్రకృతి కత్తి గట్టింది. ఊహించని వరదలు, వరద నీటి ధాటికి పేకమేడల్లా కుప్పకూలిన రెండు డ్యామ్‌లు.. వరద విలయాన్ని మరింత పెంచాయి. డ్యామ్‌ల నుంచి దూసుకొచ్చిన నీటిలో కొట్టుకుపోయి జలసమాధి అయిన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం నాటి గణాంకాల ప్రకారం డెర్నా సిటీలో వరద మృతుల సంఖ్య ఏకంగా 5,100 దాటింది. ఇంకా వేలాది మంది జాడ గల్లంతయిందన్న కథనాలు చూస్తుంటే అక్కడి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వరద ఉధృతికి ఇళ్లుసహా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారు వేలాదిగా ఉన్నారు. డెర్నా సిటీ తీరప్రాంతంలోని పర్వతాలు, లోయలతో నిండిన నగరం. వరదల కారణంగా చాలా రోడ్లు దెబ్బతిని సహాయక బృందాలు వరద ముంపు ప్రాంతాలకు చేరుకోలేని పరిస్థితి. దీంతో చాలా చోట్ల సహాయక చర్యలు మొదలేకాలేదు. అతికష్టం మీద కొన్ని బృందాలు చేరుకుని జలమయమైన ఇళ్లలో బాధితుల కోసం అన్వేషణ మొదలుపెట్టాయి. నేలమట్టమైన భవనాలు, శిథిలాల కింద వెతికే కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి.

30 వేలు దాటిన వలసలు

వరద ధాటికి సర్వం కోల్పోవడంతో దాదాపు 30 వేల మంది స్థానికులు పొట్టచేత పట్టుకుని వేరే ప్రాంతాలకు వలసవెళ్లారని ఐక్యరాజ్యసమితికి చెందిన మైగ్రేషన్ ఏజెన్సీ తెలిపింది. అయితే ఈ సంఖ్య 40,000కుపైనే ఉంటుందని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ సొసైటీ లిబియా ప్రతినిధి తమెర్ రమదాన్ అంచనావేశారు.

రెండు ప్రభుత్వాల మధ్య నలిగి..

తూర్పు ప్రాంతంలో ఒక ప్రభుత్వం, మరో దిశలో ఇంకో ప్రభుత్వాల నిర్లక్ష్య ఏలుబడిలో ఉన్న లిబియాలో మౌలిక వసతుల కల్పన అరణ్యరోదనే అయ్యింది. 'నగరంలో ఉన్న ఏకైక శ్మశానానికి తరలించేందుకు మృతదేహాలను ఒక దగ్గరకు చేరుస్తాం. ఈ జల విలయంలో 11 మంది కుటుంబసభ్యులను కోల్పోయి గుండెలవిసేలా రోదిస్తున్న ఒకాయనను ఓదార్చడం ఎవరి తరం కావట్లేదు' అని సహాయక బృంద సభ్యుడొకరు చెప్పారు. 'నా కుటుంబం మొత్తాన్నీ కోల్పోయా. వరదల్లో మా వాళ్ల మృతదేహాలు సముద్రం ఒడ్డుకు కొట్టుకొచ్చాయి' అని అబ్దుల్లా అనే వ్యక్తి వాపోయారు. రోడ్లలో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు బుల్డోజర్లతో రెండు రోజులుగా నిరంతరంగా పనిచేయిస్తున్నారు. అప్పుడుగానీ అత్యవసర సరుకుల్ని తరలించలేని దుస్థితి.

వేరే పట్టణాలకు మృతదేహాల తరలింపు

సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిపించే పరిస్థితులు డెర్నీ సిటీలో కరువవడంతో వందలాది మృతదేహాలను సమీపంలోని పట్టణాలకు తరలిస్తున్నారు. మరణించిన వారిలో 84 మంది ఈజిప్టువాసులూ ఉన్నారు. దక్షిణాన ఉన్న బెనీ సుయెఫ్ రాష్ట్రంలో ఎల్–షరీఫ్ గ్రామంలో డజన్లకొద్దీ ఈజిప్షియన్లు జలసమాధి అయ్యారు.

డెర్నాలో భీతావహ దృశ్యం

నగరంలో చాలా చోట్ల మృతదేహాలు కనపడుతున్నాయి. బురదనీటిలో కూరుకుపోయి, వీధుల్లోకి కొట్టుకొచ్చి, సముద్ర తీరం వెంట.. ఇలా చాలా ప్రాంతాల్లో స్థానికులు విగతజీవులై కనిపించారు. ఒక్కసారిగా నీరు రావడంతో ఎటూ తప్పించుకోలేని నిస్సహాయక స్థితి. 'నగరంలో ఏ ప్రాంతంలో సహాయం చేసేందుకు వెళ్లినా అక్కడ మాకు చిన్నారులు, మహిళల మృతదేహాలే కనిపిస్తున్నాయి' అని బెంఘాజీకి చెందిన ఒక సహాయకుడు ఫోన్‌లో మీడియా సంస్థకు చెప్పారు. 'సిటీ శివార్లలోని డ్యామ్ బద్దలైన శబ్దాలు మాకు వినిపించాయి. నగరం గుండా ప్రవహించే వాదీ డెర్నీ నదిలో ప్రవాహ ఉధృతి అమాంతం ఊహించనంతగా ఎగసి జనావాసాలను ముంచేసింది. ' డ్యామ్ బద్దలవడంతో ఏకంగా ఏడు మీటర్ల ఎత్తులో దూసుకొచ్చిన ప్రవాహం తన మార్గంలో అడ్డొచ్చిన అన్నింటినీ కూల్చేసింది' అని లిబియాలో రెడ్‌క్రాస్ కమిటీ ప్రతినిధి బృంద సారథి యాన్ ఫ్రైడెజ్ చెప్పారు. మధ్యధరా ప్రాంతంలో సన్నని తీరప్రాంతంలో పర్వత పాదాల చెంత ఈ నగరం ఉంది. పర్వతాల నుంచి వచ్చిన వరద నీరు నగరాన్ని ముంచేస్తూ తీరం వైపు కిందకు ఉరకలెత్తడంతో వరద తీవ్రత భయంకరంగా ఉంది. వరద ధాటికి దక్షిణం వైపు కేవలం రెండు రోడ్లు మాత్రమే మిగిలిపోయాయి. కూలిన వంతెనలు నగరం మధ్య భాగాన్ని రెండుగా చీల్చాయి. దీంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గాయపడిన ఏడు వేలకుపైగా స్థానికులను మైదానాల్లోని తాత్కాలిక వైద్యశాలల్లో చికిత్సనందిస్తున్నారని తూర్పు లిబియాలోని అంబులెన్స్, అత్యవసర కేంద్రం అధికార ప్రతినిధి ఒసామా అలీ చెప్పారు.



డెర్నా: వరద రాక ముందు..



డెర్నా: వరద తర్వాత..

సాక్షి హైదరాబాద్

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



యువకుడి దారుణ హత్య

పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన బుధవారం తెల్లవారుజామున కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. -8లో



ఘరానా దొంగ అరెస్టు

ఇరవైకి పైగా కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితుడు, అతనికి సహకరిస్తున్న ఓ మహిళను మేడ్చల్ సీసీఎస్, దుండిగల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. -8లో

15న 'మిరాబ్' కవిత్వ సంపుటి ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సారంగి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో సమాజ సేవకులు-రచయిత ఖాజా అఫ్రిది రచించిన 'మిరాబ్' కవిత్వ సంపుటిని ఈ నెల 15న ఆవిష్కరించనున్నామని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని రవీంద్రభారతి పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్ వేదికగా ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. రచయితలు, సాహిత్య అభిలాషులు హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

అక్రమ బంగారం పట్టివేత

శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికులకు కస్టమ్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద ఉన్న నెబలైజర్ యంత్రం విప్పి చూడగా అందులో 465 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ రూ.28 లక్షలుంటుందని అధికారులు నిర్ధారించారు. మరో ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా అందులో.. కార్లను శుభ్రం చేసే వాక్యూమ్ క్లీనర్ కంప్రెషర్ యంత్రం విప్పగా అందులో 486 గ్రాముల బంగారం బయటపడింది. ఈ బంగారం విలువ రూ.29,27 లక్షలుంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం కావాలి: ఆర్.కృష్ణయ్య




కాచిగూడ: బీసీలంతా సంఘటితమై రాజ్యాధికారం దిశగా ఉద్యమాలు చేపట్టి సత్తా చాటాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. కాచిగూడ ప్రాంతానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ ఆధ్వర్యంలో బుధవారం బీసీ సంఘం ప్రతినిధులు ఆర్.కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు బీసీల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తున్న పార్టీలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాజ్‌కుమార్ పటేల్, నీల వెంకటేష్, నిఖిల్, అంబర్‌పేట బీసీ నాయకులు మనోజ్ యాదవ్, మైలారం రాజు, బాస్కర్ గౌడ్, తిరుపతి గుప్తా, రాజు నేత తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాన్ని పూర్తి చేయాలి: కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు ప్రాధాన్యతా రంగాలకు రుణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యాలను నిర్దీత వ్యవధిలో గ్రౌండింగ్ చేయాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాన్ని ఎంత వరకు సాధించారో అడిగి తెలుసుకొని, తక్కువ సాధించిన వారిని త్వరలో లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులు యూనిట్లు నెలకొల్పడానికి ముందుకు రానట్లయితే వేరే అర్హత కలిగిన వారికి అవకాశం ఇవ్వాలన్నారు. ఎల్‌డీఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రాధాన్యతా రంగాలకు రూ.29,480.67 కోట్ల లక్ష్యాన్ని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో రిజర్వు బ్యాంకు అధికారి తాన్యా సంగ్మా, నాబార్డ్ అధికారి గౌరీశంకర్ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత వాతావరణానికి కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వినాయక చవితి పండగకు అందరూ మట్టి గణపతులను పూజించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి గణపతులను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ డీఆర్‌ఓ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరుకున్న ఉస్మానియా ఆస్పత్రి భవనం




కొత్త భవనాన్ని నిర్మించాలంటూ ప్లకార్డులతో ధర్నా చేస్తున్న వైద్య సిబ్బంది



ఏదయా.. ఉస్మా'నయా'

వెంటనే నూతన భవనం నిర్మించాలి
- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల జేఏసీ



ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణంతో పాటు ప్రభుత్వ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పేద రోగుల కోసం ఉస్మానియా ఆస్పత్రికి గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా ఆస్పత్రి ప్రాంగణంలో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ప్రభుత్వ వైద్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు చేబూని పెద్దపెట్టున నినదించారు. న్యాయస్థానంలో వివాదం కొనసాగుతుండగానే సచివాలయ నిర్మాణం ఎలా పూర్తయిందని ప్రశ్నించారు. పాతబస్తీలోని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఒవైసీ సోదరులు ఉస్మానియా నూతన భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారంటూ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ నెలాఖరు నాటికి ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేశారు. గురువారం నుంచి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అయిదు రోజుల పాటు వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు పల్లం ప్రవీణ్, బొంగు రమేష్, అజ్మీరా రంగా, లాలూ నాయక్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. - అఫ్జల్‌గంజ్



చవితికి రెండ్రోజుల ముందే
మహా గణపతి సిద్ధం

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు: ఎమ్మెల్యే దానం నాగేందర్
- నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

ఖైరతాబాద్: తొలుత ఒక్క అడుగుతో ప్రారంభమైన ఖైరతాబాద్ మహాగణపతి ఒక్కో అడుగు పెంచుకుంటూ 69వ సంవత్సరం శ్రీ దశమహా విద్యాగణపతిగా ఈ సంవత్సరం 63 అడుగుల ఎత్తులో భక్తులకు దర్శనమిచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే ప్రారంభమైన కలర్ పనులు మరో రెండు రోజుల్లో పూర్తవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ మహాగణపతికి ఇరువైపులా కుడివైపు పంచముఖ లక్ష్మీనారసిహ స్వామి, ఎడమవైపు శ్రీ వీరభద్ర స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. చవితికి రెండు రోజుల ముందే మహాగణపతి పూర్తిస్థాయిలో దర్శనమిచ్చేందుకు సిద్ధమవుతారని తెలిపారు.

- అప్పట్లో స్వాతంత్ర్య సమరయోధులైన సంగిరి శంకరయ్య బాల గంగాధర్ తిలక్ స్ఫూర్తితో ఎ.భీమయ్య, జి.సుందర్శనం, రాజారాగం, రాజమణిదేవి, ఎస్.సుదర్శన్, ఎస్.వీరభద్రయ్య, గణేష్‌కుమార్ కలిసి ఈ మహత్ కార్యానికి పూనుకున్నారని ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ నేతృత్వంలో విగ్రహ తయారీ పనులు పూర్తియ్యాయని, ఈ నెల 18 వినాయక చవితి నాటికి భక్తులకు సంపూర్ణంగా దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఉత్సవ కమిటి పోలీసు శాఖతో సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు దానం నాగేందర్ పేర్కొన్నారు.



ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొత్వాల్ ఆనంద్, కమిషనర్ రోనాల్డ్ రాస్

- వినాయక చవితి సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులో నిమజ్జన ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో కలిసి పరిశీలించారు. పీపుల్స్ ప్లాజా, జలవిహార్ వద్ద వాహనాల పార్కింగ్, బ్రిడ్జి– 2, ఎన్టీఆర్ మార్గ్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. వీరితో ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ సుధీర్ బాబు, విక్రమ్ సింగ్ మాన్, జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే, ఈఎస్‌సీ జియావుద్దీన్, జోనల్ ఎస్ఈ రత్నాకర్, హెచ్ఎండీఏ ఎస్ఈ పరంజ్యోతి, అడిషినల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



సిద్ధమవుతున్న ఖైరతాబాద్ మహాగణపతి

భాగ్యనగరి.. కాంగ్రెస్ భేరి!

విజయభేరితో అసెంబ్లీ ఎన్నికల నగారా
- రెండు రోజులపాటు సీడబ్ల్యూసీ సమావేశాలు
- బోయిన్‌పల్లిలో రాజీవ్ నాలెడ్జ్ సెంటర్‌కు శంకుస్థాపన
- తరలిరానున్న కాంగ్రెస్ సీఎంలు, జాతీయ నేతలు, పీసీసీ చీఫ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ అత్యున్నత స్థాయి సమావేశాలకు భాగ్యనగరం ఆతిథ్యమిస్తోంది. రెండు దశాబ్దాల అనంతరం ఈ సమావేశాలకు నగరం వేదికగా మారింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ పార్టీ.. సీడబ్ల్యూసీ సమావేశాలతో మరింత జోష్ నింపేందుకు సిద్ధమైంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనుండటంతో పార్టీ కేంద్ర నాయకత్వం మొత్తం ఇక్కడికి కదలి రానుంది. సీడబ్ల్యూసీ కార్యవర్గ పునర్ వ్యవస్థీకరణ అనంతరం జరుగుతున్న తొలి సమావేశం కావడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశానికి కాంగ్రెస్ సారథులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీఎల్పీ నేతలు, పీసీసీ అధ్యక్షులు, సహా 39 మంది వర్కింగ్ కమిటీ సభ్యులు హాజరు కానున్నారు.

ఎన్నికల శంఖారావం..

నగర శివారు తుక్కుగూడలో జరిగే విజయభేరి బహిరంగ సభతో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సైరన్ మోగించనుంది. ఈ వేదిక ద్వారా కాంగ్రెస్ అధికారంలో వస్తే అమలు చేసే ప్రధాన అయిదు హామీలను ప్రకటించనుంది. దేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజు సెప్టెంబరు 17న కావడంతో తెలంగాణ ఏర్పాటు కోసం కాంగ్రెస్ చేసిన త్యాగాలేమిటో ఈ వేదిక ద్వారా ప్రజలకు సోనియా గాంధీ వివరించనున్నారు.

నాలెడ్జ్ సెంటర్‌కు శంకుస్థాపన

కాంగ్రెస్ పార్టీ బోయినపల్లిలోని పది ఎకరాల విస్తీర్ణం స్థలంలో నిర్మించతలపెట్టిన రాజీవ్ నాలెడ్జ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనుంది. సీడబ్ల్యూసీ సమావేశాల అనంతరం భూమి పూజ జరగనుంది. ఈ కార్యక్రమానికి సైతం పార్టీ అగ్రనాయకత్వం హాజరు కానుంది.

కుప్పకూలింది..



నిర్మాణంలో ఉన్న భవనం
- త్రుటిలో తప్పిన ప్రమాదం
- నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడమే కారణం
- బాచుపల్లి ప్రగతినగర్‌లో ఘటన

నిజాంపేట్: నాణ్యత ప్రమాణాలు పాటించకుండా.. వేగంగా నిర్మాణాలు చేపట్టి ఫ్లాట్స్ విక్రయించుకోవాలనే బిల్డర్ కక్కుర్తితో ఓ భవనం కుప్పకూలింది. అదృష్టవశాత్తు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్లాబ్ వేస్తున్న కార్మికులు సురక్షితంగా బయటపడగా ముగ్గురు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ప్రగతినగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. కాలనీలోని సర్వే నంబర్ 146 పార్ట్‌లో ప్లాట్ నంబర్స్ 64, 65లలో 445 గజాల్లో హెచ్ఎండీఏ అనుమతులతో శ్రీ సాయి కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో అయిదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి అపార్ట్‌మెంట్‌కు మూడో స్లాబ్ వేస్తున్నారు. 10 రోజుల క్రితం వేసిన రెండో స్లాబ్ ఒక్కసారిగా కూలడంతో పైన వేస్తున్న మూడో స్లాబ్ సరిగా పూర్తయ్యే సమయానికి కుప్పకూలింది. దీంతో అక్కడ పని చేస్తున్న 20 మంది కార్మికులు హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. మూడో స్లాబ్‌పై ఆరుగురు కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో లక్ష్మి, అనితతో పాటు మరో కార్మికుడికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అపార్ట్‌మెంట్ నిర్మాణంలో బిల్డర్ నాణ్యత పాటించకపోవడంతో పాటు క్యూరింగ్ సైతం సరిగా చేయకపోవడం స్లాబ్‌కు, స్లాబ్‌కు సమయం తక్కువగా ఉండటం, నిర్మాణ ప్లానింగ్ సక్రమంగా లేకపోవడం ప్రధాన కారణాలని సమాచారం. ఘటనా స్థలాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీనివాస్‌రావు, ప్రశాంతి, పోలీసులు, డీఆర్ఎస్ సిబ్బంది, కార్పొరేటర్లు సందర్శించారు. కూలిన భవనం చుట్టూ మున్సిపల్ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రమాదానికి బాధ్యులపైన వారిపై చర్యలు తీసుకుంటామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావు స్పష్టం చేశారు.

కూలిపోతున్న భవనం స్లాబ్‌లు



4 లక్షల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తాం

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్



సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జోన్‌కు రెండు చొప్పున తాత్కాలిక ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు జీహెచ్ఎంసీ ద్వారా 3.10 లక్షలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా 90 వేలు మొత్తం 4 లక్షల విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వార్డుకు 2800 నుంచి 3 వేల విగ్రహాలు వార్డు కార్యాలయం ద్వారా పంపిణీ చేస్తామన్నారు. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 10 అంశాలకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. సనత్‌నగర్ వార్డులోని కై లాసనగర్‌లో రూ.3.30 కోట్లతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి, గోపన్నపల్లిలో అన్యాక్రాంతమైన భూమిలో 4,850 చదరపు గజాల స్థలంలో సీఎస్సార్ ద్వారా జంతు సంరక్షణ కేంద్రం నిర్మాణం, పశువుల ఆస్పత్రి నిర్మాణం చేపట్టేందుకు రాంకీ ఫౌండేషన్‌కు భూమిని కేటాయించాల్సిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సిఫారస్ చేసేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. వీటితో పాటు మరో ఎనిమిది అంశాలకు కమిటీ ఆమోదముద్ర వేసింది. మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో కార్పొరేటర్లు భాగస్వాములు కావాలని మేయర్ సూచించారు.

పారిస్ తరహాలో..



అత్తాపూర్ హైలెవెల్ బ్రిడ్జి నమూనా చిత్రం

రూ.171 కోట్లతో 4 హైలెవెల్ వంతెనలు
- మూసారాంబాగ్, అత్తాపూర్, ఫతుల్లాగూడ, సన్‌సిటీల వద్ద
- మూసీ, ఈసా నదులపై..
- త్వరలోనే శంకుస్థాపనలు

సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక మూసీ, ఈసాలపై పారిస్ తరహాలో గ్రేటర్ నగరంలో హైలెవెల్ బ్రిడ్జిల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. వరద నివారణతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీ పెంపు, పర్యాటకాభివృద్ధి, తద్వారా ఆయా ప్రాంతాలకు డిమాండ్ పెంచే లక్ష్యంతో మూసీ, ఈసాల నదులపై ప్రభుత్వం నిర్మించతలపెట్టిన 15 బ్రిడ్జిల్లో నాలుగింటి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. మంత్రి కేటీఆర్ ఆదేశాలకనుగుణంగా.. బహుశా ఈ నెలలోనే వీటికి శంకుస్థాపనలు జరిగే అవకాశాలున్నాయి. మూసీ, ఈసాలపై వివిధ ప్రభుత్వ సంస్థలకు నిర్మాణ బాధ్యతలు అప్పగించగా, జీహెచ్ఎంసీ నిర్మించాల్సిన వాటిలో రెండింటికి, హెచ్ఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో నిర్మించాల్సిన రెండింటికి టెండర్లు, అగ్రిమెంట్లు పూర్తయ్యాయి. సాయిల్ టెస్ట్ వంటి పనులు కూడా ప్రారంభించారు. దీంతో వీటికి త్వరలోనే శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించనున్నారు.

ట్రాఫిక్ సమస్యలు తీరేలా..

వరదముంపు సమస్యలతో పాటు బ్రిడ్జిల నిర్మాణం వల్ల ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయని జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) ఎం.దేవానంద్ తెలిపారు. వర్షం వచ్చిన ప్రతిసారీ మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగిపోతుండటం తెలిసిందే. సమస్య శాశ్వత పరిష్కార చర్యల్లో భాగంగా మంత్రి కేటీఆర్ ఆదేశాలకనుగుణంగా పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

బ్రిడ్జిలు ప్రత్యేకంగా ఉండేందుకు ప్యారిస్‌లోని బ్రిడ్జిలను పరిశీలించేందుకు కేటీఆర్ అధికారుల బృందాన్ని అక్కడకు పంపించారు. అక్కడి సెయిన్ నదిపై ఉన్న బ్రిడ్జిలను పరిశీలించిన అధికారుల బృందం హైదరాబాద్‌లో మూసీ కనుగుణంగా ఇక్కడ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టనున్నారు.

బ్రిడ్జిల డిజైన్లు ఇంకా ఖరారు కానప్పటికీ, తొలుత ఫౌండేషన్లు తదితర పనులు పూర్తి చేయనున్నారు. ఒక్కో బ్రిడ్జికి తాత్కాలికంగా కొన్ని నమూనాలను పరిశీలనలోకి తీసుకున్నారు. కేటీఆర్ ఆమోదం తర్వాత డిజైన్లను ఖరారు చేయనున్నారు. ఖరారయ్యాక పైభాగంలో డిజైన్, ఎలివేషన్ పనులు చేయనున్నారు.

పనులు ప్రారంభం కానున్న 4 బ్రిడ్జిల వివరాలు

మూసీపై జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో..

మూసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జి
- అంచనా వ్యయం: రూ.52 కోట్లు
- పొడవు : 220 మీటర్లు
- వెడల్పు: 29.5 మీటర్లు,
- ప్రయాణం: 6 లేన్లు

అత్తాపూర్ హైలెవెల్ బ్రిడ్జి
- అంచనా వ్యయం: రూ.35కోట్లు
- పొడవు: 160 మీటర్లు
- వెడల్పు: 17.50 మీటర్లు,
- ప్రయాణం: 3 లేన్లు.

అత్తాపూర్ వద్ద ప్రస్తుతమున్న బ్రిడ్జికి సమాంతరంగా ఈ కొత్త బ్రిడ్జి నిర్మిస్తారు.

ఫతుల్లాగూడ హైలెవెల్ బ్రిడ్జి
- అంచనా వ్యయం: రూ.52కోట్లు
- పొడవు: 200 మీటర్లు
- వెడల్పు: 26.75 మీటర్లు
- ప్రయాణం: 4 లేన్లు.

సన్‌సిటీ హైలెవెల్ బ్రిడ్జి

దీన్ని ఈసాపై నిర్మించనున్నారు.
- అంచనా వ్యయం: రూ.32కోట్లు
- పొడవు: 70 మీటర్లు
- వెడల్పు: 22.60 మీటర్లు
- ప్రయాణం: 4 లేన్లు.

15 బ్రిడ్జిలకు రూ. 545 కోట్లు

మూసీ–ఈసాలపై మొత్తం 15 బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన రూ.545 కోట్లకు ప్రభుత్వం ఇదివరకే పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. వాటిల్లో త్వరలో పనులు ప్రారంభం కానున్న నాలుగింటికి రూ.171 కోట్లు ఖర్చు కానుంది.



మూసారాంబాగ్ వంతెన నమూనా చిత్రం

బొమ్మ తుపాకీతో బెదిరించిన ఇద్దరి అరెస్ట్

హస్తినాపురం: బొమ్మతుపాకీతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్ శ్రీరామనగర్‌కాలనీకి చెందిన వీర్జాసింగ్, అతని స్నేహితుడు వెంకట్ నాయక్‌లు ఇద్దరు కలిసి మంగళవారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్ షాపింగ్‌కి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా..ఇంజాపూర్ దగ్గరకు రాగానే ఫారెస్ట్ పక్కన మూత్ర విసర్జన చేయడానికి బైకు ఆపారు. అదే సమయంలో టీఎస్ 12ఈఎఫ్ 4237 ఇన్నోవా వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు కారులోనుండి దిగి బొమ్మ తుపాకీతో వీర్జాసింగ్ తల కణతిపై పెట్టి డబ్బులు ఎన్ని ఉంటే అన్ని ఇవ్వాలని బెదిరించారు. దీనిని గమనించిన అతని స్నేహితుడు వెంకట్ నాయక్ తుపాకీ పెట్టిన వ్యక్తిని గట్టిగా పట్టుకుని అరిచాడు. దీనిని గమనించిన రోడ్డుపై వెళ్లే వ్యక్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బొమ్మ తుపాకీతో బెదిరించిన బోహోజు బాల బ్రహ్మాచారి, వినయ్‌మౌర్యలను అదుపులోకి తీసుకున్నారు. వీరు బీఎస్ రెడ్డి నగర్‌కు చెందినవారిగా గుర్తించారు. వారివద్ద నుండి బొమ్మ తుపాకీతోపాటు రెండు సెల్‌ఫోన్లు, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

- యువకుడి జీవితాన్ని మార్చేసిన వైనం
- స్కిజోఫేనియాతో మతిస్థిమితం కోల్పోయిన యువకుడు
- ఆరు నెలల క్రితం ఒడిశా నుంచి సికింద్రాబాద్ చేరిక
- చేరదీసిన మదర్ థెరిస్సా చారిటీ సంస్థ నిర్వాహకులు
- ఎట్టకేలకు కోలుకోవడంతో కుటుంబీకుల చెంతకు..

ఆదరించి... చేరదీసి!



సాక్షి, సిటీబ్యూరో: ఒడిశాకు చెందిన యువకుడు (23) స్కిజోఫీనియా అనే మానసిక వ్యాధి బారినపడి కుటుంబానికి దూరమయ్యాడు. అనాథగా సికింద్రాబాద్ వీధుల్లో సంచరిస్తున్న అతడిని చూసి చలించిన మదర్ థెరిస్సా చారిటీ సంస్థ అక్కున చేర్చుకుంది. ఈ సంస్థకు సేవలు అందించే ప్రొఫెసర్ డాక్టర్ అనిత రాయిరాల ప్రత్యేక శ్రద్ధతో చికిత్స చేశారు. ఎట్టకేలకు కోలుకున్న ఆ యువకుడు తన వివరాలు చెప్పడంతో అతికష్టమ్మీద కుటుంబీకుల వివరాలు సేకరించి సమాచారం ఇచ్చారు. బుధవారం సికింద్రాబాద్‌లోని చారిటీ కార్యాలయానికి వారిని రప్పించి యువకుడిని అప్పగించారు. సరైన వైద్యం అందిస్తే ఎంతో మంది మానసిక రోగులు బాగయ్యే అవకాశం ఉందని, అత్యంత క్లిష్టమైన స్కిజోఫీనియా వ్యాధికీ చికిత్స ఉందని డాక్టర్ అనిత 'సాక్షి'తో అన్నారు. ఒడిశాకు చెందిన నిరక్షరాస్యుడైన యువకుడు కొన్నేళ్ల క్రితమే స్కిజోఫీనియా అనే మానసిక వ్యాధి బారినపడ్డాడు. దీని ప్రభావంతో మాట్లాడలేకపోవడంతో పాటు ఏం చేస్తున్నాడో, ఎక్కడ ఉన్నాడో కూడా తెలియని స్థితికి చేరుకున్నాడు. అయినప్పటికీ నిరుపేదలైన కుటుంబీకులు అతడిని కంటికి రెప్పలా చూసుకున్నారు. దాదాపు ఆరు నెలల క్రితం ఇంటిని వదిలిన ఈ యువకుడు రైలులో సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. ఇతడి ఆచూకీ కోసం కుటుంబీకులు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. సికింద్రాబాద్‌కు చేరుకున్న ఈ యువకుడు ఫుట్‌పాత్‌పై దిక్కులేని వాడిలా జీవనం గడుపుతున్నాడు. రోడ్డుపై ఏది దొరికితే అది తింటూ, ఎక్కడ నీడ ఉంటే అక్కడ పడుకుంటూ గడిపాడు. ఈ యువకుడి దుస్థితి చూసిన ఓ వ్యక్తి మదర్ థెరిస్సా చారిటీ సంస్థకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన నిర్వాహకులు అతడిని అక్కున చేర్చుకున్నారు. నీడ, తిండి, బట్ట ఇవ్వడంతో పాటు వైద్యం చేయించారు. ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ అనిత రాయిరాల సామాజిక సేవలో భాగంగా ఈ సంస్థకు వెళ్లి అక్కడి వారికి వైద్యం చేస్తుంటారు. అలా రెండు నెలల క్రితం యువకుడికి చికిత్స ప్రారంభించి..ఆ యువకుడు మామూలు స్థితికి చేరుకునేలా చేశారు. అతడు ఒడియాతో పాటు కొద్దిగా హిందీ మాత్రమే మాట్లాడగలిగాడు. దీంతో డాక్టర్ అనిత ఒడిశాలోని ఓ డీఐజీ కార్యాలయం ఫోన్ నెంబర్ సేకరించి వారిని సంప్రదించారు. యువకుడితో మాట్లాడించడం ద్వారా అతడు చెప్పిన గుర్తుల్ని బట్టి స్థానిక పోలీసుస్టేషన్ నెంబర్ తీసుకున్నారు. ఆ ఠాణాను సంప్రదించిన అనిత పూర్తి వివరాలు చెప్పి, అతడితో మాట్లాడించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చేలా చేశారు. వాళ్లను సంప్రదించిన తర్వాత కూడా వీడియో కాల్ ద్వారా యువకుడిని చూపించి, మాట్లాడించి గుర్తించేలా చేశారు. చివరకు ఆ యువకుడి కుటుంబీకులు బుధవారం సికింద్రాబాద్ చేరుకున్నారు. చారిటీ కార్యాలయంలో కోలుకున్న స్థితిలో ఉన్న అతడిని చూసిన కుటుంబీకులు ఉద్వేగానికి లోనయ్యారు. చారిటీ నిర్వాహకులు అతడిని వారికి అప్పగించారు. ఇక జీవితంలో చూడలేమని భావించిన తన సోదరుడిని తిరిగి అప్పగించిన మదర్ థెరిస్సా చారిటీ సంస్థకు, అతడిని మామూలు మనిషిని చేసిన డాక్టర్ అనితకు యువకుడి సోదరి ధన్యవాదాలు తెలిపారు.

డబ్బు తీసుకుని మెటీరియల్ పంపలేదని పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్: మెటీరియల్ కొనుగోలు కోసం నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న అనంతరం వస్తువులు పంపకుండా చీటింగ్ చేసినట్టు ఓ మహిళా పారిశ్రామికవేత్త మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మధీనాగూడకు చెందిన బి.హేమలత, ఆమె భర్త మురళీకృష్ణలు యునైటెడ్ ఎలయన్స్ కంపెనీలో పార్టనర్స్‌గా ఉంటున్నారు. వారితోపాటు నీలేష్ బిస్వాస్ అనే వ్యక్తి కూడా అదే కంపెనీలో పార్టనర్‌గా కొనసాగుతున్నారు. వీరు ప్రభుత్వ రంగ సంస్థలైన డీఆర్‌డీఓ, ఆర్‌సీఐ, డీఆర్‌డీఎల్, డీఎంఆర్‌ఎల్, ఏఎస్‌ఎల్ సంస్థకు వివిధ రకాల మెటీరియల్స్ సరఫరా చేస్తుంటారు. ఇందులో భాగంగా 2021లో వీరి పార్ట్‌నర్, చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఎన్‌టీ కంపెనీ నిర్వాహకుడైన నీలేష్ బిస్వాస్‌కు మెటీరియల్ నిమిత్తం రూ.68 లక్షల 48 వేలు చెల్లించారు. కానీ మెటీరియల్ అనుకున్న మేరకు పంపలేదు. 2022, ఏప్రిల్ 6న మురళీకృష్ణ మరణించారు. దీంతో అతని భార్య హేమలత వ్యాపారాలు చూసుకుంటోంది. ఈ క్రమంలో మెటీరియల్ సరఫరా విషయంలో నీలేష్ బిస్వాస్ మోసం చేసినట్లు గుర్తించి తనకు న్యాయం చేయాలంటూ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు కేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘరానా దొంగ అరెస్టు

- 20కి పైగా కేసుల్లో నిందితుడు
- సహకరించిన మహిళ సైతం అరెస్టు...


నిందితులు పండరిస్వామి, రహీమాబేగం

కుత్బుల్లాపూర్: ఇరవైకి పైగా కేసుల్లో నిందితుడిగా ఉండి.. తప్పించుకు తిరుగుతున్న నిందితుడు, అతనికి సహకరిస్తున్న ఓ మహిళను మేడ్చల్ సీసీఎస్, దుండిగల్ పోలీసుల సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.పది లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శబరీష్ నిందితుల వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ఆనంద్ నగర్‌కు చెందిన పండరి స్వామి (25) మల్లంపేట్‌లోని బీసీ కాలనీలో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిస అయిన పండరి స్వామి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో దొంగతనాలకు పాల్పడుతూ వస్తున్నాడు. గతంలో జైలుకు కూడా వెళ్లొచ్చాడు. చోరీ చేసిన వెండి, బంగారు, ఎలక్ట్రానిక్ తదితర వస్తువులను ఇదే ప్రాంతంలో ఉంటున్న రహీమా బేగం (44) సహాయంతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. తనిఖీల్లో భాగంగా బుధవారం మల్లంపేట్‌లో సీసీఎస్ మేడ్చల్, దుండిగల్ పోలీసులు బైక్‌పై వచ్చిన నిందితులను ఆపే ప్రయత్నం చేయగా తప్పించుకోవాలని చూశారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారిని పట్టుకున్నారు. వెండి, బంగారు ఆభరణాల విషయమై ఆరా తీయగా సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో పండరిస్వామి, రహీమాబేగంలను స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా దొంగిలించిన సొత్తును విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అంగీకరించారు. నిందితుల నుండి 80 గ్రాముల బంగారం, 359 గ్రాముల వెండి, నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, 85 శానిటరీ టాప్స్, ఏడు విద్యుత్ వైర్ల బండిల్స్, ఆరు స్పీకర్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా పండరి స్వామి దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7, సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో 2, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 3, ఐడియా బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి చొప్పున మొత్తం పదమూడు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించాడు. గతంలో నిజామాబాద్ జిల్లాలో 17 కేసులు, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 4 కేసులు, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు మొత్తం 24 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.


స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న డీసీపీ శబరీష్

తొమ్మిది మంది సైబర్ నేరగాళ్లకు చెక్!

వీరు కొల్లగొట్టిన మొత్తం రూ.2 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలైన సైబర్ నేరాల కేసుల్లో నిందితులుగా ఉన్న తొమ్మిది మందిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు బుధవారం వెల్లడించారు. వీరిలో ఒకరు సోషల్‌మీడియా ద్వారా వేధించిన వ్యక్తి కాగా..మిగిలిన ఎనిమిది మందీ అమాయకులకు ఎరవేసి రూ.2 కోట్ల వరకు కొల్లగొట్టారు. గిఫ్ట్, జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌లో నిందితులుగా ఉన్న ఉమాకాంత్ దీక్షిత్, శుభం తివారీ, రవికుమార్, అతుల్ శర్మ, షహీన్, నీరజ్‌కుమార్, బిపిన్ కుమార్, బిందేశ్వర్ మండల్ కోసం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగాలు ఉత్తరాదిలో ముమ్మరంగా గాలించాయి. ఎట్టకేలకు ఆగ్రా, ఢిల్లీ, హర్యానా, ఛత్తీస్‌గఢ్, బీహార్, రాజస్థాన్‌ల్లో వీరిని అరెస్టు చేశారు. వీరందరినీ నగరానికి తీసుకువచ్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

భవిష్యత్‌లో 'కృత్రిమ మేధ' పాత్ర కీలకం

లక్డీకాపూల్: ప్రజల జీవన విధానాన్ని సమూలంగా మార్చడంలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్ర కీలకం కానున్నదని డిజిటల్ సాంకేతిక రంగ నిపుణులు, 7సీస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఎండీ ఎల్.ఎం.శంకర్ పేర్కొన్నారు. అంతే కాకుండా ఎన్నో రకాల సమస్యలకు అనూహ్యమైన పరిష్కారాలను కనుగొనే శక్తిసామర్థ్యాలు కృత్రిమ మేధకు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జీ20 సమ్మిట్‌లో కృత్రిమ మేధ అంశంపై చర్చ జరిగిందన్నారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ప్రభుత్వాలతో పాటు ప్రైవేటు రంగ సంస్థలు సైతం ఏఐపై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కృత్రిమ మేధ నేర పరిశోధన, వ్యాధుల తీరుతెన్నులు, వాటి తీవ్రత గుర్తింపు, ప్రభుత్వ పథకాల్లో లొసుగుల నివారణ తదితరాల్లో ఉపయోగపడుతుందన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఏఐ మిషన్, నాస్కామ్ ఆధ్వర్యంలో ఏఐపై ఓ నివేదికను తయారు చేసిందని చెప్పారు. మరో రెండేళ్లలో ఏఐ ఆధారంగా లక్షన్నర ఉద్యోగాలు రాబోతున్నాయని అంచనా వేసిన ఆ నివేదిక... ఇది ఇంకా పెరగబోతోందని కూడా చెప్పుకొచ్చిందని వివరించారు. ఈ దిశగా ప్రభుత్వం సానుకూల దృక్పథంతో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని శంకర్ పేర్కొన్నారు.

జేఎల్ పరీక్ష ప్రశ్నపత్రాన్ని పునఃపరిశీలించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇటీవల జరిగిన ఇంగ్లిష్ జేఎల్ (జూనియర్ లెక్చరర్) ఉద్యోగాల రాత పరీక్ష ప్రశ్న పత్రాన్ని పునఃపరిశీలించాలని ఓయూ జేఏసీ అధ్యక్షులు డా. ఎల్చల దత్తాత్రేయా డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇంగ్లిష్ జేఎల్ ప్రశ్నపత్రం పారదర్శకంగా లేదన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన సిలబస్‌కు, పరీక్షలో వచ్చిన ప్రశ్నలకు సంబంధం లేదన్నారు. సిలబస్‌లో లేని అంశాల పైన 70 శాతం ప్రశ్నలు ఇచ్చారని వివరించారు. ఈ కారణంగా నిరుద్యోగులు నష్టపోతారని, దీనిపై సీనియర్ ఇంగ్లిష్ అధ్యాపకులచే విచారణ చేపట్టాలని లేదా పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పాత కక్షల నేపథ్యంలో యువకుడి దారుణ హత్య


సయ్యద్ నసీర్ (ఫైల్)

సంతోష్‌నగర్: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన బుధవారం తెల్లవారుజామున కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..హఫీజ్ బాబానగర్ సి-బ్లాక్ ప్రాంతానికి చెందిన సయీదా బేగం పెద్ద కుమారుడు సయ్యద్ నసీర్ ఏసీ మెకానిక్‌గా పని చేస్తుంటాడు. హషమాబాద్ ప్రాంతానికి చెందిన బాబా షిండే కుమారుడు విశాల్ షిండే హత్య కేసులో సయ్యద్ నసీర్ నిందితుడిగా ఉన్నాడు. దీంతో బాబా షిండేతో విరోధం ఉంది. ఈ క్రమంలో తన కుమారుడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న సయ్యద్ నసీర్‌ను ఎలాగైనా చంపాలని బాబా షిండే పథకం వేశాడు. బుధవారం తెల్లవారుజామున 2.20 గంటలకు బాబా షిండే, తన కుమారుడు ఆకాశ్ షిండేతో పాటు మరికొంతమందితో కలిసి హఫీజ్‌బాబానగర్‌కు చేరుకున్నాడు. ఇంటి ముందు ఆటోలో కూర్చున్న సయ్యద్ నసీర్‌పై కత్తులతో దాడి చేశారు. అరుపులకు తల్లి సయీదా బేగం తన చిన్న కుమారుడితో కలిసి బయటికి వచ్చి చూసి దాడిని అడ్డుకోబోయింది. కానీ దుండగులు ఆమెను బెదిరించి..నసీర్‌ను తీవ్రంగా గాయపరిచి ద్విచక్ర వాహనాలపై పారిపోయారు. అనంతరం నసీర్‌ను చికిత్స నిమిత్తం ఓవైసీ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాబా షిండే, ఆకాశ్ షిండేలతో పాటు మరికొంత మంది తన కుమారుడిని హత్య చేశారని తల్లి సయీదా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా సంఘటన స్థలాన్ని సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సిహెచ్. రూపేశ్, సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్ గౌస్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

సీబీఐటీలో ఎడ్యుకేషన్ ఫెయిర్

మణికొండ: విదేశాలలో ఉన్నత విద్యపై విద్యార్థులకు అవసరమైన అవగాహన కల్పించేందుకు గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో బుధవారం ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించారు. కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్, గ్లోబల్ ఎడ్యుకేషన్, కెరీర్స్ ఫోరం, సీబీఐటీ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించాయి. యూఎస్ఏ, ఐర్లాండ్‌ల నుంచి 15 ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు విదేశాలలో ఉన్నత విద్యకు ఉన్న అవకాశాలను వివరించారు. అలాగే విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, సీహెచ్ హరీష్, ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ప్లేస్ మెంట్ అధికారి డాక్టర్ ఎన్ఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చి.. ఏమార్చి!

పోలీసుల దృష్టి మరల్చేందుకు నేరస్తుల ఎత్తుగడ

- పాత పేరుతో ఉన్న ఆస్తులు, బ్యాంక్ ఖాతాలు క్లోజ్
- ఇంటి, తండ్రి పేర్లతో సహా మార్చేస్తున్న క్రిమినల్స్
- వీటితో కొత్త పాన్, ఆధార్ కార్డ్‌లు సృష్టిస్తున్న వైనం
- దీంతో కేసుల దర్యాప్తులో ఆలస్యం

సాక్షి, సిటీబ్యూరో: నేరం జరిగిన వెంటనే పోలీసులు చేసే మొదటి పని..అనుమానితులు ఎవరు? వారికి నేర చరిత్ర ఏమైనా ఉందా? అని ఆరా తీయడమే! దీన్ని గమనించిన నేరస్తులు..పోలీసులు దృష్టి మరల్చేందుకు సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఇంటి పేరు, తండ్రి పేరుతో సహా మార్చి పోలీసులకు సవాల్ విసురుతున్నారు. నకిలీ పేర్లతో పాన్, ఆధార్ కార్డులు సృష్టించి వారి నేర చరిత్రను కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. పాత పేర్లతో ఉన్న స్థిర చరాస్తులను విక్రయిస్తున్నారు. బ్యాంక్ ఖాతాలను మూసేస్తున్నారు. దీంతో కేసు దర్యాప్తులో పోలీసులకు ఆటంకం కలుగుతోంది.

దర్యాప్తులో ఆలస్యం...

నేరం జరిగిన తర్వాత పోలీసుల డేటా బేస్‌లో పాత నేరస్తుల పనా, ఇలాంటి తరహా నేరాలేమైనా జరిగాయా అని విచారణాధికారులు పరిశీలిస్తారు. ఒకవేళ ఉంటే ఆ కోణం నుంచి దర్యాప్తు మొదలుపెడతారు. పాత నేరస్తుల కదలికలపై పోలీసుల నిఘా ఉంటుంది కాబట్టి పట్టుకోవడం సులువవుతుంది. అదే కొత్త నేరస్తుడైతే పట్టుకోవడం ఆలస్యమవుతుంది. వాంగ్మూలం ఇప్పించడంలోనూ జాప్యం జరుగుతుంది. దీన్ని తెలుసుకున్న నేరస్తులు కొత్తరకం కుతంత్రాలకు పాల్పడుతున్నారు. గతంలో సంచలనం సృష్టించిన రియల్టర్ల జంట హత్య కేసులో ప్రధాన నిందితుడు మేరెడ్డి మట్టారెడ్డి పేరు మార్చుకోవడంతో పోలీసు దర్యాప్తు ఆలస్యమైంది. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు సైతం గుర్తించారు. 'పాత నేరాల తాలూకు ఆనవాళ్లు ఎక్కడ కూడా కనిపించకుండా ఉండేందుకు నేరస్తులు ముందస్తు ప్రణాళికలు రచిస్తున్నారు. తాజా నేరాలలో పోలీసులకు చిక్కినా తొలిసారి నేరస్తుడిగా భావించాలని, శిక్ష కాస్త తగ్గుతుందని ఎత్తుగడలు వేస్తున్నారు' అని ఓ పోలీసు ఉన్నతాధికారి స్వయంగా వ్యాఖ్యానించారు.

ఉద్రిక్తంగా బీజేవైఎం ర్యాలీ


అల్వాల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

అల్వాల్: జాగో మల్కాజిగిరి పేరుతో అల్వాల్‌లో బీజేవైఎం నిర్వహించిన బైక్ ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. పలువురిపై కేసులు నమోదు అయ్యాయి. బీజేవైఎం నాయకులు పీఎం.సాయి ప్రసాద్ కొంతకాలంగా ఎమ్మెల్యే మైనంపల్లికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాడు. ఇందులో భాగంగా జాగో మల్కాజిగిరి పేరుతో బుధవారం అల్వాల్‌లో 1500 మందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మైనంపల్లి అక్రమాలను బయట పెడతానని ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ర్యాలీ కానాజీగూడ నుంచి ప్రారంభమై వెంకటాపురం మీదుగా అల్వాల్‌లోని మైనంపల్లి పాత నివాసం వద్దకు చేరుకొని అక్కడే ఉన్న వివాదాస్పద భవనంపై పబ్లిక్ ప్రాపర్టీ అంటూ పెయింటింగ్ వేశారు. అనంతరం ఓల్డ్ అల్వాల్ మీదుగా కొంపల్లి ఐస్ ఫ్యాక్టరీ వైపు వెళ్లారు. చాలాకాలం నుంచి వివాదాస్పద స్థలంగా ఉండి ఇటీవలే ప్రభుత్వ అనుమతులతో నిర్మాణాలు జరుగుతున్న రాక్‌ల్యాండ్ ఎవెన్యూ వద్ద ఆగి మైనంపల్లి కబ్జాలతో కాలనీ ఏర్పడిందంటూ పీఎం. సాయి ప్రసాద్ విమర్శలు చేశారు. అప్పటికే సిద్ధంగా ఉన్న జేసీబీలను కాలనీ ముఖద్వారం వద్దకు తీసుకువెళ్లి కూల్చివేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డుకునే యత్నం చేశారు. సమాచారం అందుకున్న కాలనీవాసులు, మైనంపల్లి అనుచరులు ఘటన స్థలానికి చేరుకొని బీజేవైఎం నాయకులతో వాగ్వాదానికి దిగడంతో పాటు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు బీజేవైఎం నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. అన్ని అనుమతులతో నిర్మాణాలు చేసుకున్న తమ కాలనీపై దాడులకు పాల్పడటంపై కాలనీవాసులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రెస్‌పాస్, ప్రాపర్టీ డ్యామేజీ చేసినందుకు పలువురిపై కేసులు నమోదయ్యాయి. దాడులకు పాల్పడిన వారిని గుర్తిస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: కుందన్‌బాగ్, కళ్యాణ్‌నగర్ పార్కు 11 కేవీ ఫీడర్లు, కుందన్‌బాగ్, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐఏఎస్ క్వార్టర్స్, ఐపీఎస్ క్వార్టర్, మినిస్టర్ క్వార్టర్స్, కళ్యాణ్‌నగర్ పార్కు, సారథినగర్ కో ఆపరేటివ్ సొసైటీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. చికోటి గార్డెన్, మయూర్‌మార్గ్, బోరబండ ఎస్‌ఆర్‌ఆర్‌పురం, మూసాపేట, పవార్‌నగర్ 11 కేవీ ఫీడర్లు, బేగంపేట ఎయిర్‌పోర్ట్, హెచ్‌పీఎస్, మోతీనగర్, ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రకాశ్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుకవైపు, చికోటి గార్డెన్, మయూరి మార్గ్, అల్లం తోట బావి, గీతాంజలి స్కూల్, మోతీనగర్, సిండికేట్ బ్యాంక్, ఎస్‌ఆర్‌ఆర్‌పురం సైట్-1, మాజీ డిప్యూటీ మేయర్ ఇల్లు, శక్తినగర్, మూసాపేట, ఎక్స్ రోడ్స్, ఆల్‌సబా హోటల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వివరించారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

వెంగళరావునగర్: ఖైరతాబాద్, షేక్‌పేట విద్యాశాఖ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఇంగ్లిష్ టీచర్లకు బుధవారం నాంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ట్రెయినింగ్ ఇచ్చారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో దాదాపు 40 మంది టీచర్లు పాల్గొన్నారు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్ సామర్థ్యాలు ఎలా పెంపొందించాలి, పదో తరగతిలో ఎలా ఉత్తమ ఫలితాలు రాబట్టాలి అనే అంశాలను తెలియజేశారు. రిసోర్స్ పర్సన్లు స్నేహలత, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగాయి.

వేడుకగా మృత్యుంజయ హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవసన్నిధానం ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా బుధవారం శ్రీ సంతాన పాశుపత సహిత మహా మృత్యుంజయ హోమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు, హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి నెలా ఈ హోమాన్ని నిర్వహిస్తుంటామని అర్చకులు తెలిపారు.

మండపాలకు గణనాథులు



బంజారాహిల్స్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణనాథుల విగ్రహాలు మండపాలకు చేరుకుంటున్నాయి. బుధవారం దూల్‌పేట్ నుంచి వివిధ రంగులు, రూపాల్లో విగ్రహాలు తరలించారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్-14లోని స్టడీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేస్తున్న 18 ఫీట్ల విగ్రహాన్ని పరమేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తీసుకొచ్చారు. ఒక్క రోజే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, చింతలబస్తీ, ఫిలింనగర్ తదితర ప్రాంతాల్లో పాతిక వరకు విగ్రహాలు యువత తరలించారు. అప్పుడే సందడి నెలకొంది.

నిత్యావసర సరుకుల పంపిణీ



లిబర్టీ: పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎస్.శర్మ అన్నారు. సమితి ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న పేదలు, కూలీలకు బుధవారం బియ్యం, దుస్తులను పంపిణీ చేశారు.

వేలి ముద్ర వేయకుంటే... రేషన్‌లో కోతే!

- ప్రారంభమైన కేవైసీ పునరుద్ధరణ ప్రక్రియ
- కార్డుల ఆధారంగా యూనిట్లు
- పునరుద్ధరించకుంటే కోత తథ్యమంటున్న అధికారులు


బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని ఉదయ్‌నగర్‌లో రేషన్ షాపులో వేలి ముద్రలు వేస్తున్న కార్డుదారులు

రేషన్ బియ్యం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం దృష్టిసారించింది. కార్డులో పేరు ఉన్నవారికే బియ్యం అందేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందుకోసం ఆహార భద్రత కార్డులోని ప్రతి ఒక్కరి వేలి ముద్రలు తీసుకొని అందులో వేలి ముద్రలు వేసిన వారికి మాత్రమే రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

బంజారాహిల్స్: పౌర సంబంధాల శాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 81 రేషన్ దుకాణాల్లో సోమవారం నుంచి రేషన్ కార్డుల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. కుటుంబ యజమానితో పాటు కార్డులో పేరు ఉన్న ప్రతి లబ్ధిదారు తన పరిధిలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-పాస్ యంత్రం ద్వారా తమ కేవైసీని పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కేవలం రేషన్ షాపుల్లోనే చేపట్టాలని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

- అంతేకాదు కేవైసీ పునరుద్ధరణ త్వరితగతిన పూర్తి చేయాలని డీలర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.
- రేషనింగ్ సర్కిల్-7 ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 81 రేషన్ దుకాణాల పరిధిలో 83,127 తెల్లరేషన్ కార్డులు, ఒక అన్నపూర్ణ కార్డు, 3368 అన్నయోజన, అంత్యోదయ కార్డులు ఉండగా ఈ కార్డులన్నింటిలో మొత్తం 2,85,267 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరి వేలి ముద్రలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.
- ప్రతి రేషన్ షాపుకు సరఫరా అవుతున్న బియ్యం తప్పనిసరిగా లబ్ధిదారులకు చేరాలన్నదే ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తున్నది.
- మరోవైపు రేషన్ కార్డులు కలిగిన వినియోగదారుల్లో కొంత మంది కుటుంబ యజమానులు మరణించడం, ఆడపిల్లలకు వివాహాలు జరిగి అత్తారింటికి వెళ్లిపోవడం, కొడుకులు విడిపోయి మరోచోట ఉంటుండటం తదితర సంఘటనలు చోటు చేసుకున్నాయి.
- అయితే కుటుంబ సభ్యుల్లో ఎవరు లేకున్నా బియ్యం మాత్రం యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున యదాతథంగా పంపిణీ జరుగుతూనే ఉంది. దీనిపైనే ప్రభుత్వం దృష్టి సారించింది.

కేవైసీ పరిశీలన ఇలా...

ఆహార భద్రత కార్డు కలిగిన కుటుంబ యజమానితో పాటు కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులందరూ తమ పరిధిలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-పాస్ యంత్రంలో మరోమారు వేలి ముద్రలు వేయాలి. వేలి ముద్ర వేయగానే రేషన్ కార్డు నెంబర్‌తో పాటు సదరు వ్యక్తి ఆధార్ కార్డు నెంబర్ చూపిస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా ఆకుపచ్చ వెలుగు వచ్చి సదరు వినియోగదారుడి కేవైసీ పునరుద్ధరించబడుతుంది.

- ఒక వేళ కేవైసీ పునరుద్ధరణలో ఈ-పాస్ యంత్రంలో రెడ్ సిగ్నల్ వస్తే సదరు వినియోగదారుడి రేషన్ కార్డు, ఆధార్ కార్డు సరిపోలేదని అర్థం. ఈ ప్రకారం ఒక యూనిట్ రేషన్ కార్డు నుంచి తొలగించబడుతుంది.
- రేషన్ కార్డులో ఎంత మంది పేర్లు ఉంటాయో వారంతా రేషన్ షాపు వద్దకు ఒకేసారి వెళ్లి కేవైసీ చేసుకోవాల్సి ఉంటుంది. ఒక కుటుంబంలో ఆయిదుగురు ఉంటే వారంతా రేషన్ షాప్‌కు వెళ్లాలి. ఒక వేళ అందులో ఇద్దరు, ముగ్గురు వెళ్లకపోతే వారిపేర్లను కార్డులో నుంచి తొలగించబడుతుంది.
- గైర్హాజరైన వారి వివరాలు ఈ-పాస్ యంత్రంలో నమోదై ఉంటాయి. కార్డులో ఎంత మంది ఉంటే అంతమంది వేలి ముద్రలు ఇవ్వడం, ఏ ఒక్కరు వెళ్లకున్నా వారి రేషన్ కోతకు గురవడం తథ్యమని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

> **పెను భారం...**
>
> రేషన్ షాపుల్లో కేవైసీ పునరుద్ధరణ ప్రక్రియ రేషన్ డీలర్లకు పెను భారంగా తయారైంది. వేలి ముద్రల స్వీకరణ వల్ల సమయం చాలా వరకు వృథా అవుతున్నది. ఇప్పటికే రేషన్ డీలర్లు ఎన్నో పనులతో సతమతమవుతున్నారు. బియ్యం పంపిణీతోనే రోజంతా గడుస్తున్నది. రేషన్ కార్డులో ఎంత మంది పేర్లు ఉంటే అంత మంది వేలి ముద్రలు తీసుకోవాలనే ప్రక్రియ చాలా క్లిష్టతరమైనది. సాంకేతిక సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఈ-పాస్ యంత్రం పలుచోట్ల పనిచేయడం లేదు. అందుకే ఈ ప్రక్రియను మీ-సేవా కేంద్రాలకు పరిమితం చేయాలి. కార్డుదారులు మీ-సేవా కేంద్రాలకు వెళ్లి అక్కడే వేలి ముద్రలు ఇచ్చేలా ఈ విధానాన్ని అమలు చేస్తే బాగుంటుంది. మేం కూడా అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాం. రేషన్ డీలర్లపై ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు రుద్దవద్దని కూడా విజ్ఞప్తి చేశాము.
>
> – ప్రసాద్‌గౌడ్, అధ్యక్షుడు, ఖైరతాబాద్ జోన్ రేషన్ దుకాణాల సంఘం

వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు నిరుద్యోగులే గుణపాఠం చెబుతారు


కిషన్‌రెడ్డి నిరాహార దీక్షలో పాల్గొన్న ఆలపాటి లక్ష్మీనారాయణ


దీక్షలో పాల్గొన్న కీర్తిరెడ్డి తదితరులు

బంజారాహిల్స్: తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ సర్కార్ నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం, వివక్ష చూపుతోందని కేసీఆర్ సర్కారు నిరుద్యోగులను మోసం చేసిందంటూ బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన 24 గంటల నిరాహార దీక్షలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ నేత ఆలపాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. నియోజకవర్గం నుంచి కార్యకర్తలతో కలిసి ఆయన ఈ దీక్షలో పాల్గొని కిషన్‌రెడ్డికి మద్దతుగా బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు తగన గుణపాఠం చెప్పేందుకు యువకులు, నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని కేసీఆర్ ఎన్నో సార్లు చెప్పారని ఉద్యోగాలు మాత్రం రాలేదని దుయ్యబట్టారు. ప్రశ్నాపత్రాలు లీక్ చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఇప్పటిదాకా డీఎస్సీ వేయలేదని లక్షల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఇవ్వడంలోనూ సర్కారు విఫలం అయిందన్నారు.

వెంగళరావునగర్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లంకెల దీపక్‌రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జూటూరు కీర్తిరెడ్డి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కుంభాల గంగరాజు, ఆలపాటి లక్ష్మీనారాయణ, అట్లూరి రామకృష్ణ, ప్రేమ్‌కుమార్, ఎన్.విజయ్‌కుమార్, కనకరాజు, చంద్రమోహన్, అల్లం సంగీత ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


దీక్షలో పాల్గొన్న విద్యుత్ కార్మికులు

వెంగళరావునగర్: సమస్యలు పరిష్కరించాలంటూ టీఎస్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్‌లోని విద్యుత్ స్కాడా కార్యాలయం ఎదుట జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు సీఐటీయూ, సీపీఎం నేతలు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు, సీపీఎం, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ... విద్యుత్ కార్మికులు న్యాయబద్ధంగా అడుగుతున్న కోర్కెలను తక్షణమే ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు జె.బస్వరాజ్, సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆర్.అశోక్, టి.సాయిశేషగిరిరావు, విద్యుత్ యూనియన్ నేతలు వెంకన్న, మహేష్, శ్రావణ్ కుమార్, రవీంద్రబాబు, లింగన్న, బీరయ్య, నవీన్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిట్ల శ్రీనివాస్


నియామక పత్రాలు అందుకున్న బిట్ల శ్రీనివాస్, బరిగెల వెంకటస్వామి

వెంకటేశ్వరకాలనీ: తెలంగాణ మాలల సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని వెంగళరావు పార్కు వద్ద జరిగింది. ఈ సందర్భంగా బాలాపుర బస్తీకి చెందిన బిట్ల శ్రీనివాస్‌రాజ్ తెలంగాణ మాలల సమితి (టీఎంఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. బంజారాహిల్స్ రోడ్ నెం 5లోని దేవరకొండ బస్తీకి చెందిన సీనియర్ నేత మన్నెం వీరాస్వామి టీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. వీరికి రాష్ట్ర టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల వెంకటస్వామి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాలల ఐక్యతకు కృషి చేయడంతో పాటు వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు. తమపై నమ్మకం ఉంచి పదవులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రారంభం


ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని యూపీహెచ్‌సీలో బుధవారం కార్పొరేటర్ విజయారెడ్డి ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా హెల్త్ కార్డులు పొందడం, యూపీహెచ్‌సీలో నిర్వహించే వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఖైరతాబాద్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి

బంజారాహిల్స్: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాల నిమిత్తం ఏర్పాటు చేసుకునే మండపాలకు విద్యుత్ శాఖ నుంచి తప్పక అనుమతి తీసుకోవాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీఈ రాంశెట్టి హైమానందం స్పష్టం చేశారు. రోడ్లపై మండపాలు ఏర్పాటు చేసేవారు స్థానిక ఏడీఈకి దరఖాస్తు చేసి అనుమతి పొందాలని అన్నారు. నివాసాల నుంచి కరెంటు తీసుకునేవారు ఎలాంటి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. 250 వాట్స్ వరకు రూ. 500, 250 వాట్స్ కంటే ఎక్కువ 500లోపు ఉంటే రూ. 1000, 500 వాట్స్ కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం చేస్తే రూ. 1500 వరకు చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు 11 రోజుల పాటు ఎల్‌టీ టెంపరరీ సప్లయ్ జరుగుతుందని ఆయన వెల్లడించారు. కరెంటు వైర్ల నుంచి ఇష్టానుసారంగా కరెంటును తీసుకోవద్దని దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తప్పనిసరిగా విద్యుత్ లైన్‌మెన్ ద్వారానే అనుమతి తీసుకొని మండపాలకు కరెంటు కనెక్షన్లు పొందాలని సూచించారు.

పంథామార్చుకున్న దొంగలు!

పంజగుట్ట: బస్సుల్లో పిక్ ప్యాకెటింగ్ చేసే వారు కొత్త పంథాను ఎంచుకున్నారు. పసిపిల్లల్ని బస్సు సీటులో కూర్చున్న వారి ఒడిలో ఉంచి వారిని తీసుకునే క్రమంలో మెడలోంచి బంగారు ఆభరణాలు దొంగిస్తున్నారు. అలాంటి ఘటనే పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్, కోహెడాకు చెందిన పటేల్‌గూడెం లక్ష్మమ్మ జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి. ఈ నెల 11వ తేదీన లక్ష్మమ్మ పని నిమిత్తం సికింద్రాబాద్‌లో 10 నెంబర్ బస్సు ఎక్కింది. ఆమె సీటులో కూర్చుని ఉండగా ఆమె పక్కనే ఇద్దరు మహిళలు నిలబడి ఉన్నారు. వారి వద్ద ఉన్న పిల్లల్ని రెండు సార్లు లక్ష్మమ్మ ఒడిలో కూర్చుండబెట్టారు. బస్సు అమీర్‌పేట కనకదుర్గ అమ్మవారి దేవాలయం వద్దకు వచ్చాక లక్ష్మమ్మ బస్సు దిగి మెడలో చూసుకోగా మూడు తులాల బంగారు మంగళసూత్రం మాయమయ్యింది. తన ఒడిలో పిల్లల్ని కూర్చోబెట్టిన మహిళలే దొంగతనం చేసి ఉంటారని భావించిన లక్ష్మమ్మ కోర్టు ద్వారా పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జంతువుల జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన


జూపార్కులో సంస్కార్ స్కూల్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: జూ పార్కులోని జంతువులు.. వాటి జీవన విధానం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు నగరంలోని జూపార్కును సందర్శించారు. అక్కడి అడవి జంతువులతో పాటు పలు విషయాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి పాల్గొన్నారు.

మహిళా బిల్లును ప్రవేశపెట్టాలి

లిబర్టీ: పెండింగ్‌లో ఉన్న మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించి మహిళల పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పదాధికారుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ... అన్ని రాజకీయ పక్షాలు మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లోనే మహిళా బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. నేతలు నవ్య, సుభాష్, సాయి, చరణ్ పాల్గొన్నారు.

సన్మానం



లిబర్టీ: వ్యక్తులు.. శక్తులు సమన్వయంతో రాష్ట్ర, దేశ అభివృద్ధికి పాటుపడాలని ప్రముఖ సినీ నటుడు సుమన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేష్ పిలుపునిచ్చారు. సామాజిక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. ఆదినారాయణను వారు ఘనంగా సన్మానించి అవార్డు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు వ్యక్తులు సమైక్యంగా పేదలకు చేయూతనివ్వడం ద్వారా తమ జీవితం ధన్యమవుతుందన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు మహిళకు అప్పగింత

గంటలోగా ఆటోను గుర్తించిన పోలీసులు



బంజారాహిల్స్: ఓ మహిళ ఆటోలో పోగొట్టుకున్న నగదు బ్యాగును మాసబ్‌ట్యాంక్ పోలీసులు గంట వ్యవధిలో పట్టుకుని అప్పగించారు. ఎస్ఐ శేఖర్ సమాచారం మేరకు... టోలిచౌకికి చెందిన రాజియా అనే మహిళ బుధవారం ఏజీ బస్టాప్‌లో ఆటో ఎక్కి తన ఇంటి వద్ద దిగింది. ఐతే ఆటోలో రూ. 52,150, విలువైన డాక్యుమెంట్లు ఉన్న బ్యాగును మర్చిపోయింది. ఇంటికి వెళ్లిన తరువాత గమనించింది. బయటకు వచ్చి చూడగా అప్పటికే ఆటో వెళ్లిపోయింది. ఈ ఘటన హుమాయూన్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరగగా ఆమె మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పరిధి తమది కాకున్నా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో ఆటోను ట్రేస్ చేసి నెంబర్ గుర్తించారు. గంటలో ఆటో డ్రైవర్ దొరికాడు. ఆటోలోనే ఉన్న బ్యాగును బాధితురాలికి అందజేశారు.

'డబుల్' ఇళ్ల కోసం మహిళల ఆందోళన


హిమాయత్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న మహిళలు

హిమాయత్‌నగర్: తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నారంటూ హిమాయత్‌నగర్ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 14లోని మహిళలు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కేవలం ఎన్నికలప్పుడే వాగ్దానాలు ఇచ్చి మభ్యపెడుతున్నారంటూ విమర్శించారు. ఈ మేరకు బుధవారం హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 14లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం మహిళలు నిరసనకు దిగారు. సొంత ఇళ్లున్నవారికే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతున్నదని, తమకు మాత్రం ఇళ్లను మంజూరు చేసేవారు లేరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కూలీనాలి చేసుకుని జీవనం సాగిస్తున్న తమను ప్రతి ఒక్కరూ విస్మరిస్తున్నారని, ఇప్పుడు నిర్మాణం పూర్తయిన ఇండ్లను అలాట్ చేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రమం వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం ఎమ్మెల్యే కనిపిస్తున్నారని ఆ తర్వాత తమను సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవ తీసుకొని తమ సొంతింటి కల నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

శంకుస్థాపన చేసి నాలుగు నెలలైనా..!


ఎమ్మెల్యే కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎమ్మెల్యే కాలనీలో రమేష్ హెయిర్ కటింగ్ సెలూన్ చౌరస్తాలో నాలుగు వైపులా సీసీ రోడ్డు నిర్మాణం కోసం జూన్ 19 వతేదీన నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. రూ. 7.50 లక్షల వ్యయంతో ఇక్కడ సిమెంటుతో ప్యాచ్‌వర్క్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. తరచూ రోడ్డుకు గుంతలు, వరద, బురద నిండిపోవడం, స్థానికంగా రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో మేయర్ ప్రత్యేకంగా ఈ చౌరస్తాను నాలుగువైపులా తీర్చిదిద్దే క్రమంలో నిధులు విడుదల చేయించారు. అయితే శంకుస్థాపన జరిగి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఇక్కడ పనులు ప్రారంభం కాలేదు. ఫలితంగా గత కొంత కాలంగా కురుస్తున్న వర్షాలతో ఈ చౌరస్తా గుంతలమయం అయింది. దీనికి తోడు సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకవుతుండంతో ఈ మురుగు అంతా గుంతల్లో నిండిపోయింది. దీంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శంకుస్థాపన జరిగి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం పట్ల జీహెచ్‌ఎంసీ ఇంజనీర్ల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు గతంలో చేసిన బిల్లులు రాకపోవడంతో చేతిలో డబ్బులు లేక ఈ పనులకు ఇంకా ముందుకు రాలేదని తెలుస్తున్నది. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్లనే అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించి ఉంటే పనులు నిరాటంకంగా ముందుకు సాగి ఉండేవని స్థానికులు పేర్కొంటున్నారు.

మెగా రక్తదాన శిబిరం




ఖైరతాబాద్: ఐఐఎంసీ కళాశాల, ఎన్ఎస్ఎస్, వాసవి క్లబ్ సంయుక్తంగా బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డాక్టర్లు శశిధర్, దీపక్ నేతృత్వంలో కళాశాల విద్యార్థులు, కుటుంబ సభ్యుల నుంచి 83 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఇప్పటివరకు 51 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదాన ప్రాధాన్యతను గుర్తించి ఆపదలో ఉన్న వారికి ఆదుకునేందుకే మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ ఉప్పల వరకుమార్ గుప్తా, సభ్యులతో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సత్యనారాయణ, రామకృష్ణ, ప్రాజెక్ట్ చైర్మన్ కె.ప్రవీణ్‌కుమార్, జగదీశ్వర్, వలంటీర్లు పాల్గొన్నారు.

15న లక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చన

బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో ప్రతి నెలలో మూడో శుక్రవారం జరిగే లక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన సెప్టెంబర్ 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి టీటీడీ హిమాయత్‌నగర్ బాలాజీ భవన్‌లో జరుగుతుందని ఆలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. భక్తులు ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

క్లుప్తంగా...

ఇరిగేషన్ ఏఈఈల పదోన్నతులకు హైకోర్టు ఓకే



సాక్షి, హైదరాబాద్: ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో 11 ఏళ్ల సర్వీసున్న అసిస్టెంట్ ఇంజనీర్ల పదోన్నతికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారంతా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతికి అర్హులేనని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జారీ చేసిన జీవో నంబర్ 112 సమర్థనీయమేనని స్పష్టం చేసింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. నిబంధనలు సవరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని తేల్చిచెప్పింది. 2022, మార్చి 26న రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 112ను సవాల్ చేస్తూ నల్లగొండ మిర్యాలగూడకు చెందిన శ్రీనివాస్ నాయక్ సహా కొందరు ఏఈఈలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ జీవో తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ సర్వీస్ రూల్స్ 2018కి విరుద్ధమన్నారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం తుది ఉత్తర్వులు వెలువరించింది. ఏఈల ఇంప్లీడ్ పిటిషన్ వేసిన న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. ఏఈలకు కూడా పదోన్నతులు ఇవ్వవచ్చని గతంలో ఇదే హైకోర్టులోని డివిజన్ బెంచ్ ఉత్తర్వు లు జారీ చేసిందని చెప్పారు. వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ప్రభుత్వ జీవోను సమర్థించింది. జీవోకు వ్య తిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది.

'రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్లూ బదిలీకి అర్హులే'

సాక్షి, హైదరాబాద్: రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్లు కూడా బదిలీలకు అర్హులేనని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే రెండేళ్ల కంటే ఎక్కువ సర్వీసున్న వారి బదిలీలు పూర్తయిన తర్వాత, మిగిలిన ఖాళీలకే తక్కువ సర్వీసున్న వారి దరఖాస్తులు పరిశీలించి, బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. టీచర్ల బదిలీల కోసం ప్రభుత్వం జనవరి 25న జారీ చేసిన జీఓ నంబర్ 5, ఫిబ్రవరి 7న జారీ చేసిన జీఓ నంబర్ 9లో తమకు అవకాశం ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ పెద్దపల్లి జిల్లాకు చెందిన సొదమల్ల స్రవంతితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండేళ్ల సర్వీస్ పూర్తి కాలేదన్న కారణంగా తమను పరస్పర బదిలీకి కూడా అనుమతించకపోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్ల బదిలీలకూ అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

రేపు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభం

- ఒకేసారి అందుబాటులోకి 9 వైద్య కాలేజీలు!
- సీఎం చేతుల మీదుగా ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయి. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శుక్రవారం వాటిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామల్లో కొత్తగా ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర సొంత నిధులతో ఒకే ఏడాది ఇంత పెద్దసంఖ్యలో మెడికల్ కాలేజీలు ప్రారంభించడం దేశంలోనే ఇదే ప్రథమంగా చెబుతున్నారు.

కేసీఆర్ హయాంలోనే 21 మెడికల్ కళాశాలలు

తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, సీఎం కేసీఆర్ దశాబ్ద కాలంలోనే 21 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని వైద్య ఆరోగ్యశాఖ చెబుతోంది. కాగా, వచ్చే ఏడాది ప్రారంభించేందుకు మంజూరు చేసుకున్న 8 మెడికల్ కాలేజీలతో ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు పూర్తవుతుందని అధికారులు అంటున్నారు. 2014లో 5 మెడికల్ కాలేజీల ద్వారా 850 సీట్లు ఉంటే, 2023 నాటికి 26 మెడికల్ కాలేజీలతో సీట్ల సంఖ్య 3,690కి చేరింది. ప్రభుత్వ ప్రైవేటులో కలిపి ఏటా పది వేల మంది విద్యార్థులను తయారు చేసే స్థాయికి నేడు తెలంగాణ ఎదిగింది.

చట్టంలో మార్పులతో విస్తృత అవకాశాలు

2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్ కు ప్రభుత్వం సవరణ చేసిన సంగతి తెలిసిందే. గతంలో 85శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్ రిజర్వుడుగా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. తాజా నిర్ణయం వల్ల మన విద్యార్థులకు మరో 520 సీట్లు దక్కాయి. దీంతో పాటు ఎంబీబీఎస్ బీ కేటగిరి సీట్లలో 85 శాతం తెలంగాణ విద్యార్థులకే చెందేలా లోకల్ రిజర్వ్ చేసుకోవడం వల్ల రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మరో 1,300 ఎంబీబీఎస్ సీట్లు దక్కాయి. ఈ రెండు నిర్ణయాల వల్ల తెలంగాణ విద్యార్థులకు అదనంగా మొత్తం 1,820 సీట్లు ప్రతి ఏటా దక్కనున్నాయి.

సంపద పెరగాలంటే పరిశ్రమలు రావాలి

- మంత్రి కేటీఆర్
- సంగారెడ్డి జిల్లాలో మొనిన్ పరిశ్రమకు శంకుస్థాపన



మొనిన్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు సహకరించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. రాజకీయాలు ఎన్నికలు వచ్చినప్పుడు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, సంపద పెరగాలన్నా కొత్త పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు పెడితే స్థానికులకు నష్టం జరుగుతుందని కొందరు రాజకీయం కోసం వదంతులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అపోహలకు గురికాకుండా స్థానిక నాయకులు పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్రాన్స్‌కు చెందిన ప్రీమియం సిరప్ తయారీ కంపెనీ మొనిన్ రూ.300 కోట్ల పెట్టుబడితో సంగారెడ్డి జిల్లా గుంతపల్లిలో నిర్మించతలపెట్టిన ఫ్యాక్టరీకి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ప్రగతిశీల విధానాలను చూసి వివిధ దేశాలకు చెందిన కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మొనిన్ కంపెనీ యాజమాన్యం దేశంలో 18 రాష్ట్రాల్లో తిరిగిందని, చివరకు తెలంగాణలో యూనిట్‌ను స్థాపిస్తోందని చెప్పారు. స్థానిక యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఈ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు.

ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానం..

రాష్ట్రం వ్యవసాయ రంగంలో గణనీయ వృద్ధిని సాధించిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 68 వేల మెట్రిక్ టన్నుల నుంచి మూడున్నర లక్షల టన్నులకు చేరి దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పారిశ్రామిక రంగం కూడా అభివృద్ధి బాటలో కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, మొనిన్ సంస్థ చైర్మన్ ఒలివర్ మొనిన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే ఇక ఉపేక్షించం

మరింత బలోపేతంగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు: డీఎంఈ రమేశ్ రెడ్డి

గాంధీఆస్పత్రి: రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని, ఆయా కళాశాలలకు చెందిన యాంటీ ర్యాగింగ్ కమిటీలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూ పొందించి అమలు చేస్తామని మెడికల్ ఎడ్యు కేషన్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడిన పదిమంది వైద్యవిద్యార్థులను ఏడాది పాటు సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ పలువురు వైద్యవిద్యార్థు లు గురువారం గాంధీ కళాశాల ప్రాంగణంలో నిర సన చేపట్టారు. ఈ క్రమంలో డీఎంఈ, గాంధీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమో హన్, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తదిత రులు పలువురు వైద్యవిద్యార్థులతో మాట్లా డారు. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఆ పదిమంది సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు నిర్ధా రణ అయిందనీ, చర్యల విషయంలో పునరాలోచన లేదని స్పష్టం చేశారు.

అడిషనల్ డీజీ శిఖాగోయల్ ఆరా

ర్యాగింగ్ ఘటనపై తెలంగాణ అడి షనల్ డైరెక్టర్ జనరల్, ఉమెన్ సేఫ్టీ వింగ్, యాంటీ ర్యాగింగ్ కమిటీ అధికారి శిఖాగోయల్ ఆరా తీశారు. డీఎంఈ, గాంధీ ప్రిన్సి పాల్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించినట్లు తెలి సింది. సస్పెన్షన్‌తో ఏడాది వైద్యవిద్యను మాత్రమే కోల్పోతారని, కేసులు పెడితే విద్యార్థులు జీవితాలు నష్టపోవడంతో పాటు వారి కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతాయనే ఉద్దేశంతో సస్పెన్షన్‌తో సరిపెట్టామని డీఎంఈ రమేశ్‌రెడ్డి వివరించినట్లు సమాచారం.

'బీసీ మహిళలకు ప్రాధాన్యత లేకుంటే బిల్లుతో ఉపయోగం లేదు'



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోందని, ఈ బిల్లులో బీసీ మహిళలకు ప్రాధాన్యత లేకుంటే బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగినట్లేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ మహిళలకు ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లుతో బీసీలకు ఉపయోగం లేదని, అందుకే మహిళా బిల్లును బీసీలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

టెట్ పరీక్షా కేంద్రాలున్న విద్యా సంస్థలకు ఒకటిన్నర రోజుల సెలవు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఈనెల 15న జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలుగా ఎంపికైన విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఒకటిన్నర రోజుల పాటు సెలవు ప్రకటించింది. ఆ విద్యా సంస్థల్లో టెట్ పరీక్షల ఏర్పాట్ల కోసం ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం సగం పూట, పరీక్ష రోజైన 15వ తేదీ ఉదయం, మధ్యాహ్నం ఈ కేంద్రాలకు సెలవు ఇస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ పరీక్షా కేంద్రాలున్నాయి. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ఈ పరీక్షలు ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు ఎన్నికలు ముంచుకొస్తుండడంతో పరీక్షలు ఇంకెప్పుడు జరుగుతాయనే అయోమయానికి గురవుతున్నారు.

సన్నద్ధతకు సంకటం

ఏదైనా పరీక్ష తేదీని ప్రకటిస్తే అభ్యర్థులు సన్నద్ధతకు ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు. ప్రభుత్వ శాఖల్లో వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పూనుకోవడం, తదనుగుణంగా నోటిఫికేషన్లు ఇవ్వడంతో నిరుద్యోగ అభ్యర్థులు కఠోర దీక్షతో ప్రిపరేషన్‌లో పడ్డారు. కొందరు ప్రైవేటు ఉద్యోగాలను వదిలేసి మరీ సిద్ధమవుతున్నారు. మరికొందరైతే పనిచేస్తున్న ఉద్యోగాలకు దీర్ఘకాలిక సెలవులు పెట్టుకుని టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల తేదీలను ప్రకటించకుండా కమిషన్ కాలయాపన చేస్తుండటంతో సన్నద్ధత గాడి తప్పుతోందని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ నెలంతా ప్రభుత్వ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాలకు అర్హత పరీక్షలు కొనసాగుతుండగా.. వచ్చే నెలలో సైతం పలు పరీక్షలకు కమిషన్ తేదీలు ఖరారు చేసింది. ఆగస్టు నెలలో నిర్వహించాల్సిన గ్రూప్-2 పరీక్ష నవంబర్ నెలకు వాయిదా పడింది. ఈ విధంగా పలు పరీక్షల తేదీలు ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ, గ్రూప్-3 పరీక్షలపై తేల్చక పోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

హైదరాబాద్‌లో ఇన్‌స్పైర్ బ్రాండ్స్ ఇన్నోవేషన్ సెంటర్

కేటీఆర్‌తో భేటీ సందర్భంగా కంపెనీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా మల్టీబ్రాండ్ రెస్టారెంట్ కంపెనీగా పేరొందిన 'ఇన్‌స్పైర్ బ్రాండ్స్' హైదరాబాద్‌లో ఆవిష్కరణల కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో బుధవారం భేటీ అయిన కంపెనీ సహ వ్యవస్థాపకులు, సీఈఓ పాల్ బ్రౌన్ ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 32 వేల రెస్టారెంట్లను కలిగిన ఇన్‌స్పైర్‌కు హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న ఆవిష్కరణల కేంద్రం ఆరవదిగా కానుంది. హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న ఆవిష్కరణల కేంద్రం గత ఆరు నెలల్లో వంద మందికి ఉద్యోగాలు కల్పించగా, వచ్చే ఆరు నెలల్లో మరో వంద మందిని చేర్చుకోనుంది. 2025 నాటికి హైదరాబాద్‌లో మరో 500 మందిని చేర్చుకుంటుందని పాల్ బ్రౌన్ ప్రకటించారు. ఈ ఆవిష్కరణల కేంద్రం ద్వారా డేటాసైన్స్, అనలిటిక్స్, ఈ కామర్స్, ఆటోమేషన్, క్లౌడ్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ వంటి రంగాల్లో పనిచేసే సంస్థల భాగస్వామ్యంతో ఆవిష్కరణల కోసం పనిచేస్తుంది. ఆవిష్కరణల కేంద్రంలో ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ ల్యాబ్ ద్వారా మానవ వనరుల నిర్వహణ, చెల్లింపు విధానాలు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు తదితరాల కోసం స్థానిక స్టార్టప్‌లతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంటుంది.

17 నుంచి 'ఆయుష్మాన్ భవ'

అక్టోబర్ 2 వరకు ఆరోగ్య మేళాలు, ఇతర సేవలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ పేరుతో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర పథకానికి సంబంధించి రాష్ట్రంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా పల్లె, బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో ఈ నెల 20, 27 తేదీల్లో ఆరోగ్య మేళాలు నిర్వహిస్తారు. రక్తపోటు, మధుమేహం, మూడు సాధారణ క్యాన్సర్లు అంటే ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. టీబీ, లెప్రసీ వంటి పరీక్షలు చేస్తారు. లైఫ్‌స్టయిల్ వంటి కార్యక్రమాలు చేపడతారు. ఉచిత మందులు ఇస్తారు. ఉచిత డయాగ్నస్టిక్స్ అందుబాటులో ఉంటాయి. టెలీకన్సల్టేషన్ సేవలు కల్పిస్తారు. అక్టోబర్ 2న రక్తదాన శిబిరాన్ని నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల సమన్వయంతో ప్రతి జిల్లాలో ఒక శిబిరాన్ని నిర్వహిస్తారు.

నగర వార్తలు

జేఎన్‌టీయూలో సమ్మె సైరన్

బాలానగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1445 మంది, జేఎన్‌టియుహెచ్ యూనివర్సిటీలో పనిచేస్తున్న 224 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలనే ప్రధానమైన డిమాండ్‌తో 7వ రోజు జేఎన్‌టియుహెచ్ హెడ్ క్వార్టర్స్, అనుబంధ కళాశాలల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్పందన బిల్డింగ్ నుంచి ర్యాలీగా బయలుదేరి క్యాంటీన్ మీదుగా ఇసిఇ బ్లాక్ వద్ద బైఠాయించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. టీ–అక్టా కన్వీనర్ రాజేష్ ఖన్నా, జేఎన్‌టియుహెచ్ ఏపి (సి) అధ్యక్షుడు డా. శ్రీనివాస్‌రెడ్డి, ఫ్యాకల్టీ గఫార్ మాట్లాడుతూ యూనివర్సిటీ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ అనేది కొత్తది కాదన్నారు. ఓయు దశాబ్ది ఉత్సవాలకు వచ్చిన ముఖ్యమంత్రి త్వరలో విద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులను త్వరలో రెగ్యులరైజ్ చేస్తామని అందుకు సంబంధించిన ప్రక్రియను అప్పటి చీఫ్ సెక్రటరి సోమేష్ కుమార్‌కు తెలిపారన్నారు. ఉన్నత విద్యా మండలి అధికారులు ప్రభుత్వానికి మా రెగ్యులరైజేషన్ అంశం మీద ఏ విధంగా ముందుకు పోవాలో, ఎలా చేయవచ్చో చెప్పకుండా కాలయాపన చేస్తూ, ఎలా చేయకూడదు అనే ఒక నెగటివ్ ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అక్షిత్ శర్మ, సింధు, సంధ్య, రవికుమార్, యాదగిరి, రాజు, రాజేష్, అశోక్, నరేందర్, దేవేందర్, రంజిత్, నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన బహుభాషా నాటకోత్సవాలు



గన్‌ఫౌండ్రీ: వివిధ రాష్ట్రాల సంస్కృతులను తెలియజేసే విధంగా జాతీయస్థాయి బహుభాషా నాటకోత్సవాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమిల సౌజన్యంతో అభినయ థియేటర్ ట్రస్టు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా రవీంద్రభారతిలో జరుగుతున్న అభినయ నేషనల్ థియేటర్స్ ఫెస్టివల్ బుధవారం ముగిసింది. ప్రస్తుత సమాజంలో నాటకరంగం యొక్క ప్రాముఖ్యతను పరిచయం చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఎ.శ్రీనివాస్ కుమార్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ 'గాంధీ'

- నేడు గాంధీ మెడికల్ కాలేజీ 69వ వ్యవస్థాపక దినోత్సవం



గాంధీ మెడికల్ కళాశాల

గాంధీ ఆస్పత్రి : నిష్ణాతులైన వైద్యులను తయారు చేయడంలో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాల నేటికి అరవై తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకుంది. పీపుల్స్ మెడికల్ కాలేజీగా ఆవిర్భవించి, గాంధీ మెడికల్ కళాశాలగా పేరుమార్చుకుని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. రుగ్మతలు, రోగాలనుంచి ప్రజలను విముక్తం చేసేందుకు దేశంలోని నలుమూలలతోపాటు ఇతర దేశాలలోను వైద్యసేవలను అందిస్తున్న వేలాది మంది నిష్ణాతులైన వైద్యులు మొదటిసారిగా సెత్‌స్కోప్ పట్టుకుని వైద్యభాషలో ఓనమాలు దిద్దిడంతో ఈ కళాశాలను వైద్యులను తయారు చేసే కర్మాగారంగా అభివర్ణిస్తారు. ప్రజల సేవ కోసం పీపుల్స్ కాలేజీగా ఆవిర్భవించి, దేశ ప్రజల బానిస సంకెళ్లను తెంచిన మహాత్మాగాంధీ పేరుతో కొనసాగుతూ వైద్యవజ్రాలను దేశానికి అందిసున్న సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ వైద్యులు లక్షలాది మంది నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆవిర్భావం..

నగర ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో 1954 సెప్టెంబర్ 14వ తేదిన ׳అన్వర్ ఉలామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ׳ ఆధ్వర్యంలో 40మంది విద్యార్థులతో పీపుల్స్ మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. వైద్యవిద్య అవసరాలు తీర్చేందుకు అప్పటికే ఉన్న ఉస్మానియా వైద్య కళాశాల చాలనందున సరోజినీదేవి కంటి ఆస్పత్రి సమీపంలోని హుమాయూన్‌నగర్‌లో పీపుల్స్ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. మొట్టమొదటి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సయ్యద్ నిజాముద్దీన్ అహ్మద్ విధులు నిర్వహించారు. అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ 1955 జూన్ 25వ కాలేజీ భవనాన్ని ప్రారంభించారు. 1956లో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొవడంతో ప్రైవేటు యాజమాన్యం నుంచి కళాశాలను హైదరాబాద్ ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకుంది. నిర్వహణ బాధ్యతలను ప్రిన్సిపాల్ నిజాముద్దీన్ అహ్మద్‌తోపాటు రిటైర్డ్ మెడికల్ డైరెక్టర్ కల్నల్ కేవీ వాఘ్రేకు అప్పగించారు. 1958 జూలైలో బషీర్‌బాగ్‌కు తరలించి గాంధీ మెడికల్ కాలేజీగా పేరుమార్చారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డీవీ సుబ్బారెడ్డిని గాంధీ మెడికల్ కాలేజీ పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా నియమించారు. 2003లో ముషీరాబాద్‌కు తరలించారు. 1950–60 మధ్యకాలంలో కళాశాలను గాంధీ ఆస్పత్రికి అనుసంధానించారు.

27 విభాగాలు.. సూపర్ స్పెషాలిటీ కోర్సులు...

అనాటమీ, ఫిజియాలజీ,, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్ మెడిసిన్, మైక్రోబయాలజీ, పైథాలజీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ వంటి 27 విభాగాలలో వైద్యవిద్యను అందిస్తున్న గాంధీ మెడికల్ కాలేజీలో 1970 దశకం నుంచి కార్డియాలజీ, కార్డియో థొరాసిస్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, డెర్మటాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, హస్పిటల్ మేనేజ్‌మెంట్ వంటి సూపర్‌స్పెషాలిటీ కోర్సులు, ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, డీఎం వంటి వాటితోపాటు నర్సింగ్, పారామెడికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఎంబీబీఎస్‌లో 250, పోస్టుగాడ్యుయేట్ (పీజీ) 213 సీట్లు ఉండగా , వైద్యరంగంలోని వివిధ విభాగాలకు చెందిన 37 డిగ్రీలను ఇక్కడ బోధిస్తారు.

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పోస్టులను పునరుద్ధరించాలి

సుల్తాన్‌బజార్ : తెలంగాణ ప్రభుత్వం జీఓ నెంబర్ 142 ను రద్దు చేస్తూ డిప్యూటీ డీఎంహెచ్‌ఓల పోస్టులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో హలో డాక్టర్ చలో డీహెచ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద వైద్యులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘం ప్రతినిధుల బృందం జీఓ 142 ప్రతులను దగ్ధం చేశారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ గడాల శ్రీనివాసరావుతో చర్చలు జరిపారు. సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్‌లు మాట్లాడుతూ.... ప్రభుత్వ వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేయాలని కోరారు. డీహెచ్ పరిధిలో పనిచేసే వైద్యులకు టైం బాండ్ ప్రమోషన్లు కల్పించాలని, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించిన 33 డీఎంహెచ్‌ఓ పోస్టులకు జనరల్ లైన్ సీనియార్టీని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని కోరారు. జీఓ నెంబర్ 142 ద్వారా ఏడీపీహెచ్‌ఓ లకు దొడ్డిదారిన కేటాయించిన 10 జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పోస్టుల ఉత్తర్వును వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక కేంద్రాలలో మూడు షిఫ్టులకు అనుగుణంగా వైద్యుల సంఖ్య పెంచాలని వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్లు నరహరి, కళ్యాణ్ చక్రవర్తి, వినోద్, శ్రీనివాస్, రంగా అజ్మీర, శేఖర్, దీన్‌దయాల్, సిద్దిక్, వెంకటమణి, అన్నపూర్ణ, రాజశ్రీ, మురళి, భూపేందర్, యాకూబ్ బాషా, భూపాల్‌తో పాటు పెద్ద ఎత్తున వైద్యులు పాల్గొన్నారు.



కోఠి డీహెచ్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వ వైద్యులు

సునామీ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌పై వర్క్‌షాప్

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ఇంకాయిస్, నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ)ల సంయుక్త బుధవారం సునామీ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌పై రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ ప్రారంభించారు.ఈ వర్క్‌షాప్‌కు జాతీయ, రాష్ట్రస్థాయికి చెందిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, కోస్ట్ గార్డ్, ఫిషరీఫ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌లకు చెందిన 60 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌ను లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హజనైన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

నూతన ట్రస్ట్ బోర్డును ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న రంగాచారి

పంజగుట్ట: చాలా సంవత్సరాలుగా కొనసాగుతున్న విశ్వకర్మ బాయిస్ హాస్టల్ ట్రస్ట్‌ను రద్దుచేసి, వెంటనే జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేసి నూతన ట్రస్ట్‌ను ఏర్పాటు చేయ్యాలని రాష్ట్ర విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ జేఏసీ డిమాండ్ చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ సలహాదారు పి.రంగాచారి, హాస్టల్ స్థలం దాత మనవరాలు శివకోటి విజయలక్ష్మి, జేఏసీ ప్రతినిధి లక్ష్మణ్ మాట్లాడుతూ..అప్పటి దాత నిజాంకు వైద్యునిగా పనిచేసిన రామకృష్ణయ్య మాట్లాడారు. చాలా ఏళ్లుగా హాస్టల్ ట్రస్ట్ బోర్డు పెట్టుకున్న కొంతమందే సభ్యులుగా ఉంటున్నారని, ట్రస్ట్ సభ్యులు, బోర్డు అంటే కుల సంఘాల ప్రజల నుంచి ఎన్నుకోవాలి కాని వారికి వారే బోర్డుగా సభ్యులుగా చలామణి అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2008 నుంచి 2023 వరకు దాతలు ఇచ్చిన సొమ్ము, ప్రతి సంవత్సరం ఎంత ఆదాయం వస్తుంది, ఎంత ఖర్చు అవుతుందో లెక్కలు చూపించకపోగా కేవలం రెండు సంవత్సరాలు మూసి ఉండగానే కోటి రూపాయలు అప్పు ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రస్ట్ బోర్డు అంటే ఐదు సంవత్సరాల కాలపరిమితి ఉంటుందని కాని మొదటినుంచి వీరే రాజ్యమేలుతున్నారన్నారు.

హార్డ్‌వేర్ పార్క్ ఇండస్ట్రియల్ భూములను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

పంజగుట్ట: హార్డ్‌వేర్ పార్క్ పరిధిలో ఉన్న భూములను ఇండస్ట్రియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు మార్చాలని అఖిలపక్ష నాయకులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ, తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని నాదర్‌గుల్, ఆదిభట్ల, ఎంఎం కుంట గ్రామాల్లోని ఎక్స్‌టెన్షన్ హార్డ్‌వేర్ పార్క్ తొలగించాలని అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోదండరెడ్డి, అద్దంకి దయాకర్, బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, న్యూడెమోక్రసీ నాయకులు గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన మంత్రులు పేదల భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. హార్డ్‌వేర్ పార్క్ కోసం 2004లో 1500 ఎకరాలు నివాస స్థలాలు, 1500 ఎకరాలు వ్యవసాయ భూములు, ప్రైవేట్ భూములు ఎంపిక చేసి ఇండస్ట్రియల్ జోన్‌కింద నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. కనీసం నోటీసులు ఇవ్వలేదు, నష్టపరిహారం ఇవ్వకుండా నిషేధిత జాబితాలో చేర్చడంతో భూమిపై తామే ఉన్నప్పటికీ నిషేధిత జాబితాలో ఉండడంవల్ల అమ్ముకునేందుకు, కొనేందుకు అవకాశం లేకుండా పోయిందని, ఆ ప్రాంతంలో అభివృద్ధి జరగడంలేదని, ఇల్లు కట్టుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని ఆగ్రహంవ్యక్తం చేశారు. వెంటనే ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూములను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలని, తమ భూములు ధరణిలో చేర్చి, రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ చైర్మన్ రామేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కన్వీనర్ దార సత్యం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పాల్గొన్నారు.

గురువులకు సత్కారం



అవార్డు గ్రహీతలతో వకుళాభరణం కృష్ణ మోహన్, కె.సుందర్

నాంపల్లి: జగతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో గురువందనం శీర్షికన ఉపాధ్యాయులకు సత్కారం చేశారు. జగతి ఆర్ట్స్ కార్యదర్శి ఆర్.శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా బీసీ కమీషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ హాజరై గురువులకు ఉపాధ్యాయ రత్న అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత జయరాజు, సాహితీవేత్తలు గుడిబండ వెంకట్‌రెడ్డి, మిమిక్రీ ఆర్టిస్ట్ సుబ్రహ్మణ్యం, ఫార్చు లా మేనేజింగ్ డైరెక్టర్ కె.సుందర్ పాల్గొన్నారు.

హైకోర్టు హితవు

అమ్మ చేతి బువ్వ పిల్లల హక్కు

'స్విగ్గీ, జొమాటోల ఫుడ్డు తెప్పించి చేతులు దులుపుకోవద్దు. పిల్లల్ని అమ్మ చేతి రుచికరమైన వంట తిననివ్వండి' అని కేరళ హైకోర్టు హితవు పలికింది. ఒక మొబైల్ ఫోన్ కేసులో బుధవారం తీర్పు వెలువరిస్తూ 'సాయంత్రం ఆడుకుని వచ్చిన పిల్లలు ఇంట్లో వంట ఘుమఘుమలకు ఉత్సాహపడాలి. అన్నం అడగాలి. అలాంటి స్థితి నేడు ఉన్నదా?' అని ప్రశ్నించింది. పిల్లల పెంపకంలో ఎన్నెన్నో మార్పులు వచ్చాయి.కాని, పిల్లల ఆటలు, ఆహారం విషయంలో కేరళ హైకోర్టు హెచ్చరికలు చాలా ముఖ్యమైనవి.



'మైనర్ పిల్లల చేతికి తల్లిదండ్రులు సెల్ఫోన్లు ఇచ్చి వారిని సంతోషపెట్టవద్దు. పిల్లల చేతికి ఫోన్లు ఇచ్చి వారు ఏం చూస్తున్నారో పట్టించుకోకుండా తల్లిదండ్రులు ఇంటి పనులో సొంత పనులో చేసుకోవద్దు. పిల్లలు సెల్ఫోన్లలో చూడకూడనివి చూస్తే వాటి దుష్ఫలితాలు సుదీర్ఘకాలం ఉంటాయి' అని కేరళ హైకోర్టు బుధవారం తల్లిదండ్రులకు హితవు చెప్పింది.

కేరళలోని అలవు ప్రాంతంలో ఒక వ్యక్తి బహిరంగ ప్రదేశంలో ఫోన్లో పోర్న్ వీడియోలు చూస్తున్నాడని పోలీసులు పెట్టిన కేసును కొట్టి వేస్తూ (ఐపిసి సెక్షన్ 292 చెల్లదని) జస్టిస్ కున్హి కృష్ణన్ తల్లిదండ్రులకు సెల్ఫోన్ల గురించి హెచ్చరించారు. 'పిల్లలు సెల్ఫోన్లలో విజ్ఞాన, వినోదానికి సంబంధించి వీడియోలు చూడాలి... అదీ తల్లిదండ్రుల సమక్షంలో. తల్లిదండ్రుల అజమాయిషీ లేకుండా వారు మొబైల్ చూడకూడదు. పిల్లలు ఆడుకునే సమయాల్లో ఆడుకోవాలి. వారిని ఫుట్బాల్లో, క్రికెట్లో ఆడేలా చేయండి. శారీరకంగా దృఢంగా ఎదిగేలా చేసి దేశ భవిష్యత్తు కోసం ఆశ పెట్టుకునేలా తీర్చిదిద్దండి' అని కున్హి కృష్ణన్ అన్నారు.

తల్లి చేసేదే రుచికరం

అదే సమయంలో పిల్లల ఆహారం గురించి ఇటీవల వచ్చిన మార్పును కూడా జస్టిస్ వ్యాఖ్యానించారు. 'పిల్లలకు స్విగ్గి, జొమాటోల నుంచి ఆహారం తెప్పించి ఇస్తున్నారు. కాని పిల్లలు తల్లి చేసిన రుచికరమైన తిండినే తినాలి. పిల్లలు సాయంత్రం ఆడుకోవడానికి వెళ్లి ఇంట్లో వంట ఘుమఘుమలు మొదలయ్యే సమయానికి చేరుకుని అన్నం కోసం ఎదురు చూడాలి. అలా జరిగితే ఎంత బాగుంటుంది? మేం చెప్పాల్సింది చెప్పాం. ఇక తల్లిదండ్రుల విచక్షణ' అని కున్హి కృష్ణన్ అన్నారు.

మేధో ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం

కేరళ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు స్థూలంగా నేటి పిల్లల పెంపకాన్ని వ్యాఖ్యానిస్తున్నాయి. పరిశీలించి చూస్తే అవి పిల్లల మేధో, భౌతిక ఆరోగ్యం గురించి హెచ్చరిక చేస్తున్నాయి. ఇవాళ రేపు స్కూళ్లు, తల్లిదండ్రులు పిల్లల శారీరక వ్యాయామానికి వీలు ఇవ్వడం లేదు. ఆటలాడమని ప్రోత్సహించడం లేదు. ఆడుకునే వీలు కూడా కల్పించడం లేదు. దాంతో పిల్లలు కదలికలు మందగించి బద్ధకం, స్థూలకాయం వంటి సమస్యలతో బాధ పడుతున్నారు. మరోవైపు ఆ సమయాన్ని సెల్ఫోన్లలో అనవసరమైన విషయాలు చూస్తూ బుర్ర పాడుచేసుకుంటున్నారు. పిల్లర్లు పెడితే తప్ప సెల్ఫోన్లలో పోర్నోగ్రఫీ, వయొలెంట్ వీడియోలు మీట దూరంలో ఉంటాయి. తెలిసీ తెలియని వయసులో వాటిని గంటల కొద్దీ చూస్తే తీవ్ర మానసిక ప్రభావాలకు లోనవుతారు. జరగవలసిన నష్టం జరిగే వరకు తల్లిదండ్రులకు విషయం తెలియడం లేదు. ఇంకోవైపు వంటకు సమయం లేకనో లేదా పిల్లలు అడుగుతున్నారనో చీటికి మాటికి స్విగ్గీలో టిఫిన్లు, భోజనాలు తెప్పించే తల్లిదండ్రులు పెరిగారు. హోటల్ తిండి పిల్లలకు ఏ మాత్రం మంచిది కాదు. ఒకప్పుడు ఎప్పుడో తప్ప బయటి తిండి తిననివారు ఇవాళ ప్రతి రెండో రోజు ఏదో ఒకటి తెప్పిస్తున్నారు. తల్లి చేసే ఒకటి రెండు కూరలైనా ఎంతో శుచిగా, రుచిగా ఉంటాయి. వంట పని భారం కాకుండా భర్త, పిల్లలు సాయం చేస్తే శుభ్రమైన ఇంటి భోజనం చేయవచ్చు. కలిసి కూచుని భోంచేయడం ద్వారా కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం పెరుగుతుంది కూడా.

కాబట్టి అప్రమత్తంగా ఉండాలి. పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

కొత్త దారి

రైతుబిడ్డ

● ఎవర్ గ్రీన్ ఎనర్జీ





మహిళా రైతులతో షర్మిల జైన్

'ఇక వ్యవసాయం చేయవద్దు అనుకుంటాను. కాని చేయక తప్పేది కాదు. దీని వల్ల తలపై అప్పులు తప్ప నాకు జరిగిన మేలు లేదు. అయినా సరే భూమి నాకు అమ్మతో సమానం' అన్నాడు మహారాష్ట్రలోని ఒక రైతు.

'లాభనష్టాల సంగతి పక్కన పెడితే, ఒక్క రోజు పొలం వైపు వెళ్లక పోయినా నాకు ఏదో కోల్పోయినట్లుగా ఉంటుంది' అంటాడు రాజస్థాన్లోని ఒక రైతు. మన దేశంలో రైతుకు, భూమికి మధ్య ఆత్మీయ బంధం ఉంది. ఆ బంధాన్ని బలోపేతం చేయడానికి కెనడా నుంచి వచ్చిన షర్మిల జైన్ తన లక్ష్యసాధనలో విజయం సాధించింది...

రైతుల ఆత్మహత్యలతో వ్యవసాయరంగం కల్లోలంగా ఉన్న కాలం అది. ఆ సమయంలో షర్మిలజైన్ కెనడాలో నివాసం ఉంది. స్వదేశంలో రైతుల ఆత్మహత్యల గురించి చదివిన తరువాత ఆమె మనసు మనసులో లేదు. ఎన్నో ఆలోచనలు తనను చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేశాయి.

'ఈ సమస్యకు పరిష్కారం లేదా?' అని ఆమె ఆలోచించింది.

ఆ సమయానికి కదిలిపోయి మరో రోజుకు మామూలై పోయే వ్యక్తి కాదు షర్మిల. కనిపించే సమస్య వెనకాల కనిపించని సమస్యలను అధ్యయనం చేయడానికి రంగంలోకి దిగింది. అంతే కాదు, రైతుల కోసం కెనడాను వదిలి స్వదేశానికి తిరిగి రావాలని నిర్ణయించుకుంది. 'నువ్వు ఎలాంటి నిర్ణయం తీసుకున్నావో తెలుసా? భావోద్వేగాలపై తీసుకునే నిర్ణయాలు బెడిసికొడతాయి. తీరిగ్గా ఆలోచించు. వెళ్లడం సులభమేకాని ఇక్కడికి మళ్లీ రావడం అంత సులభమేమీ కాదు' అన్నారు సన్నిహితులు.

బాగా ఆలోచించే నిర్ణయం తీసుకున్నానని చెప్పింది షర్మిల.

మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగిన షర్మిలకు రైతుజీవితం కొత్తేమీ కాదు. వారికి సంబంధించి తాను చిన్నప్పుడు విన్న సమస్యలే ఇప్పుడు కూడా వినాల్సి వస్తుంది.

మరాఠీ మీడియం స్కూల్లో చదువుకున్న షర్మిల స్నేహితులలో చాలామంది రైతు బిడ్డలే. ఆ కుటుంబాల ఆర్థిక కష్టాలతోపాటు గృహహింసకు సంబంధించిన విషయాలను తరచుగా వినేది. ఆ సమయంలోనే లాయర్ కావాలని అనుకుంది.

కెనడా నుంచి భారత్కు తిరిగి వచ్చిన షర్మిల క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను అర్థం చేసుకోవడానికి మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్లలోని ఎన్నో పల్లెలు తిరిగింది. ఇంటింటికి వెళ్లి రైతులతో మాట్లాడింది. వారితోపాటు పొలానికి వెళ్లింది.

'ఇలా ఎవరో ఒకరు వచ్చి ఏదో ఒకటి రాసుకోవడం, తరువాత కనిపించకపోవడం మామూలే. అయితే షర్మిలజీ కళ్లలో నిజాయితీ కనిపించింది. ఆమె మా కోసం ఏదో చేయగలదు అనే ఆశ కలిగింది' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటాడు చౌహాన్ అనే రైతు.

వ్యవసాయ సంబంధిత అంశాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి... ఇంగ్లాండ్లో ఎన్విరాన్మెంటల్ లా, అగ్రికల్చరల్ లా లో మాస్టర్స్ చేసింది షర్మిల. రెండు సంవత్సరాల కాలంలో ఎంతోమంది రైతులతో, వ్యవసాయరంగ నిపుణులతో మాట్లాడిన తరువాత 'గ్రీన్ ఎనర్జీ ఫౌండేషన్' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. చెరువులను పునరుద్ధరించడం, నవీన వ్యవసాయ పద్ధతులను రైతులకు పరిచయం చేయడం, చిరుధాన్యాలు పండించడంపై అవగాహన కలిగించడం... మొదలైనవి ఈ ఫౌండేషన్ లక్ష్యాలు.



> ఎన్నో సంవత్సరాలుగా అయిదు రాష్ట్రాలలో వేలాదిమంది రైతులకు వాటర్ మేనేజ్మెంట్ ప్రోగ్రామ్స్, కెపాసిటీ-బిల్డింగ్ ప్రోగామ్స్ ద్వారా సహాయపడుతున్నాం. చిరుధాన్యాలు, కూరగాయలు పండించడంపై అవగాహన కలిగిస్తున్నాం. చిరుధాన్యాలు అనే పేరు పెద్దగా వినిపించని కాలంలోనే వాటి ప్రాముఖ్యత గురించి ప్రచారం చేశాం.
> – షర్మిల జైన్

తొలిసారిగా మహారాష్ట్రలోని బుచ్కెవాడి గ్రామంలో నాబార్డ్ గ్రాంట్తో వాటర్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం చేపట్టారు. నిరంతరం నీటిఎద్దడితో సతమతం అవుతున్న ఆ గ్రామం వాటర్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం ద్వారా బాగు పడింది. వేసవి సమయంలోనూ నీటి కష్టాలు రాని పరిస్థితి వచ్చింది.

రాజస్థాన్లోని దుంగర్పూర్ గ్రామంలోని రైతులకు నీటి అవసరం ఎక్కువగా లేని పంటల గురించి అవగాహన కలిగించారు.

'గ్రీన్ ఎనర్జీ మా ఊరిలో అడుగు పెట్టకపోతే వ్యవసాయానికి శాశ్వతంగా దూరం అయ్యేవాళ్లం. గ్రీన్ఎనర్జీ కార్యక్రమాల ద్వారా అనేక రకాలుగా లబ్ధి పొందాం. ఇప్పుడు కూరగాయలు కూడా పండిస్తున్నాం. గతంలో పంటలు పండనప్పుడు నా భర్త కూలిపనుల కోసం పట్నం వెళ్లేవాడు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు' అంటుంది దీప్తి అనే మహిళా రైతు.

షర్మిల తన తండ్రి నుంచి రెండు విలువైన మాటలు విన్నది. ఒకటి... చిరుధాన్యాల ప్రాముఖ్యత. రెండు... కార్పొరేట్ కంపెనీల సామాజిక బాధ్యత. ఇప్పుడు బాగా వినిపిస్తున్న సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఆరోజుల్లోనే విన్నది షర్మిల.

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్ల కోసం, చిరుధాన్యాలను పండించే రైతులకు సహాయపడడానికి 'గుడ్ మామ్' అనే స్టార్టప్కు శ్రీకారం చుట్టింది షర్మిల జైన్. 'గుడ్ మామ్' ద్వారా మిల్లెట్ నూడుల్స్ నుంచి హెర్బ్ స్టిక్స్ వరకు ఆన్లైన్లో విక్రయిస్తున్నారు. చిరుధాన్యాలపై ఆసక్తి వేలం వెర్రిగా మారకుండా, దాన్ని ఇతరులు సొమ్ము చేసుకోకుండా ఉండడానికి 'గుడ్ మామ్' ద్వారా 'ఏది అబద్ధం?' 'ఏది నిజం' అంటూ అవగాహన కలిగిస్తున్నారు.

బ్యూటిప్

కాంతిమంతమైన ముఖం కోసం....



టమాటాను గుండ్రంగా కట్ చేసి ఒక ముక్కను తీసుకుని దానికి పంచదార అద్దాలి. తరువాత ఈ ముక్కను ముఖంపై సున్నితంగా రుద్దాలి. పది నిమిషాల తరువాత సాధారణ నీళ్లతో కడుక్కోవాలి. తరువాత స్పూను శనగ పిండి, అర స్పూను అలోవెర జెల్, రెండు స్పూన్ల టమాటా రసం, అర స్పూను తేనె వేసి పేస్టులా కలుపుకోవాలి. ఈ పేస్టుని ముఖానికి ఫేస్ప్యాక్లా వేసుకోవాలి. ఇలా చేస్తే ముఖంపై ఉన్న మృత కణాలు, ట్యాన్ పోయి ముఖం కాంతిమంతమవుతుంది.



బీరు వ్యర్థాలతో... ఆహార పదార్థాలు

కొంతమంది ఆకలితో అలమటిస్తుంటే, మరోపక్క టన్నులకొద్దీ ఆహారం వివిధ రకాలుగా వ్యర్థాల రూపంలో మట్టిపాలవుతోంది. ఈ మధ్య కాస్త అవగాహన రావడంతో ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని ఆశ్రమాలకు దానంగా ఇస్తున్నారు. అయితే వండిన ఆహారమే కాకుండా, కొన్నిరకాల పదార్థాలు, పానీయాలు తయారయ్యాక ఎన్నో పోషకాలున్న పదార్థాలు చెత్తలోకి వెళ్లి పోతున్నాయి. వీటిని మనం చక్కగా వినియోగించుకుంటే...

బిస్కెట్లు, బ్రెడ్, రోటీలు చేసుకోవచ్చని చెబుతోంది ఎలిజబెత్ యార్క్. బీర్ తయారవగా మిగిలి పోయిన వ్యర్థాలతో చిక్కి, లడ్డు, నూడుల్స్ తయారు చేసి మరీ రుచి చూపెడుతోంది ఎలిజబెత్.



బెంగళూరుకు చెందిన ఎలిజబెత్ యార్క్ ఒక చెఫ్. మణిపాల్లో డిగ్రీ చేసిన ఎలిజబెత్ తరువాత మైసూర్లోని సెంట్రల్ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్లో రీసెర్చ్ చేసింది. అందులో భాగంగా దేశంలో ఎన్నో రకాలుగా భారీ ఎత్తున ఆహార వృథా జరుగుతోందని గ్రహించింది. ఆహారం వ్యర్థం కాకుండా ఎలా ఆపాలా... అని ఆలోచించింది. ఈ క్రమంలోనే 2016లో కాలిఫోర్నియాలోని బ్రెడ్ స్పెషలిస్ట్, ఫుడ్ హిస్టోరియన్ విలియం రెబెల్ దగ్గర ఇంటర్న్గా చేరింది. రుబెల్ ద్వారా... ''వందల ఏళ్ల నాడే పానీయాల తయారీదారు, (బ్రీవర్స్), రొట్టె, బ్రెడ్స్ తయారీదార్లు (బేకర్స్) కలిసి పనిచేసే వారని తెలిసింది. కొన్నిసార్లు ఆర్థికంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పుడు మిగిలిపోయిన బ్రెడ్ను బ్రీవర్స్, గింజలు, ఈస్ట్ను బ్రీవర్స్ బేకర్స్ ఇచ్చి పుచ్చుకునేవాళ్లు. అలా వాళ్ల పదార్థాలు వృథా కాకుండా, తక్కువ ఖర్చులో ఆహారాన్ని తయారు చేసేవారు'' అని ఎలిజబెత్ తెలుసుకుంది. భారత్లో కూడా ఇలా చేసి ఫుడ్ వేస్ట్ కాకుండా చూడవచ్చు అనుకుంది.

సేవింగ్ గ్రెయిన్స్

లాక్డౌన్ సమయంలో కాస్త ఎక్కువ సమయం దొరకడంతో ఎలిజబెత్ వ్యర్థాల నుంచి ఫుడ్ తయారు చేయాలని నిర్ణయించుకుంది. బీర్ తయారైన తరువాత పడేసే వ్యర్థాలను రుచికరమైన ఆహారంగా మార్చాలనుకుని 2021లో 'సేవింగ్ గ్రెయిన్స్' ప్రారంభించింది. బీర్ తయారవగా మిగిలిన పిప్పిని పిండిగా మార్చి, తరువాత ఆ పిండితో బ్రెడ్, రోటీలు, గ్రనోలా, కుకీస్, టీ బిస్కెట్స్, లడ్డులు, చిక్కీలు తయారు చేసి విక్రయిస్తోంది. పిప్పినుంచి తయారు చేసినవే అయినా ఇవి ఎంతో రుచిగా ఉండడం విశేషం. సేవింగ్ గ్రెయిన్స్ ఉత్పత్తులు ఆఫ్లైన్లోనేగాక, ఆన్లైన్లో కూడా లభ్యమవుతున్నాయి. స్థానిక బేకరీ భాగస్వామ్యంతో సేవింగ్ గ్రెయిన్స్ను విస్తరిస్తోంది ఎలిజబెత్.



రోజుకి పన్నెండు వేల కేజీలు..

''రకరకాలుగా ఫుడ్ వేస్ట్ అవడం చాలా బాధగా అనిపించేది. రుబెల్ను కలిసాక ఈ సమస్యకు చక్కటి పరిష్కారం దొరికింది. దాంతోనే 'సేవింగ్ గ్రెయిన్స్'ను ప్రారంభించాను. బీర్, ఆల్కహాల్ను తయారు చేసేందుకు గోధుమలు, ఓట్స్, బార్లీలను నానబెట్టి మొలకలు వచ్చిన తరువాత, చక్కెరతో ఉడికిస్తారు. తరువాత మెత్తగా రుబ్బి రసాన్ని వేరు చేసి బీర్, ఆల్కహాల్స్ను తయారు చేస్తారు. పానీయం వేరు చెయ్యగా మిగిలిన పిప్పిని పశువులకు దాణాగా వేస్తుంటారు. పశువులు తిన్నప్పటికీ, ఎక్కువ మొత్తంలో వ్యర్థంగా పోతుంది. ఒక్క బెంగళూరులోనే రోజుకి పన్నెండు వేలకేజీల ధాన్యాలను పానీయాల తయారీలో వాడుతున్నారు. రోజుకి ఇంత అంటే ఇక ఏడాదికి చాలా ఎక్కువ అవుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న బ్రీవరీలు లక్షల కేజీల ధాన్యాలను ఉపయోగిస్తున్నాయి. ఇలా ఉత్పన్నమయ్యే పిప్పిని ఫుడ్గా మార్చడం వల్ల ధాన్యాలు వ్యర్థంగా పోవు. సేవింగ్ గ్రెయిన్స్ ద్వారా ఎంతోమంది ఆకలి కూడా తీర్చవచ్చు'' అని ఎలిజబెత్ చెబుతోంది.



సైబర్ టాక్

ఇన్ఫ్లుయెన్సర్లూ జాగ్రత్త!!



సెలబ్రిటీలు, ఇన్ఫ్లుయెన్సర్లు వ్యూవర్స్ని యాడ్స్ ద్వారా ప్రభావితం చేస్తుంటారు. వీరితో పాటు సోషల్ మీడియా ప్లాట్ఫారమ్ ద్వారా వెలుగులోకి వస్తున్నవారు కూడా ఇ-కామర్స్ సంస్థల బ్రాండ్స్ను ఎలా ప్రచారం చేయాలో తెలుసుకోవాలి.

ప్రకటనదారులు ఇన్ఫ్లుయెన్సర్లకు కానుకల ఆశ చూపి, తమ ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా మార్చుకుంటారు. ఇవి తెలియని ఇన్ఫ్లుయెన్సర్లు ఉత్పత్తులకు, సేవలకు ప్రచారకర్తలుగా మారిపోతారు. వీరు చెప్పే బ్రాండ్స్ను గుడ్డిగా నమ్మి వ్యూవర్స్ వాటిని కొనుగోలు చేసి, మోస పోవచ్చు.

అందుకే, భారత ప్రభుత్వం వినియోగదారుల రక్షణ చట్టం -2019 అమలులోకి తీసుకు వచ్చింది. ఉత్పత్తులు, సేవల గురించి తప్పుడు ప్రచారాలు చేసి, ప్రజలను మోసం చేస్తే వారు శిక్షార్హులు అవుతారని చెబుతోంది.

వ్యూవర్లను, సబ్స్రైబర్లను పొందాలంటే..

సాధారణంగా ఇన్ఫ్లుయెన్సర్లు సోషల్మీడియా ఛానెల్స్లో పోస్ట్ చేసిన వాటి విషయంలో ఈ పరిస్థితి తలెత్తదు. వాటిలో స్వీయప్రచారం లేదా సబ్స్రైబర్స్కి ఏదైనా సూచన ఇవ్వడం కనిపిస్తుంది. లాంగ్టైమ్ ఇన్ఫ్లుయెన్సర్లలో ఒకరిగా సక్సెస్ కావాలంటే ఉపయోగకరమైన సమాచారాన్ని తెలియజేసే వ్యక్తిగానే ఉండాలి.

- అర్థవంతమైన కంటెంట్, సంభాషణను ప్రదర్శించాలి.
- సబ్స్రైబర్లు, ఫాలోవర్లను కట్టిపడేలా మీ కంటెంట్ సమయాన్ని పెంచుకోవచ్చు. వ్యూవర్స్ అన్ని కామెంట్స్కు ప్రత్యుత్తరం ఇవ్వడం మర్చిపోవద్దు.
- సబ్స్క్రైబర్ల దృష్టి కోణం నుండి మీ పోస్ట్ ఉండేలా చూసుకోండి. కృత్రిమమైన డ్రామాను ప్లే చేయకూడదు.
- మీ ఛానెల్ను ఫాలో అవమని వ్యక్తులను అడగడంలో మీరు ఎంత పెద్దవారైనప్పటికీ సిగ్గుపడకూడదు. సబ్స్రైబర్లను కొనుగోలు చేయడం కంటే సోషల్మీడియా ఛానెల్లో ప్రమోషన్కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది.
- మీ పోటీదారులు ఎవరు, వారు సోషల్ మీడియాలో ఏమేం చేస్తున్నారు, ఎంత బాగా చేస్తున్నారో చూడండి. వారిని ఫాలో అవడం ద్వారా మీ లోపాలను సులభంగా గుర్తించి, సరి చేసుకోవచ్చు. అంతేకాదు, సబ్స్క్రయిబర్లను పెంచుకునే వ్యూహాన్ని రూపొందించుకోవచ్చు.
- ప్రతిరోజూ ఉండాలి కదా అని ఏదో ఒకటి పోస్ట్ చేయకండి. అది మీ వ్యూవర్స్ని పెంచదు. ప్రతి పోస్ట్ మీ లక్ష్యానికి చేరువ చేస్తుందా అని నిర్ధారించుకోండి. క్వాలిటీ కంటెంట్పైనే దృష్టి పెట్టండి.
- సాధారణంగా కొందరు రెచ్చగొట్టే చర్చలను, వివాదాలను సృష్టించడానికి ట్రోల్ చేస్తారు. దీని వల్ల సబ్స్క్రైబర్లు, ఫాలోవర్లను సంతోషపెట్టలేరు. అలాగని, మీపై ట్రోల్ చేయడంలో వారి పూర్తి పాయింట్ అదే కాబట్టి ట్రోల్లను విస్మరించకూడదు.
- అన్ని సామాజిక ఛానెల్స్ కంటెంట్ను మానిటైజ్ చేస్తున్నందున జాగ్రత్తపడాలి. వార్తలు, వినోదం కోసం ఫేస్బుక్, బ్లాగ్ పోస్ట్లకు ట్విటర్, ఫోటోలు, వీడియోలకు ఇన్స్టాగ్రామ్, ఇండస్ట్రీలకు సంబంధించిన కథనాలకు లింక్డ్ ఇన్.. ఇలా దేనికది ఎంచుకోవాలి.
- మీ ప్రతిస్పందనలోనూ నిజాయితీగా ఉండండి. సోషల్మీడియా ఉనికికి సంబంధించిన ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరుచుకోవడానికి ఇది మీకు సహాయం చేస్తుంది.
- హాష్ట్యాగ్ల విషయాలపై సరైన పరిశోధన చేయండి. లేకుంటే, హ్యాష్ట్యాగ్లు మీ ప్రతిష్ఠను దెబ్బతీసే అవకాశం ఉంది.

ప్రకటనలు ఎలా చేయాలి?

- ప్రకటనలు స్పష్టంగా, ప్రముఖంగా, మిస్ చేయడం చాలా కష్టంగా ఉండే విధంగా ఎండార్స్మెంట్ సందేశంలో ఉంచాలి. హ్యాష్ట్యాగ్లు లేదా లింక్ల సమూహంతో యాడ్స్ను బహిర్గతం చేయకూడదు.
- వ్యూవర్స్ గమనించే విధంగా ప్రకటనల ఎండార్స్మెంట్ ఇమేజ్పై ఉంచాలి.
- ప్రకటనలు ఆడియో, వీడియో ఫార్మాట్లో చేయాలి.
- ప్రకటనలు మొత్తం లైవ్స్ట్రీమ్లో ప్రదర్శించాలి.
- సింపుల్ అండ్ క్లియర్ లాంగ్వేజ్ ఉండాలి.

తగిన శ్రద్ధ ..

- సెలబ్రిటీలు/ఇన్ఫ్లుయెన్సర్లు ప్రకటనలో చూపిన విధంగా ఆ ఉత్పత్తులను తాము వాడి, ప్రయోజనం పొందేలా కూడా ఉండాలి. ఉత్పత్తి, సేవ తప్పనిసరిగా ఎండార్సర్ ద్వారా ఉపయోగించబడి ఉండాలని కూడా సిఫార్సు చేయబడింది.
- ఒక ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ సెలబ్రిటీలు, ఇన్ఫ్లుయెన్సర్లను సంప్రదించి వారి ఉత్పత్తులను ప్రమోట్ చేయడానికి తమ బ్రాండ్ దుస్తులను ధరించమని, ఆన్లైన్ ప్లాట్ఫారమ్ల కోసం కంటెంట్ను రూపొందించమని కోరాలి.
- సెలబ్రిటీలు, ఇన్ఫ్లుయెన్సర్లు ఆన్లైన్లో కంటెంట్ను పోస్ట్ చేస్తే ఆ బ్రాండ్స్ను ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రమోట్ చేస్తున్నట్లు కనిపించాలి.
- సెలబ్రిటీలు, ఇన్ఫ్లుయెన్సర్లు తమ మెటీరియల్ కనెక్షన్ను బహిర్గతం చేయనట్లయితే, వారి అభిప్రాయం పక్షపాతంగా లేదా తప్పుదారి పట్టించేదిగా ఉందనుకోవాలి.
- ఏదైనా మెటీరియల్ కనెక్షన్ను బహిర్గతం చేయడంలో ఇన్ఫ్లుయెన్సర్లు ఫెయిల్ అయితే వినియోగదారుల రక్షణ చట్టం – 2019 కింద చట్టం ప్రకారం కఠిన చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అందుకే, తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

ఉచిత ఉత్పత్తుల వల..

వ్యూవర్స్ నిర్ణయాలు లేదా అభిప్రాయాలను ప్రభావితం చేసే శక్తి ఉన్న ప్రముఖ వ్యక్తులు కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం కాదు. వ్యూవర్స్ అభిప్రాయాలపై బలమైన ప్రభావంతో ఉత్పత్తుల, సేవలను ప్రకటించే సృష్టికర్తలు మాత్రమే. ప్రకటనల కంపెనీలు వారికి ప్రోత్సాహకాలు ప్రకటిస్తుంటాయి. ట్రిప్స్ లేదా హోటల్ వసతి, ఉచిత ఉత్పత్తులు, అవార్డులు.. మొదలైనవి జత చేస్తారు. ఇక, వర్చువల్ ఇన్ఫ్లుయెన్సర్లు కంప్యూటర్ సృష్టించిన వ్యక్తులు. వీటి ద్వారా కూడా యాడ్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రచారం చేస్తుంటాయి.



ఇన్పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్బియింగ్ ఎక్స్పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



భారత్ నుంచి ఒక్కరే...

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో హాకీ ఈవెంట్‌లో విధులు నిర్వహించే అంపైర్ల వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) ప్రకటించింది. పురుషుల, మహిళల మ్యాచ్‌లకు కలిపి మొత్తం 28 మంది అంపైర్లను ఎంపిక చేశారు. భారత్ నుంచి రఘు ప్రసాద్ ఒక్కడే అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపికయ్యాడు. 2003 నుంచి అంపైర్‌గా వ్యవహరిస్తున్న రఘు 186 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అంపైర్‌గా పని చేశాడు. 2012 లండన్, 2021 టోక్యో ఒలింపిక్స్‌లోనూ రఘు ప్రసాద్ అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించాడు.

నీరజ్ ఒక్కడే బరిలోకి...

ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్ ఫైనల్స్‌లో భారత్ నుంచి జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మాత్రమే పోటీపడుతున్నాడు. అవినాశ్ సాబ్లే (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్‌జంప్) కూడా అర్హత సాధించినా ఆసియా క్రీడల నేపథ్యంలో ఈ ఇద్దరు దూరంగా ఉన్నారు. ఈనెల 16, 17వ తేదీల్లో అమెరికాలోని యుజీన్‌లో ఈ ఫైనల్స్ జరుగుతాయి. గత ఏడాది జ్యూరిక్‌లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్ జావెలిన్ త్రో ఈవెంట్ స్వర్ణ పతకం సాధించాడు.



రిటైర్మెంట్ ఆలోచన లేదు: సైనా నెహ్వాల్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలు తక్కువగానే ఉన్నప్పటికీ... ఇప్పట్లో ఆటకు వీడ్కోలు పలికే ఆలోచన లేదని భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ స్పష్టం చేసింది. మోకాలి గాయంతో బాధపడుతున్న 33 ఏళ్ల సైనా గత జూన్ నుంచి అంతర్జాతీయ టోర్నీలకు దూరంగా ఉంది. ఫలితంగా ఒకప్పుడు ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న ఆమె ప్రస్తుతం 55వ ర్యాంక్‌కు పడిపోయింది. 'ప్రపంచ చాంపియన్ ఆన్ సె యంగ్, తై జు యింగ్, అకానె యామగుచిలాంటి స్టార్స్‌తో తలపడాలంటే కేవలం ఒక గంట శిక్షణ సరిపోదు. పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించాకే మళ్లీ బరిలోకి దిగుతాను. ప్రతి ప్లేయర్ రిటైర్ అవుతాడు. నా విషయంలో మాత్రం వీడ్కోలు పలికేందుకు తుది గడువు పెట్టుకోలేదు' అని 2019లో చివరిసారి అంతర్జాతీయ టోర్నీ టైటిల్ గెలిచిన సైనా వ్యాఖ్యానించింది.



గెలిచే జట్టు ఫైనల్‌కు...





- ఆసియా కప్‌లో నేడు శ్రీలంకతో పాకిస్తాన్ పోరు
- మ్యాచ్ రద్దయితే ఫైనల్‌కు లంక
- మధ్యాహ్నం గం.3:00 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కొలంబో: ఆసియా కప్‌లో 'సెమీఫైనల్'లాంటి మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. సూపర్–4 దశలో భాగంగా నేడు జరిగే పోరులో శ్రీలంకతో పాకిస్తాన్ తలపడుతుంది. రెండు వరుస విజయాలతో భారత జట్టు ఇప్పటికే ఫైనల్‌కు అర్హత సాధించగా... భారత్‌తో తుది పోరులో తలపడే ప్రత్యర్థిని ఈ మ్యాచ్ నిర్ణయించనుంది. నాలుగో జట్టయిన బంగ్లాదేశ్ ఇప్పటికే రెండు మ్యాచ్‌లలో ఓడి ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేటి మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్లోకి అడుగు పెడుతుంది. భారత్ చేతిలో చిత్తుగా ఓడి ఆత్మవిశ్వాసం దెబ్బతినడంతో పాటు రన్‌రేట్‌లో పాక్ భారీగా వెనుకబడగా... టీమిండియా చేతిలో ఓడినా చివరి వరకు పోరాడిన లంక మెరుగైన స్థితిలో ఉంది. వర్షం కారణంగా నేటి మ్యాచ్ రద్దయితే లంక లాభపడుతుంది. మెరుగైన రన్‌రేట్‌తో ఆ జట్టు ఫైనల్‌కు చేరుతుంది.

బలాబలాల దృష్ట్యా చూస్తే పాకిస్తాన్, శ్రీలంక సమఉజ్జీలుగానే కనిపిస్తున్నాయి. అయితే సొంతగడ్డపై లంకకు అదనపు ప్రయోజనం ఉంది. భారత్‌తో పోరులో పాక్ పేలవ బ్యాటింగ్ బయటపడింది. ఓపెనర్లు ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హఖ్ అంతంత మాత్రమే ఆడుతుండగా, వరల్డ్ నంబర్‌వన్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన బాబర్ ఆజమ్ దానికి తగినట్లుగా కనీస ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. మిడిలార్డర్‌లో రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్ కూడా జట్టు ఆశించిన రీతిలో స్కోర్లు చేయలేకపోతున్నారు. అయితే అన్నింటికంటే మించి ప్రధాన బౌలర్లు హారిస్ రవూఫ్, నసీమ్ షా ఈ మ్యాచ్‌కు దూరం కావడం పాక్‌కు పెద్ద దెబ్బ. నసీమ్ అధికారికంగా తప్పుకోగా అతని స్థానంలో జమాన్‌ను ఎంపిక చేశారు. రవూఫ్ కూడా ఆడే తక్కువగా ఉండటంతో దహాని బరిలోకి దిగవచ్చు. పాక్ స్పిన్ కూడా బలహీనంగా ఉంది. మరోవైపు లంక స్పిన్ బలమేంటో గత మ్యాచ్‌లో కనిపించింది. ఇదే జోరు కొనసాగిస్తే పాక్‌ను ఆ జట్టు సునాయాసంగా అడ్డుకోగలదు. వెలలాగె, అసలంక, తీక్షణలను పాక్ ఎలా ఆడుతున్నది చూడాలి. ప్రధానంగా కుశాల్ మెండిస్, నిసాంక, సమరవిక్రమ, ధనంజయలపై ఆ జట్టు బ్యాటింగ్ ఆధారపడి ఉంది. ఆల్‌రౌండర్‌గా కెప్టెన్ షనక కీలక ప్రదర్శన చేయాల్సి ఉంది.

155 ఇప్పటి వరకు శ్రీలంక, పాకిస్తాన్ జట్లు 155 వన్డే మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 92 మ్యాచ్‌ల్లో పాకిస్తాన్, 58 మ్యాచ్‌ల్లో శ్రీలంక గెలిచాయి. ఒక మ్యాచ్ 'టై' అయింది. నాలుగు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌లో గిల్

టాప్–10లో ముగ్గురు భారత బ్యాటర్లు



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగేళ్ల తర్వాత టాప్–10లో ముగ్గురు భారత బ్యాటర్లకు చోటు దక్కింది. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో శుబ్‌మన్ గిల్ 759 రేటింగ్ పాయింట్లతో కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత స్టార్స్ విరాట్ కోహ్లి 715 పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌లో, కెప్టెన్ రోహిత్ శర్మ 707 పాయింట్లతో తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్నారు. 2019లో రోహిత్, కోహ్లి, శిఖర్ ధావన్ టాప్–10 ర్యాంకింగ్స్‌లో నిలిచారు. పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ 863 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. పాక్ నుంచి కూడా ముగ్గురు టాప్–10లో ఉండటం విశేషం. ఇమామ్ ఉల్ హఖ్ 735 పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో, ఫఖర్ జమాన్ 705 పాయింట్లతో పదో ర్యాంక్‌లో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ ఏడో ర్యాంక్‌లో, మొహమ్మద్ సిరాజ్ తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచారు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా ఒక స్థానం మెరుగుపర్చుకొని ఆరో ర్యాంక్‌లో ఉన్నాడు.

ద్వితీయ శ్రేణి ఆటగాళ్లతో...

ఆసియా క్రీడలకు భారత ఫుట్‌బాల్ జట్టు ప్రకటన


సునీల్ ఛెత్రి

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) క్లబ్ జట్లు తమ పంతం నెగ్గించుకున్నాయి. ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఎంపిక చేసిన పలువురు అగ్రశ్రేణి సీనియర్, జూనియర్ ఆటగాళ్లను ఐఎస్ఎల్ క్లబ్‌లు విడుదల చేయలేదు. 17 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో కెప్టెన్ సునీల్ ఛెత్రి మినహా మిగతా వారంతా అనుభవంలేని ఆటగాళ్లే ఉన్నారు. సునీల్ ఛెత్రితోపాటు సీనియర్ గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్, సందేశ్ జింగాన్‌లను ఏఐఎఫ్ఎఫ్ ఎంపిక చేసింది. ఆసియా క్రీడల కోసం గుర్‌ప్రీత్‌ను బెంగళూరు ఎఫ్‌సీ, సందేశ్‌ను గోవా ఎఫ్‌సీ విడుదల చేసేందుకు ఆసక్తి చూపలేదు. భారత జట్టు వెంట రెగ్యులర్ కోచ్ ఇగోర్ స్టిమాక్ వెళ్తారా లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. ఆసియా క్రీడల ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఈనెల 19న మొదలు కానుండగా... ఐఎస్ఎల్ పదో సీజన్‌కు ఈనెల 21న తెరలేస్తుంది.

భారత ఫుట్‌బాల్ జట్టు: ధీరజ్ సింగ్, గుర్మీత్ సింగ్ సుమిత్ రాఠి, నరేందర్ గెహ్లోట్, అమర్జీత్ సింగ్, శామ్యూల్ జేమ్స్, కేపీ రాహుల్, అబ్దుల్ రబీ, ఆయుశ్ దేవ్, బ్రైస్ మిరిండా, అజ్ఫర్ నూరాని, రహీమ్ అలీ, విన్సీ బరెటో, సునీల్ ఛెత్రి, రోహిత్ దాను, గుర్‌కీరత్ సింగ్, అనికేత్ జాదవ్.

స్టోక్స్ 182

లండన్: న్యూజిలాండ్‌తో మూడో వన్డేలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ (124 బంతుల్లో 182; 15 ఫోర్లు, 9 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించాడు. నాలుగో సెంచరీ చేసిన క్రమంలో స్టోక్స్ వన్డేల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. జేసన్ రాయ్ (180; 2018లో ఆస్ట్రేలియాపై) పేరిట ఉన్న ఈ రికార్డును స్టోక్స్ బద్దలు కొట్టాడు. 13 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన స్టోక్స్ ఓపెనర్ డేవిడ్ మలాన్ (96; 12 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మూడో వికెట్‌కు 199 పరుగులు జోడించాడు.



డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న దశలో స్టోక్స్ 45వ ఓవర్‌లో ఆరో వికెట్‌గా వెనుదిరిగాడు. స్టోక్స్ అవుటయ్యాక ఇంగ్లండ్ 48.1 ఓవర్లలో 368 పరుగుల వద్ద ఆలౌటైంది. గత ఏడాది జూలైలో వన్డేలకు వీడ్కోలు పలికిన స్టోక్స్ ప్రపంచకప్ కోసం తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా జోడీ

కౌలూన్: హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బుధవారం అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జోడీ మినహా మిగతా భారతీయ క్రీడాకారులకు నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని–తనీషా ద్వయం 21–19, 21–19తో లి చియా సిన్–టెంగ్ చున్ సున్ (చైనీస్ తైపీ) జోడీపై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప–సుమీత్ రెడ్డి (భారత్) జోడీ 16–21, 21–16, 18–21తో చెన్ టాంగ్ జీ–తో ఈ వె (మలేసియా) జంట చేతిలో... సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) ద్వయం 19–21, 10–21తో హీ యోంగ్ కాయ్ టెర్రీ–టాన్ వె హాన్ జెస్సికా (సింగపూర్) జోడీ చేతిలో ఓడిపోయాయి. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి 'వాకోవర్' ఇవ్వగా... ప్రియాన్షు రజావత్ 13–21, 14–21తో కాంటా సునెయామ (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆకర్షి 18–21, 10–21తో వైయోన్ లీ (జర్మనీ) చేతిలో, మాళవిక 14–21, 12–21తో జాంగ్ యి మాన్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్ గౌడ్–కృష్ణ ప్రసాద్ (భారత్) ద్వయం 14–21, 19–21తో సుంగ్ హున్ కో–బేక్ చోల్ షిన్ (కొరియా) జోడీ చేతిలో ఓడింది.


అశ్విని

సినిమా

యుద్ధానికి సిద్ధం

వెండితెరపై కథానాయకుడు కత్తి దూస్తే.. గుర్రపు స్వారీ చేస్తూ యుద్ధం చేస్తే... విల్లు ఎక్కుపెడితే చూసే ప్రేక్షకులకు ఓ థ్రిల్. రెగ్యులర్‌గా వచ్చే ఫైట్స్‌కి భిన్నంగా సిల్వర్ స్క్రీన్‌పై 'వార్' కనిపిస్తే 'వావ్' అనకుండా ఉండలేరు. కొందరు హీరోలు వెండితెరపై యుద్ధం చేయడానికి రెడీ అయ్యారు. ఆ వారియర్స్ గురించి ఓ లుక్ వేయండి.

దిక్కులెల్ల గెలిచినోడు..

'కొండల కోనల్లో కోటి పులులు పట్టినోడు, ముక్కోటి చుక్కలెక్కి దిక్కులెల్ల గెలిచినోడు.. ఒక్కడే ఒక్క వీరుడురా.. వాడే కంగ'.. కంగువా' సినిమాలో హీరోగా సూర్య పాత్రను చిత్రబృందం వివరించిన తీరు ఇది. దీన్నిబట్టి ఈ సినిమాలో సూర్య పాత్రను ఈ చిత్రదర్శకుడు శివ చాలా పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్ది ఉంటారని ఊహించవచ్చు. ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో కొన్ని సన్నివేశాల్లో కంగ అనే యోధుడి పాత్రలో కనిపిస్తారు సూర్య. ఇప్పటికే ఈ సన్నివేశాలను చిత్రీకరించారు. అంతేకాదు..'కంగువా' సినిమాలో ఈ సీన్స్ హైలైట్‌గా ఉంటాయని కోలీవుడ్ సమాచారం. 17వ శతాబ్దానికి చెందిన ఓ వీరుడు సమకాలీన పరిస్థితులకు కనెక్ట్ అయ్యే ఓ పాయింట్‌తో 'కంగువా' చిత్రాన్ని దర్శకుడు శివ తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించారు. 'కంగువా' తొలి భాగం ఏప్రిల్‌లో విడుదల కానుంది.


మోహన్‌లాల్


సూర్య


నిఖిల్

ది వారియర్

విభిన్న సినిమాలు, వైవిధ్యభరితమైన పాత్రల్లో నటిస్తూ ఎప్పుడూ బిజీగా ఉంటారు హీరో మోహన్ లాల్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషభ'. 'ది వారియర్ అరైజ్' అనేది ఉపశీర్షిక. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. తొలి షెడ్యూల్ పూర్తయింది. కాగా ఈ చిత్రం నుంచి విడుదలైన ఓ లుక్ కొన్ని సీన్స్‌లో మోహన్ లాల్ వారియర్‌గా కనిపిస్తారన్నట్లుగా స్పష్టం చేస్తోంది. దీనికి తోడు క్యాప్షన్‌లో 'వారియర్' ప్రస్తావన ఉండటంతో మోహన్‌లాల్ వారియర్‌గా కనిపించే నిడివి కూడా ఎక్కువే అని ఊహిస్తున్నారు ఆయన అభిమానులు. తెలుగు, మలయాళం భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రోషన్ ఓ హీరోగా నటిస్తున్నాడు. జహ్రా ఖాన్, శనయ కపూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. నందకిశోర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. అలాగే మోహన్‌లాల్ నటించి, తొలిసారి దర్శకత్వం వహించిన పీరియాడికల్ సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ 'బరోజ్'. ఈ చిత్రంలో ఓ నిధిని కాపాడే యోధుడిగా కనిపిస్తారాయన.

స్వయంభూ

వియత్నాంలో మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం.. వంటి యుద్ధ విద్యల్లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు హీరో నిఖిల్. ఎందుకంటే 'స్వయంభూ' సినిమా కోసం. ఈ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌లో నిఖిల్ యుద్ధ వీరుడిగా కనిపిస్తారు. నిఖిల్ శిక్షణ పూర్తయిన తర్వాత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఇలా 'వార్' బ్యాక్‌డ్రాప్‌లో దక్షిణాదిన మరికొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి.


ప్రభాస్

సలార్ వాయిదా

ప్రభాస్ హీరోగా నటించిన చిత్రం 'సలార్'. ఈ మూవీలోని తొలి భాగం 'సలార్:సీజ్‌ఫైర్'ని ఈ నెల 28న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''అనుకోని కారణాల వల్ల 'సలార్: సీజ్‌ఫైర్' సినిమాను సెప్టెంబరు 28న విడుదల చేయలేకపోతున్నాం. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం'' అంటూ సోషల్ మీడియా వేదికగా ఓ నోట్‌ను విడుదల చేశారు మేకర్స్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు.



వాళ్లంతా గొప్పవాళ్లు.. నేను కాను

– ఛోటా కె.నాయుడు

"పెదకాపు 1' సినిమాలోని కొన్ని సన్నివేశాలను డైరెక్టర్ వీవీ వినాయక్ చూశారు. విజువల్స్ ఆయనకు బాగా నచ్చడంతో పీసీ శ్రీరామ్‌గారితో నన్ను పోల్చారు. అయితే పీసీ శ్రీరామ్‌గారితో పోల్చుకునేటంత గొప్ప వ్యక్తిని కాదు నేను. పీసీ శ్రీరామ్, వీఎస్ఆర్ స్వామి, విన్సెంట్ (ఛాయాగ్రాహకులు).. వాళ్లంతా గొప్పవాళ్లు" అని కెమెరామేన్ ఛోటా కె. నాయుడు అన్నారు. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా చేసిన ఛోటా కె.నాయుడు విలేకరులతో పంచుకున్న విశేషాలు...

- 'కొత్త బంగారు లోకం' చిత్రంతో శ్రీకాంత్ అడ్డాల, నా ప్రయాణం మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటివరకూ తన ప్రతి సినిమా కథ నాకు చెప్తాడు. ఇద్దరం కలసి చేద్దామనుకుంటాం కానీ 'పెదకాపు 1'కి కుదిరింది. తన సినిమాల్లాగానే శ్రీకాంత్ చాలా కూల్‌గా ఉంటాడు. తనని చూస్తే నాకు కె.విశ్వనాథ్‌గారిలా అనిపిస్తారు. కూల్‌గా ఉండే తను 'పెదకాపు 1' లాంటి చిత్రం చేసి, ఇంత మంచి ఔట్‌పుట్ ఇవ్వడం నాకు షాక్ అనిపించింది. శ్రీకాంత్ అడ్డాలకి నటుడిగా ఇది తొలి చిత్రమైనా సింగిల్ టేక్‌లో చేసేసేవాడు.. తను నటించిన ప్రతి సీన్‌ని మా నిర్మాత రవీందర్ రెడ్డిగారు డైరెక్ట్ చేశారు.
- 'పెదకాపు 1' కథ 1983 నేపథ్యంలో జరుగుతుంది. ఈ కథ కొత్త ప్యాట్రన్, కొత్త కలర్స్, మేకింగ్‌ని డిమాండ్ చేసింది.. దాన్ని తీసుకురావడం నాకు సవాల్‌గా అనిపించింది. ఈ విషయంలో క్రెడిట్ దర్శకుడిదే.
- నేనెప్పుడూ హీరో స్థానానికి గౌరవం ఇస్తాను. స్టార్ హీరోనా, పెద్ద హీరోనా, చిన్న హీరోనా అని చూడను. విరాట్‌కి ఇది తొలి సినిమా అయినా అనుభవం ఉన్న నటుడిలా చేశాడు. హీరోయిన్ ప్రగతికి కూడా మొదటి సినిమా అయినా చాలా బాగా చేసింది. నటి అనసూయ కూడా తన పాత్రని మేము అనుకున్నదానికంటే బాగా చేసింది.. మిక్కీ జె.మేయర్ ఇలాంటి చక్కని నేపథ్య సంగీతం ఇవ్వడం నన్ను సర్‌ప్రైజ్ చేసింది.
- 'పెదకాపు 1'ని రవీందర్ రెడ్డిగారు కాకుండా మరో నిర్మాత అయితే ఐదారు కోట్లలో సినిమా తీయమని చెప్పేవారు. కానీ, ఈ కథ ముప్పై నలభై కోట్లు డిమాండ్ చేస్తుంది. ఆయన కాబట్టి ఇంత భారీ బడ్జెట్‌తో తీశారు. పైగా తన బావమరిదిని హీరోగా లాంచ్ చేస్తున్నారు. 'పెదకాపు 2' చిత్రం కూడా ఉంటుంది.
- 'పెదకాపు 1' కోసం 1983 నాటి వాతావరణం సృష్టించడానికి చాలా కష్టపడ్డాం. ఈ మూవీలో హీరో, అతని స్నేహితులు జెండా కర్ర పాతే సన్నివేశం చిత్రీకరించడం నా కెరీర్‌లో అద్భుతం. నేను చాలా గర్వంగా చెప్పుకునే ఎపిసోడ్ ఇది. నెక్ట్స్ చిరంజీవిగారి 157వ సినిమా చేస్తున్నాను.. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభమవుతుంది.


విక్రాంత్, రుక్సార్ ఢిల్లార్

ఏమా అందం

విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్.. ఎల్.ఐ.ఎఫ్.ఈ'. మెహరీన్ ఫిర్జాదా, రుక్సార్ ఢిల్లాన్ హీరోయిన్లు. డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ చిత్రం నవంబరు 17న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'ఏమా అందం.. ఏమా అందం.. భామా నీకు భువితో ఏమి సంబంధం' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. విక్రాంత్, రుక్సార్ కాంబినేషన్‌లో ఈ పాట చిత్రీకరించారు. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, సిద్ శ్రీరామ్ పాడారు.


భరత్ నరేన్, బాబీ కొల్లి, రాజా విక్రమ్

వారి కళ్లల్లో ఆ నమ్మకం కనిపిస్తోంది

– డైరెక్టర్ బాబీ కొల్లి

''దిల్ సే' సినిమా ట్రైలర్ చాలా బాగుంది.. ఒక పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది. ఈ చిత్రంతో విజయం అందుకుంటామనే నమ్మకం యూనిట్ కళ్లల్లో కనిపిస్తోంది. అందుకు తగ్గట్టే 'దిల్ సే' పెద్ద విజయం సాధించాలి'' అని డైరెక్టర్ బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) '' అన్నారు. రాజా విక్రమ్ హీరోగా భరత్ నరేన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దిల్ సే'. శ్రీ అక్కియన్ ఆర్ట్స్ బ్యానర్‌పై శ్రీధర్ మరిసా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 16 నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని బాబీ కొల్లి విడుదల చేశారు. భరత్ నరేన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మాస్క్ వేసుకున్న అమ్మాయి (హీరోయిన్) ఎవరు? అనేది ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించడానికే చెప్పడం లేదు'' అన్నారు. ''దిల్ సే' నా మొదటి చిత్రం '' అన్నారు రాజా విక్రమ్.

అష్టదిగ్బంధనం.. ఓ పజిల్


విషిక, సూర్య

''అష్టదిగ్బంధనం' పవర్‌ఫుల్ టైటిల్. ట్రైలర్‌లో మంచి సస్పెన్స్ కనిపిస్తోంది. అలాగే ప్రేక్షకులను అష్టదిగ్బంధనం చేసే అంశాలు ఈ చిత్రంలో చాలానే ఉన్నాయి'' అని 'బేబీ' మూవీ డైరెక్టర్ సాయి రాజేష్ అన్నారు. సూర్య, విషిక జంటగా బాబా పీఆర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అష్టదిగ్బంధనం'. ఎంకేఏకేఏ ఫిలిం ప్రొడక్షన్స్ సమర్పణలో మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని సాయి రాజేష్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బాబా పీఆర్ మాట్లాడుతూ– ''నా మొదటి సినిమా 'సైదులు'.. రెండో చిత్రం 'అష్టదిగ్బంధనం'. క్రైమ్, యాక్షన్, థ్రిల్, పజిల్ లాంటి సినిమా ఇది'' అన్నారు. ''కథను నమ్మి ఈ సినిమా నిర్మించాను'' అన్నారు మనోజ్ కుమార్ అగర్వాల్. ''సినిమా పక్కా హిట్ అని నమ్ముతున్నాం'' అన్నారు సూర్య.



నా కల నెరవేరుతోంది – గోల్డీ నిస్సీ

''ఛాంగురే బంగారురాజా' కుటుంబంతో కలిసి హాయిగా చూడదగ్గ సినిమా. ఇందులో మంగరత్నం అనే పోలీస్ కానిస్టేబుల్ పాత్ర చేశాను. మెకానిక్ బంగార్రాజుగా కార్తీక్ నటించారు. మా ఇద్దరి మధ్య ప్రేమ ప్రయాణం చాలా సరదాగా ఉంటుంది. రవితేజగారి నిర్మాణంలో నా మొదటి సినిమా చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను'' అని హీరోయిన్ గోల్డీ నిస్సీ అన్నారు. కార్తీక్ రత్నం హీరోగా సతీష్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. రవితేజ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా గోల్డీ నిస్సీ మాట్లాడుతూ–''నేను తెలుగమ్మాయిని. కొన్ని షార్ట్ ఫిలిమ్స్ చేశాను. హీరోయిన్‌గా నా తొలి సినిమా 'ఛాంగురే బంగారురాజా'. రవితేజగారిని కలిసినప్పుడు 'సినిమా చూశాను. నీకు ఇది తొలి సినిమా అయినా భయం లేకుండా నటించావ్' అని మెచ్చుకోవడం హ్యాపీ. నన్ను నేను పెద్ద తెరపై చూసుకోవాలనే కల నెరవేరుతుండటం చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
14-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
246	77
67,467	20,070

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30కి ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,861	▲	88
డోజోన్స్	34,679	▲	33
ఎఫ్‌టీఎస్ఈ 100	7,526	▽	2
డాక్స్	15,654	▽	62
షాంఘై	3,123	▽	14
నికాయ్	32,706	▽	70

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	58,200
బంగారం (22 క్యారెట్)	55,430
వెండి (కేజీ)	77,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.18	83.85
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	102.97	105.34
€	యూరో	ఒకటి	87.68	90.79
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.49	57.21
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.10	54.43
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.00	61.94
SAR	సౌదీ రియాల్	[illegible]	21.17	22.80
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.70	23.49
¥	చైనా యువాన్	[illegible]	10.28	12.35

భారత్ నుంచి టెస్లా 1.9 బి. డాలర్ల కొనుగోళ్లు

కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లా ఈ ఏడాది భారత్ నుంచి 1.9 బిలియన్ డాలర్ల విలువ చేసే పరికరాలను కొనుగోలు చేసే యోచనలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గతేడాది 1 బిలియన్ డాలర్ల మేర కొనుగోళ్లు చేసిందని ఆటోమొబైల్ పరికరాల తయారీ సంస్థల సమాఖ్య ఏసీఎంఏ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. భారత్ మార్కెట్లో తమ కార్లను విక్రయించుకోవడానికి కొన్ని ప్రత్యేక మినహాయింపులు కావాలని టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ కేంద్రాన్ని కోరుతున్న నేపథ్యంలో గోయల్ వెల్లడించిన వివరాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, దేశీ ఎలక్ట్రిక్ వాహనాల రంగంలోకి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం అన్ని చర్యలూ తీసుకుంటోందని మంత్రి చెప్పారు. విద్యుత్ వాహనాల పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా వృద్ధి చెందుతున్న తరహాలోనే భారత్‌లోనూ ఎదగగలదని ఆయన తెలిపారు. ఎలక్ట్రిక్, ఇతర వాహనాల డిమాండ్ మధ్య వ్యత్యాసం గణనీయంగా తగ్గిందని.. రాబోయే రోజుల్లో మరింత తగ్గగలదని గోయల్ చెప్పారు.

సాయి సిల్క్స్ ఐపీవో 20న

కళామందిర్, కేఎల్ఎం బ్రాండ్ స్టోర్ల సంస్థ

న్యూఢిల్లీ: సంప్రదాయ దుస్తుల రిటైలర్ సాయి సిల్క్స్ (కళామందిర్) పబ్లిక్ ఇష్యూ ఈ నెల 20న ప్రారంభంకానుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను విక్రయించనుంది. 22న ముగియనున్న ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 2.7 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 280 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది. కళామందిర్, వరమహాలక్ష్మి సిల్క్స్, మందిర్, కేఎల్ఎం ఫ్యాషన్ మాల్ బ్రాండ్లతో స్టోర్లను నిర్వహిస్తున్న హైదరాబాద్ కంపెనీ 2023 మార్చికల్లా రూ. 1,351 కోట్ల టర్నోవర్ సాధించింది. రూ. 98 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023 జులైకల్లా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులలో 54 స్టోర్లు నిర్వహిస్తోంది.

ఈ-టూవీలర్ కంపెనీలకు చెక్!

- ప్రోత్సాహకాలు తిరిగివ్వకుంటే.. చట్టపరమైన చర్యలు
- కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరి
- లిస్టులో హీరో ఎలక్ట్రిక్, ఒకినావా తదితర సంస్థలు
- ఫేమ్–2 నిబంధనలను ఉల్లంఘించినందుకే



న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీని, వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఫేమ్–2 స్కీమ్ నిబంధనలను ఉల్లంఘించిన కంపెనీలపై చట్టపరమైన చర్యలకు కూడా కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా, పథకం కింద పొందిన రూ. 469 కోట్ల పైచిలుకు సబ్సిడీ ప్రోత్సాహకాలను తిరిగి చెల్లించాలంటూ ఏడు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థలకు నోటీసులు ఇచ్చింది. హీరో ఎలక్ట్రిక్, ఒకినావా ఆటోటెక్, యాంపియర్ ఈవీ, రివోల్ట్ మోటార్స్, బెన్‌లింగ్ ఇండియా, ఎమో మొబిలిటీ, లోహియా ఆటో ఈ జాబితాలో ఉన్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వీటిలో రివోల్ట్ మోటార్స్ మాత్రమే ప్రోత్సాహకాలను తిరిగి చెల్లించేందుకు ముందుకు వచ్చినట్లు వివరించారు. మిగతా సంస్థలు ఇంకా స్పందించలేదని పేర్కొన్నారు. రీఫండ్‌కు డెడ్‌లైన్ దాదాపు ముగిసిపోతోందని చెప్పారు. 'వచ్చే వారం కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. చట్టపరమైన చర్యలకు గల అవకాశాలను పరిశీలిస్తున్నాం' అని అధికారి వివరించారు.

ఉల్లంఘనలు ఇలా..

ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల వినియోగాన్ని వేగవంతం చేసేలా రూ. 10,000 కోట్ల ప్రోత్సాహకాలతో కేంద్రం 2019లో ఫేమ్–2 పథకాన్ని ఆవిష్కరించింది. ఇది 2015లో రూ. 895 కోట్లతో ప్రకటించిన తొలి ఫేమ్ వెర్షన్‌కు కొనసాగింపు. ఫేమ్–2 పథకం నిబంధనల ప్రకారం .. దేశీయంగా తయారైన పరికరాలతో ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేసిన కంపెనీలకు ప్రోత్సాహకాలు లభిస్తాయి. అయితే, పలు కంపెనీలు వీటిని ఉల్లంఘిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈ స్కీముతో ప్రయోజనం పొందిన కంపెనీలపై భారీ పరిశ్రమల శాఖ విచారణ జరిపింది. వీటిలో ఏడు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా దిగుమతి చేసుకున్న పరికరాలను ఉపయోగించినట్లుగా వెల్లడైంది. దీంతో గత ఆర్థిక సంవత్సరం సబ్సిడీలను విడుదల చేయడంలో కేంద్రం ఆలస్యం చేసింది. ఫలితంగా అటు సబ్సిడీ బకాయిలు చిక్కుబడిపోయి, ఇటు మార్కెట్ వాటా కోల్పోయి ఎలక్ట్రిక్ వాహన సంస్థలు దాదాపు రూ. 9,000 కోట్లు నష్టపోయినట్లు విద్యుత్ వాహనాల తయారీ సంస్థల సమాఖ్య ఎస్ఎంఈవీ అంచనా వేసింది. కొనుగోళ్లపై పొందిన రిబేట్లను తిరిగి చెల్లించేలా కస్టమర్లకు సూచించే అవకాశాలను పరిశీలించాలంటూ సబ్సిడీలపరమైన మద్దతు కోల్పోయిన ఏడు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కంపెనీలు కేంద్రాన్ని కోరాయి.

ఇస్రోతో అమెజాన్ వెబ్ సర్వీసెస్ జట్టు

న్యూఢిల్లీ: క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా స్పేస్–టెక్ సంబంధ నవకల్పనలకు ఊతమిచ్చేలా ఇస్రో, ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్–స్పేస్)తో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి కొత్త ఆవిష్కరణలు చేసే దిశగా స్పేస్ స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలు, విద్యార్థులకు క్లౌడ్ టెక్నాలజీలను అందుబాటులో ఉంచడానికి ఈ ఒప్పందం ఉపయోగపడగలదని ఏడబ్ల్యూఎస్ ఇండియా, సౌత్ ఏషియా డైరెక్టర్ శాలిని కపూర్ తెలిపారు. అంతరిక్ష రంగం మరింత మెరుగైన నిర్ణయాలను, వేగవంతంగా తీసుకునేందుకు క్లౌడ్ కంప్యూటింగ్ ఆధారిత ఆవిష్కరణలు సహాయపడగలవని ఆమె వివరించారు.

డాక్యుమెంట్లు తిరిగి ఇవ్వకపోతే రోజుకు రూ. 5 వేల పరిహారం

- రుణ పూర్తి చెల్లింపులపై బ్యాంకింగ్‌కు ఆర్‌బీఐ ఆదేశాలు
- 30 రోజుల్లో పత్రాలన్నింటినీ తిరిగి ఇవ్వాలని నిర్దేశం



న్యూఢిల్లీ: రుణం పూర్తి చెల్లింపుల తర్వాత రుణానికి సంబంధించి తనఖాగా ఉంచిన ఒరిజినల్ స్థిర లేదా చర ఆస్తి పత్రాలు అన్నింటినీ రుణగ్రహీతకు 30 రోజుల లోపు తిరిగి ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బ్యాంకులకు, ఫైనాన్స్ సంస్థలకు స్పష్టం చేసింది. ఏదైనా ఆలస్యం జరిగితే రోజుకు రూ. 5 వేలు పరిహారంగా చెల్లించాలని స్పష్టం చేసింది. అదేవిధంగా ఏదైనా రిజిస్ట్రీలో నమోదైన చార్జీలను అన్నింటినీ నిర్దేశిత 30 రోజుల్లో తీసివేయాలని కూడా ఒక నోటిఫికేషన్‌లో ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ తరహా పలు ఫిర్యాదుల నమోదు నేపథ్యంలో బ్యాంకింగ్ రెగ్యులేటర్ తాజా ఆదేశాలు ఇచ్చింది. డాక్యుమెంట్లు తిరిగి ఇవ్వడంలో నెల రోజులు దాటితే ఈ జాప్యానికి స్పష్టమైన కారణాలను రుణగ్రహీతకు తెలియజేయాల్సి ఉంటుందని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించింది. డాక్యుమెంట్లను తిరిగి ఇవ్వడానికి సంబంధించిన విధివిధానాల వివరాలను బ్యాంకింగ్ లేదా ఆర్థిక సంస్థలు తమ వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించింది.

నష్టం జరిగితే.. మరో 30 రోజులు

ఒరిజినల్ చర లేదా స్థిర ఆస్తి పత్రాలు కనబడకుండా పోవడం లేదా ఏదైనా నష్టం జరిగితే అటువంటి పత్రాల డూప్లికేట్ లేదా సర్టిఫైడ్ కాపీలను పొందడంలో రుణగ్రహీతకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పూర్తిగా సహాయపడాలని కూడా ఆర్‌బీఐ నిర్దేశించింది. ఇందుకు మరో 30 రోజుల సమయాన్ని తీసుకోవచ్చని పేర్కొంది. ఆ తర్వాతే (60 రోజుల తర్వాత) జాప్యానికి రోజుకు రూ.5 వేల పరిహారం నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. కాగా, ఈ పరిహారం... ఇతర ఏదైనా (వర్తించే) చట్టం ప్రకారం ఏదైనా ఇతర పరిహారం పొందేందుకు రుణగ్రహీతకు ఉండే హక్కులకు ఎటువంటి భంగం కలిగించబోదని ఆర్‌బీఐ స్పష్టం చేయడం గమనార్హం. 2023 డిసెంబరు 1 తర్వాత ఒరిజినల్ చర లేదా స్థిరాస్తి పత్రాలను విడుదల చేసే అన్ని కేసులకు ఈ తాజా ఆదేశాలు వర్తిస్తాయని ఆర్‌బీఐ తెలిపింది.

సువెన్ ఫార్మాలో రూ. 9,589 కోట్ల ఎఫ్‌డీఐ

'అడ్వెంట్' పెట్టుబడులకు కేంద్రం ఓకే..

న్యూఢిల్లీ: ఔషధ రంగ సంస్థ సువెన్ ఫార్మాలో ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ అడ్వెంట్ ఇంటర్నేషనల్ వాటాల కొనుగోలుకు ఆమోదముద్ర పడింది. ఇందుకు సంబంధించి అడ్వెంట్‌కు చెందిన సైప్రస్ సంస్థ బెర్హ్యాండా రూ. 9,589 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదించింది. సువెన్ ఉత్పత్తి సామర్థ్యాలను విస్తరించుకోవడానికి, కొత్తగా మరిన్ని ఉద్యోగాలు కల్పించడానికి ఇది తోడ్పడనుంది. హైదరాబాద్‌కు చెందిన



సువెన్ ఫార్మాలో 50.1 శాతం వాటాలు కొనుగోలు చేసేందుకు అడ్వెంట్ ఇంటర్నేషనల్ గతేడాది డిసెంబర్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. దీనితో పాటు ఓపెన్ ఆఫర్ కింద మరో 26 శాతం వాటాలు కూడా కొనుగోలు చేయాల్సి ఉండటంతో డీల్ మొత్తం విలువ రూ. 9,589 కోట్లయ్యింది.

బుధవారం బీఎస్ఈలో సువెన్ షేర్లు 0.75% లాభపడి రూ. 517.40 వద్ద ముగిశాయి.

20,000 పైన నిఫ్టీ ముగింపు

- తొమ్మిదో రోజూ సెన్సెక్స్ ర్యాలీ
- బ్యాంకులు, ఇంధన షేర్లకు డిమాండ్



ముంబై: దేశీయంగా ఆగస్టు రిటైల్ ద్రవ్యోల్బణం, జూలై పారిశ్రామికోత్పత్తి గణాంకాలు మెప్పించడంతో సెన్సెక్స్ ర్యాలీ తొమ్మిదో రోజూ కొనసాగింది. ఇంట్రాడేలో 344 పాయింట్లు బలపడి ఈ సూచీ చివరికి 246 పాయింట్ల లాభంతో 67,467 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 77 పాయింట్లు బలపడి తొలిసారి 20 వేల స్థాయిపై జీవిత కాల గరిష్టం 20,070 వద్ద ముగిసింది. రోజంతా 19,944 – 20,097 శ్రేణిలో కదలాడింది. ఆటో, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఇంధన, టెలికం షేర్లకు డిమాండ్ లభించింది. క్రితం ట్రేడింగ్‌లో ఈ ఏడాదిలోనే అతిపెద్ద పతనాన్ని చవిచూసిన చిన్న, మధ్య తరహా షేర్లలో రికవరీ కన్పించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు దాదాపు ఒక శాతం ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,632 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.850 కోట్ల షేర్లను కొన్నారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ షేరు 20% పెరిగి రూ.51 వద్ద అప్పర్ సర్క్యూట్‌ని తాకింది. ఇండస్ఇండ్ బ్యాంక్‌తో ఓ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఎన్‌సీఎల్‌టీ దివాలా పరిష్కార ప్రక్రియ గండం నుంచి గట్టెక్కగలిగింది. బీఎస్ఈలో 24.01 లక్షల ఈక్విటీలు చేతులు మారాయి.
- పర్యావరణ అనుకూల రవాణా అనుసంధాన ప్రాజెక్టుల్లో రూ.24,750 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవడంతో కోల్ ఇండియా కంపెనీ షేరు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 3% పెరిగి రూ.280 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ సూచీలో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.
- ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు భారీ డిమాండ్‌తో బీఎస్ఈ పీఎస్‌బీ సూచీ 4% ఎగసింది. పీఎన్‌బీ 8.50%, బ్యాంక్ ఆఫ్ బరోడా 8%, సెంట్రల్ బ్యాంక్ 7%, పీఎస్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యుకో బ్యాంక్ షేర్లు 6% ర్యాలీ చేశాయి. మహారాష్ట్ర బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా 5% పెరిగాయి. యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు 3–1% లాభపడ్డాయి.

భవిత

విద్య,ఉద్యోగ సమాచారం

సెంట్రల్ రైల్వే-ఆర్ఆర్‌సీలో 2409 యాక్ట్ అప్రెంటిస్‌లు

ముంబైలోని సెంట్రల్ రైల్వే–రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ).. సెంట్రల్ రైల్వే పరిధిలోని వర్క్‌షాప్‌లు, డివిజన్‌లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2409
» **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, కార్పెంటర్, పెయింటర్, టైలర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, పీఏఎస్ఏఏ, మెకానిక్ డీజిల్, సీవోపీఏ, షీట్ మెటల్ వర్కర్, మెకానిక్ మెషిన్ టూల్స్ మెయింటెనెన్స్, ఐటీ అండ్ ఈఎస్ఎం.
» **వయసు:** 29.08.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.09.2023
» **వెబ్‌సైట్:** https://www.rrccr.com

ఏపీ సార్వత్రిక విద్యలో ఇంటర్‌లో ప్రవేశాలు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **గ్రూప్‌లు:** ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్ మధ్యలోనే మానేసిన అభ్యర్థులు అర్హులే.
» **వయసు:**అభ్యర్థికి 31.08.2023 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.09.2023
» **వెబ్‌సైట్:** apopenschool.ap.gov.in

ఏపీ సార్వత్రిక విద్యలో పదో తరగతిలో ప్రవేశాలు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **వయసు:** 31.08.2023 నాటికి అభ్యర్థికి 14 ఏళ్లు నిండా ఉండాలి. గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు. ఇందుకు జనన ధ్రువీకరణ పత్రం లేదా టీసీని సమర్పించాల్సి ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.09.2023
» **వెబ్‌సైట్:** apopenschool.ap.gov.in

ఇస్రో.. కెరీర్ లాంచింగ్

» డిప్లొమా నుంచి డాక్టరేట్ వరకు పలు అవకాశాలు
» సైన్స్, మ్యాథమెటిక్స్, ఇంజనీరింగ్‌తో కొలువులు
» ఇస్రో ఆధ్వర్యంలో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్
» అంతరిక్ష పరిశోధన అభ్యర్థులకు అద్భుత వేదిక



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రోగా సుపరిచితం! తాజాగా చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 విజయంతో ఇస్రో పేరు మారుమోగుతోంది. ఈ ప్రయోగాల్లో పాల్పంచుకున్న శాస్త్రవేత్తలకు, సిబ్బందికి యావత్ దేశం జేజేలు పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఇస్రో విజయాల్లో యువత భాగస్వాములవ్వాలంటే ఏం చేయాలి? ఈ అంతరిక్ష పరిశోధన సంస్థలో కెరీర్‌కు మార్గాలు ఏమిటి; ఎలాంటి అర్హతలుంటే.. ఇస్రో కొలువు సొంతమవుతుంది.. నియామక విధానాల గురించి తెలుసుకుందాం..

ఇస్రో.. సైన్స్, మ్యాథమెటిక్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ విభాగాల్లో డిప్లొమా నుంచి పీహెచ్‌డీ వరకూ.. ఆయా అర్హతలకు అనుగుణంగా నియామకాలు చేపడుతోంది. ముఖ్యంగా బీటెక్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్; అలాగే మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌తోనూ ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీటికి సంబంధించి ఈ అంతరిక్ష సంస్థ నిత్యం నోటిఫికేషన్లు విడుదల చేస్తుంది. ఇందుకోసం ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తే.. అవకాశాలు చేజారకుండా దరఖాస్తు చేసుకునే వీలుంటుంది.

కోర్సులు.. ఇన్‌స్టిట్యూట్‌లు

ఇస్రో కెరీర్‌కు దోహదం చేసే ఆస్ట్రానమీ, ఏవియానిక్స్, ఆస్ట్రో ఫిజిక్స్ వంటి స్పెషలైజ్డ్ కోర్సులను ప్రస్తుతం పలు ఇన్‌స్టిట్యూట్‌లు అందుబాటులోకి తెచ్చాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(బెంగళూరు), యూనివర్సిటీ ఆఫ్ పుణెలతోపాటు పలు సెంట్రల్ యూనివర్సిటీలు బీటెక్, ఎంటెక్ స్థాయిలో వీటిని అందిస్తున్నాయి. గ్రాడ్యుయేషన్ స్థాయి కోర్సుల్లో జేఈఈ–మెయిన్, జేఈఈ–అడ్వాన్స్‌డ్, సీయూఈటీ –యూజీలో ర్యాంకు; పీజీ కోర్సుల్లో గేట్ స్కోర్, సీయూఈటీ–పీజీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఐఐఎస్‌టీ

ఇస్రో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ)ని నెలకొల్పారు. డీమ్డ్ యూనివర్సిటీ హోదా కలిగిన ఈ ఇన్‌స్టిట్యూట్‌లో.. బీటెక్ ఈసీఈ(ఏవియానిక్స్), బీటెక్(ఏరోస్పేస్ ఇంజనీరింగ్); ఎంటెక్‌లో ఏరో డైనమిక్స్ అండ్ ఫ్లైట్ మెకానిక్స్, స్ట్రక్చర్స్ అండ్ డిజైన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్, థర్మల్ అండ్ ప్రొపల్షన్; ఎమ్మెస్సీ(ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్) తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బీటెక్‌లోకి జేఈఈ –అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు నిర్వహిస్తారు. గేట్ స్కోర్ ఆధారంగా ఎంటెక్; సీఎస్ఐఆర్ –యూజీసీ నెట్, జెస్ట్ స్కోర్‌తో పీహెచ్‌డీలో అడ్మిషన్ లభిస్తుంది. ఐఐఎస్‌టీలో కోర్సులు పూర్తి చేసుకున్న వారికి.. ఇస్రోతోపాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని రీసెర్చ్ కేంద్రాలు, ఎర్త్ సైన్స్ సెంటర్ వంటి రీసెర్చ్ కేంద్రాల్లో కొలువులు లభిస్తున్నాయి.

ఎంట్రీ లెవల్‌లో సైంటిస్ట్-ఎస్‌సీ

ఇస్రోలో ప్రధానంగా ఎనిమిది సైంటిస్ట్ హోదాలు ఉన్నాయి. అవి.. సైంటిస్ట్–ఎస్‌సీ, ఎస్‌డీ, ఎస్ఈ, ఎస్ఎఫ్, ఎస్‌జీ, సైంటిస్ట్–జీ, ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్, డీఎస్ (డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్).

ఎంట్రీ లెవల్‌లో.. సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్‌సీ హోదాతో కొలువు సొంతం చేసుకోవచ్చు. నిర్దేశిత బ్రాంచ్‌లు, స్పెషలైజేషన్లలో బీటెక్, ఎంటెక్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతను వీటికి అర్హతగా పేర్కొంటారు. ఇదే రీతిలో సైంటిస్ట్–ఎస్ఎఫ్ హోదా వరకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా నియామకాలు చేపడతారు. సైంటిస్ట్ ఎస్‌జీ నుంచి సైంటిస్ట్–జి హోదాలకు రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

డీఎస్ స్థాయికి చేరుకునే అవకాశం

బీటెక్‌తో సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్‌సీగా కొలువు దీరిన వారు భవిష్యత్తులో విశిష్ట శాస్త్రవేత్త(డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్) హోదాకు పదోన్నతి పొందే అవకాశముంది. సర్వీస్‌లో చేరిన నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌డిగా.. ఆ తర్వాత నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్ఈగా.. అనంతరం మరో నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్ఎఫ్‌గా పదోన్నతులు లభిస్తాయి. మరో అయిదేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌జి, అనంతరం అయిదేళ్లకు.. సైంటిస్ట్ జి హోదా లభిస్తుంది. సైంటిస్ట్ జి హోదాలో ఆరేళ్లు పూర్తి చేసుకుంటే.. ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్‌గా, ఈ హోదాలో రెండేళ్లు పూర్తి చేసుకుంటే.. డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్‌గా పదోన్నతి లభిస్తుంది.

విధులు ఇవే

ఇస్రోలో ఎంట్రీ లెవల్‌లో సైంటిస్ట్–ఎస్‌సీ హోదాలో నియామకం ఖరారు చేసుకున్న వారు ఇస్రో, అంతరిక్ష శాఖకు చెందిన విభాగాలు, కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. సీనియర్ సైంటిస్ట్‌లకు సహకరించడం, సంబంధిత విభాగాల్లో అప్లికేషన్స్ రూపొందించడం వంటివి చేయాల్సి ఉంటుంది. అదే విధంగా పదోన్నతులు పొందే కొద్దీ విధులు, బాధ్యతలు పెరుగుతాయి. ఆయా ప్రాజెక్ట్‌లను స్వయంగా పర్యవేక్షిస్తూ.. సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది.

ఇస్రోలో కెరీర్స్.. ముఖ్యాంశాలు

- సైంటిస్ట్–ఎస్‌సీ హోదాలో బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణులకు ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు.
- ఐఐఎస్‌టీ ఆధ్వర్యంలో ఏవియానిక్స్, ఎలక్ట్రానిక్స్‌లో బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు.
- పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఏవియానిక్స్ తదితర అంతరిక్ష శాస్త్ర అనుబంధ కోర్సులు.
- ఇస్రో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.
- ఆయా హోదాలను బట్టి పే లెవల్–7 నుంచి పే లెవల్ –14 వరకు వేతన శ్రేణి.
- ఇస్రో కెరీర్స్, నియామక నిబంధనలకు వెబ్‌సైట్: https://www.isro.gov.in/CareerOpportunities.html

బీఎస్సీతో సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్

బీఎస్సీ అర్హతతో ఇస్రోలో సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్ నియామకాలు చేపడతారు. ఇందుకోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ హోదాలో కెరీర్ ప్రారంభించిన వారు సీనియర్ సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్–ఎ, సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్ –సి, డి, ఈ, ఎఫ్, ఎస్‌జీ హోదాలకు పదోన్నతులు పొందే అవకాశం ఉంటుంది.

డిప్లొమాతో టెక్నీషియన్

ఇస్రోలో డిప్లొమా అర్హతతోనూ ఉద్యోగం పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తీర్ణతతో ల్యాబ్ టెక్నీషియన్–ఎ హోదాలో అడుగు పెట్టొచ్చు. ఇందుకోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ హోదాలో కెరీర్ ప్రారంభించిన వారు భవిష్యత్తులో ల్యాబ్ టెక్నీషియన్–బి, సి, ఎ, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్–బి హోదాలకు చేరుకోవచ్చు. అదే విధంగా డిప్లొమా ఇన్ రేడియోగ్రఫీలో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతతో రేడియోగ్రాఫర్–ఎగా కెరీర్ సొంతం చేసుకోవచ్చు. ఆ తర్వాత రేడియో గ్రాఫర్–బి, సి; సీనియర్ రేడియోగ్రాఫర్–ఎ, సీనియర్ రేడియోగ్రాఫర్–బి వరకు పదోన్నతులు పొందొచ్చు.

ఐటీఐతోనూ

ఇస్రోలో ఐటీఐతో టెక్నీషియన్/డ్రాఫ్ట్స్‌మెన్ పోస్టులకు నియామకాలు చేపడతారు. ప్రారంభంలో టెక్నీషియన్–ఎ హోదా కల్పిస్తారు. ఆ తర్వాత టెక్నీషియన్–బి /డ్రాఫ్ట్‌మెన్–బి, టెక్నీషియన్–డి/డ్రాఫ్ట్స్‌మెన్–సి 2, టెక్నీషియన్–ఎఫ్/ డ్రాఫ్ట్స్‌మెన్–డి, జి, ఈ హోదాలకు; ఆ తర్వాత సీనియర్ టెక్నీషియన్, సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ ఎ, బి కేటగిరీలకు చేరుకోవచ్చు. ఆ తర్వాత జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశముంది. వీటికి కూడా రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ప్రత్యేక నియామక విభాగం

భారత అంతరిక్ష శాఖ పరిధిలోని ఇస్రోతో పాటు, అంతరిక్ష శాఖకు చెందిన విభాగాలు, కేంద్రాల్లో సైంటిస్ట్, ఇంజనీర్ ఉద్యోగాల భర్తీ కోసం ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పేరిట ప్రత్యేక నియామక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజేతలనే సైంటిస్ట్, ఇంజనీర్స్‌గా ఖరారు చేస్తారు. గత ఏడాది వరకు ఈ పోస్ట్‌లకు గేట్ స్కోర్ ఆధారంగానే నియామక ప్రక్రియ ఉండేది. ఈ ఏడాది తొలిసారి సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఇస్రో సొంత నియామక ప్రక్రియ చేపడుతోంది.

రాత పరీక్షల్లో.. సబ్జెక్ట్ నాలెడ్జ్

ఇస్రో సైంటిస్ట్–ఎస్‌సీ పోస్టులకు నిర్వహించే రాతపరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 మార్కులకు సబ్జెక్ట్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మరో 20 మార్కులకు న్యూమరికల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డయాగ్రమెటిక్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్, డిడక్టివ్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

వెయిటేజీ విధానం

రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా విజేతలను ఖరారు చేసే క్రమంలో.. వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తున్నారు. రాత పరీక్షలో ప్రతిభకు 50 శాతం; ఇంటర్వ్యూ మార్కులకు 50 శాతం వెయిటేజీని గణించి.. దాని ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

వేతనాలు ఆకర్షణీయంగానే

ఏడో వేతన సంఘ సిఫార్సుల ప్రకారం–సైంటిస్ట్స్ కేటగిరీలో వేతనాలు ఆకర్షణీయంగానే ఉన్నాయని చెప్పొచ్చు.సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్‌సీలకు పే లెవల్–10లో రూ.56,100–రూ.1,77,500 వేతన శ్రేణి ఉంటుంది. సైంటిస్ట్–ఎస్‌డీ హోదాలో పే లెవల్–11లో రూ. 67,700 – రూ.2,08,700; సైంటిస్ట్–ఎస్ఈ హోదాలో పే లెవల్ 12తో రూ.78,800 –రూ.2,09,200;సైంటిస్ట్–ఎస్ఎఫ్ హోదా లో పే లెవల్13తో రూ.1,23,100–రూ.2,15,900; సైంటిస్ట్ –ఎస్‌జీ హోదాలో పే లెవల్ 13తో రూ. 1,31,100–రూ.2,16,600, సైంటిస్ట్–జి హోదాలో పే లెవల్ 14తో రూ. 1,44,200–రూ.2,18,200 వేతన శ్రేణి ఉంటుంది. ఇక.. ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్‌లకు రూ.1,82,200– రూ.2,24,100. రూ. 2,05,400 – రూ. 2,24,400 వేతన శ్రేణిలో వేతనాలు లభిస్తాయి.



సబ్‌స్టేషన్ అమ్ముతా.. కొంటారా?

ఉద్యోగం ఇవ్వలేదని.. స్థలదాత వినూత్న నిరసన

నేలకొండపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఒకరు స్థలం దానంగా ఇవ్వగా, నేతలు, అధికారులు ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ నెరవేరకపోవడంతో ఆ దాత వినూత్నంగా నిరసనకు దిగాడు. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామానికి 2014లో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. గ్రామానికి చెందిన రైతు ఆకుల నరసింహారావు 12 గుంటల భూమి ఇచ్చాడు. అప్పుడు సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా ఉద్యోగం ఇస్తామని చెప్పినా, హామీ నెరవేరకున్నా పైసా జీతం లేకుండా పనిచేశాడు. గతంలో పలుమార్లు నిరసన తెలిపినా, ఆత్మహత్యయత్నానికి పాల్పడినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దిగిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన నరసింహారావు..సబ్‌స్టేషన్ అమ్ముతున్నందున కావాల్సిన వారు తనను సంప్రదించాలని కోరాడు. ఈ విషయమై ఆయనతో మాట్లాడగా ఉద్యోగమైనా ఇవ్వాలని, లేకపోతే ఎకరం భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ అంశంపై అధికారులు ఇంకా స్పందించలేదు.

అరకు కాఫీ అత్యుత్తమం

ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ట్వీట్



సాక్షి, అమరావతి: అరకు కాఫీపై ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలో జరిగిన జీ–20 సమ్మిట్ తర్వాత వివిధ దేశాధినేతలకు ప్రత్యేక బహుమతిగా అరకు కాఫీని అందించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అరకు కాఫీని ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ నాణ్యత గల ఉత్పత్తులను అందించే భారతదేశ సామర్థ్యానికి ప్రధాన ఉదాహరణగా ఆయన అభివర్ణించారు. అరకు ఒరిజినల్స్ బోర్డు చైర్మన్‌గా ఈ ఘనత తనకు ఎంతో గర్వకారణమన్నారు. 'ఇది నాకు చాలా గర్వంగా ఉంది. అరకు కాఫీ ది బెస్ట్ ఇన్ ది వరల్డ్. గ్రోన్ ఇన్ ఇండియాకు సరైన ఉదాహరణ' అంటూ ఆనంద్ మహీంద్రా బుధవారం ట్వీట్ చేశారు.

నీటి వనరులను డంపింగ్ యార్డ్‌గా మార్చొద్దు

హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: నీటి వనరులను చెత్తవేసే డంపింగ్ యార్డులుగా మార్చొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. చెరువుల పరిరక్షణతో తమకు సంబంధం లేదంటూ ఒక శాఖపై మరొకటి తోసేస్తూ బాధ్యతను విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. చెరువుల చుట్టూ కంచె వేసి పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వ్యాఖ్యానించింది. వాతావరణ పరిరక్షణలో నీటి వనరుల పాత్ర కూడా కీలకమని, పలు రకాల జీవులు, పక్షులు వాటిపైనే ఆధారపడి జీవిస్తాయని చెప్పింది. రామంతాపూర్ పెద్దచెరువు రక్షణకు చర్యలు తీసుకోవాలంటూ జీహెచ్ఎంసీని ఆదేశిస్తూ, విచారణను వచ్చే నెల 5కి వాయిదా వేసింది. హైదరాబాద్‌లో 532 చెరువులు క్షీణిస్తున్నాయని. 25 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని, ఈ కారణంగా నీటికాలుష్యం పెరిగి దుర్వాసన వ్యాపిస్తోందని ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ వ్యాస్ 2005లో రాసిన లేఖను హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. జీహెచ్ఎంసీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. చెరువులో చెత్త వేయకుండా నోటీసు బోర్డు పెట్టామని, గతంలో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. చెరువు చుట్టూ కంచె వేశారా అని ధర్మాసనం ప్రశ్నించగా, 4 వారాలు గడువు కావాలని కోరారు. పిటిషన్ వేసి 18 ఏళ్లు అయ్యిందని.. ఇంకా గడువు కోరడాన్ని తప్పుబట్టింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం.. చెరువుల బఫర్ జోన్లలో ఆక్రమణలను అనుమతించరాదని, పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పింది. చెరువుల పరిరక్షణకు తెలంగాణలో చట్టం ఉన్నా..అమలవుతోందా? లేదా? ప్రశ్నార్థకమైందని పేర్కొంది. రామంతాపూర్ పెద్దచెరువులో చెత్తను తొలగించి, కంచె ఏర్పాటుకు ప్రణాళికతోపాటు ప్రస్తుత పరిస్థితిపై నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీని ఆదేశించింది.

రీసేల్.. రివర్స్



కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాని దైన్యం

ఉంచుకోలేక... ప్లాట్లు అమ్ముకోలేక వేతన జీవుల అగచాట్లు

ఏళ్లు గడుస్తున్నా.. ఎలాంటి అభివృద్ధి లేదు

సిటీకి 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న సదాశివపేటలో ఓ నిర్మాణ సంస్థ భారీ వెంచర్ చేసింది. ఇది నిమ్జ్‌కు అతి సమీపంలో ఉండడంతో రెట్టింపు ధర పక్కాగా వస్తుందని ఓ ప్రైవేట్ ఉద్యోగి ఆశపడ్డాడు. గజానికి రూ. 8 వేలు చెల్లించి 150 గజాల ప్లాట్ కొన్నాడు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు సదరు ఉద్యోగి తన కొడుకు చదువుకని ప్లాట్ అమ్మకానికి పెట్టాడు.. రెట్టింపు ధర సంగతి దేవుడెరుగు.. కనీసం బ్యాంకు వడ్డీ కూడా వచ్చే పరిస్థితి లేదు.

గ్రేటర్ పరిధిలో గత ఆర్థిక సంవత్సరం ఐదు మాసాల్లో సుమారు 3.5 లక్షల దస్తావేజులు నమోదు కాగా, ఈసారి మాత్రం 2.2 లక్షలకు డాక్యుమెంట్లు కూడా దాటలేదు. రియల్ వ్యాపారం పూర్తిగా మందగించడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి.

సాక్షి, హైదరాబాద్: ఎవరైనా సరే భూమి ఎందుకు కొంటారు..? పిల్లల చదువుకోసమో.. అమ్మాయి పెళ్లి కోసమో.. ఇతరత్రా భవిష్యత్ అవసరాలకు అక్కరకొస్తుందనే కదా! కానీ, ప్రస్తుతం రీసేల్ ప్లాట్లకు అస్సలు గిరాకీ లేదు. కుప్పలుతెప్పలుగా వెంచర్లు, స్థానిక సంస్థల నుంచి అనుమతులు లేకపోవటం, మౌలిక వసతులు కల్పించకపోవటంతో పాటు ఎన్నికల వాతావరణం కావడంతో రీసేల్ ప్లాట్లకు గిరాకీ లేకుండా పోయింది.

నగరం చుట్టూ ఇదే పరిస్థితి


రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), యాదాద్రి, నిమ్జ్, ఫార్మా సిటీ, టెక్స్‌టైల్స్ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ హబ్‌లు, మెట్రో రైలు విస్తరణ.. ఇలా అనేక ప్రాజెక్టులు వచ్చేస్తున్నాయంటూ హైదరాబాద్ నుంచి వంద కిలోమీటర్ల వరకూ రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ వెంచర్లు చేస్తున్నారు. యాదాద్రి, జనగాం, సదాశివపేట, షాద్‌నగర్, సంగారెడ్డి, చౌటుప్పల్, చేవెళ్ల తదితర ప్రాంతాలలో ఫామ్ ప్లాట్లు, విల్లా ప్లాట్లు, వీకెండ్ హోమ్స్ అని రకరకాల పేర్లతో విక్రయిస్తున్నారు. స్థలం కొనుగోలు చేస్తే అధిక లాభాలు ఉంటాయని అందమైన బ్రోచర్లతో ఊదరగొడుతున్నారు. వీటిని నమ్మి కొన్నవారికి నిరాశే ఎదురవుతోంది. తెల్ల కాగితాల మీద గీతలు గీసేసి, ప్లాట్లు విక్రయించే బిల్డర్లు సైతం ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

రెరాలో నమోదు లేకుండానే

నిబంధనల ప్రకారం స్థిరాస్తి సంస్థల ఏజెంట్లు కూడా టీఎస్–రెరాలో నమోదు చేసుకోవాలి. కానీ, నిర్మాణ సంస్థలు ఇవేవీ పట్టించుకోకుండా పెద్ద ఎత్తున మార్కెటింగ్ ప్రతినిధులను నియమించుకుంటున్నాయి. ఏజెంట్లకు ఒక్క ప్లాట్ విక్రయిస్తే రూ.2 లక్షలకు పైగానే కమీషన్ అందిస్తున్నాయి. ఎక్కువ ప్లాట్లు విక్రయిస్తే ఏజెంట్లకు బంగారం, కార్లు గిఫ్టులుగా ఇవ్వడంతో పాటు గోవా, మలేసియా, దుబాయ్, బ్యాంకాక్ హాలీడే ట్రిప్పులకు తీసుకెళుతున్నారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లతో గొలుసుకట్టు వ్యాపారం చేస్తున్నాయి. ప్రతి ఆదివారం బస్సులు, కార్లలో కొనుగోలుదారులను వెంచర్ల వద్దకు తీసుకెళుతున్నారు.

రెండు మూడేళ్లుగా..

జనరద్దీ లేని చోట... అటవీ ప్రాంతాలకు సమీపంగా కూడా వెంచర్లు వేశారు. కనీసం అక్కడ ఊరు ఆనవాళ్లు కూడా కనిపించవు. ఆయా ప్రాంతాల్లో ప్లాట్లను కొనుగోలు చేసిన వారు అత్యవసరమైతే అమ్ముకోలేక అగచాట్లు పడుతున్నారు. వెంచర్లు చేసిన సంస్థ విక్రయించిన ధరకు ప్లాట్‌ను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్లాట్‌పై పెట్టుబడి పెడితే ఎప్పటికైనా ధర పెరుగుతుందనే ధీమాతో చాలా మంది కొనుగోలు చేశారు. వారంతా రెండుమూడేళ్లుగా విక్రయించడానికి ప్రయత్నించినా కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు.



అభివృద్ధి జరిగే ప్రాంతంలోనే కొనాలి

అభివృద్ధికి ఆస్కారం ఉండే ప్రాంతాల్లోనే ప్లాట్లు కొనుగోలు చేయాలి. వెంచర్లలో రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు వంటి అన్ని రకాల మౌలిక వసతులు ఉంటేనే భవిష్యత్‌లో విక్రయించినా మంచి ధర వస్తుంది. అనుమతులు ఉన్న వెంచర్లలో కొనడమే ఉత్తమం.

– సీహెచ్ వెంకట సుబ్రహ్మణ్యం, సీఎండీ, భువన్‌తేజ ఇన్‌ఫ్రా

ఐఎస్‌బీ..టాప్ బి–స్కూల్

బ్లూమ్‌బర్గ్ బిజినెస్ వీక్ 2023–24 ర్యాంకింగ్స్ విడుదల

రాయదుర్గం: బ్లూమ్‌బర్గ్ బిజినెస్‌వీక్ బెస్ట్–బి స్కూల్స్ ర్యాంకింగ్స్ 2023–24లో గచ్చిబౌలిలోని ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) సత్తా చాటింది. బుధవారం ర్యాంకింగ్స్ ప్రకటించగా, ఆసియా–పసిఫిక్‌లోని బి–స్కూల్స్‌లో ఐఎస్‌బీ టాప్‌లీగ్‌లో కొనసాగడం విశేషం. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(పీజీపీ) బ్లూమ్‌బర్గ్ బి–స్కూల్స్ వార్షిక ర్యాంకింగ్‌లోనూ 5వ స్థానం సాధించింది. ఐఎస్‌బీ నెట్ వర్కింగ్‌లో 2వ స్థానం, ఆంట్ర ప్రెన్యూర్‌షిప్‌లో మూడవ స్థానం, లెర్నింగ్‌లో నాలుగో స్థానం, కాంపెన్సేషన్ పారామీటర్‌లో 5వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్స్‌లో ఐఎస్‌బీ ఓవరాల్‌గా 68.1 స్కోరు, లెర్నింగ్‌లో 86.1, నెట్ వర్కింగ్‌లో 86, ఆంట్రప్రెన్యూర్‌షిప్‌లో 78.1శాతం స్కోరు సాధించింది.



టాప్ బి–స్కూల్‌గా 'ఐఎస్‌బీ' నిలవడం గర్వకారణం

బ్లూమ్‌బర్గ్ బి–స్కూల్స్ ర్యాంకింగ్స్‌లో టాప్ బి–స్కూల్‌గా ఏషియా– పసిఫిక్‌లో నిలవడం గర్వకారణమని ఐఎస్‌బీ డిప్యూటీ డీన్ అకడమిక్ ప్రోగ్రామ్ ప్రొఫెసర్ రామభద్రన్ తిరుమలై అన్నారు. సమష్టి కృషి వల్లే సాధ్యమైందన్నారు.

సునామీని ఎదుర్కోవడం ఎప్పుడైనా సవాలే!

మరో సునామీ విరుచుకుపడొచ్చు

- మాక్‌డ్రిల్స్ నిర్వహణతో ప్రాణనష్టం తగ్గింపు
- వచ్చే నెలలో మాక్‌డ్రిల్‌లో పాల్గొంటున్న 14 దేశాలు
- ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస కుమార్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రకృతి విపత్తులు రకరకాలుగా ఉన్నప్పటికీ ఎప్పుడు వస్తుందో తెలియని మహా విపత్తు సునామీని ఎదుర్కోవడం ఎప్పుడూ ఒక సవాలేనని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్) డైరెక్టర్ డాక్టర్ టి. శ్రీనివాసకుమార్ వ్యాఖ్యానించారు. 2004 తరువాత ఇప్పటివరకూ ఇంకో సునామీ రాకున్నా ఏ క్షణమైనా విరుచుకుపడే అవకాశం ఉందన్నది అందరూ గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. సునామీ వస్తే సమర్థంగా ఎదుర్కొనేందుకు ఏమేం చేయాలన్న అంశంపై ఇన్‌కాయిస్ చాలా ఏళ్లుగా మార్గదర్శకాలను రూపొందించడమే కాకుండా.. సన్నాహక కార్యక్రమాలు కూడా చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా వచ్చే నెలలో కూడా మాక్ డ్రిల్స్ చేపట్టనుంది. ఈ మాక్‌డ్రిల్స్ తీరుతెన్నులను వివరించేందుకు, సునామీని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పునశ్చరణ కోసం హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్ కార్యాలయంలో బుధవారం ఒక కార్యక్రమం ఏర్పాటైంది. కోస్ట్‌గార్డ్స్ మొదలుకొని భారతీయ వాయు సేన, నావికాదళం, పలు రాష్ట్రాల విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో డైరెక్టర్ శ్రీనివాసకుమార్ మాట్లాడారు. సునామీ ముందస్తు సమాచారం, లేదా హెచ్చరికలు సముద్రతీరంలో ఉన్న సామాన్యుడి వరకూ సమర్థంగా వెళుతున్నాయా? లేదా? అన్నది పరిశీలించేందుకు మాక్‌డ్రిల్స్ ఉపయోగపడతాయని చెప్పారు.

తొలిసారి 14 దేశాలతో కలిసి..

అక్టోబర్‌లో తొలిసారి హిందూ మహా సముద్ర ప్రాంతంలోని 14 దేశాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొంటున్నాయని ఆయన వివరించారు. సముద్ర గర్భంలో భూకంపం సునామీకి కారణం కావచ్చునని అందరికీ తెలుసు కానీ.. భూకంపానికి గల కారణం వల్ల కూడా సునామీ తీరుతెన్నుల్లో మార్పులుంటాయని, వీటిని కూడా దృష్టిలో ఉంచుకుని ఈ మాక్‌డ్రిల్స్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. మాక్‌డ్రిల్స్‌ను సమర్థంగా నిర్వహిస్తుండటం వల్ల 2018లో అతితక్కువ కాలంలో సుమారు 1.90 లక్షల మందిని తీర ప్రాంతం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించగలిగామని, తుపానుల సమయంలోనూ ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ఈ మార్గదర్శకాలు ఉపయోగపడుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎం. బాలకృష్ణ నాయర్, పశ్చిమబెంగాల్, ఒడిశాల విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులు కునాల్ అగర్వాల్, డాక్టర్ సునీతా జేనాలు పాల్గొనగా.. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్ హాజరయ్యారు.

పోయింది ఓ మామూలు మనిషేలే!

- అమెరికాలో తెలుగు యువతి మృతిపై చులకనగా మాట్లాడిన పోలీస్
- నవ్వుతూ, జోకులు వేస్తున్న వీడియో వెలుగులోకి..
- అతడిపై విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు



జాహ్నవి

సియాటెల్: అమెరికాలో రోడ్డు ప్రమాదంలో తెలుగు యువతి మృతి చెందడంపై అక్కడి పోలీసు అధికారి చులకనగా మాట్లాడిన అంశం కలకలం రేపుతోంది. సదరు పోలీసు అధికారి నవ్వుతూ, జోకులు వేస్తున్న వీడియో బయటికి రావడంతో.. అక్కడి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.

అసలేం జరిగింది?

అమెరికాలో సియాటెల్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో చదువుతున్న కర్నూలు జిల్లా ఆదోని యువతి జాహ్నవి (23) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అదీ పోలీసు పెట్రోలింగ్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడిక్కడే మరణించారు. ఆ ఘటన విషయం తెలిసి దర్యాప్తు చేయడానికి వచ్చిన పోలీసు అధికారి డానియెల్ అడరర్.. పైఅధికారికి వివరాలు చెప్తూ జాహ్నవి పట్ల చులకనగా మాట్లాడారు. గట్టిగా నవ్వుతూ 'ఆమె చచ్చిపోయింది. ఆ ఓ మామూలు వ్యక్తేలే..' అని వ్యాఖ్యానించారు. పోలీసు వాహనమే ఢీకొట్టిన నేపథ్యంలో.. 'ఏముంది. ఓ పదకొండు వేల డాలర్లకు చెక్కు రాస్తే చాలు.. ఆమెకు 26 ఏళ్లు ఉంటాయేమో.. విలువ తక్కువే..' అని పగలబడి నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఇదంతా అతడి బాడీ కెమెరాలో రికార్డైంది. తాజాగా ఈ దృశ్యాలు వెలుగులోకి రావడంతో.. సియాటెల్ కమ్యూనిటీ పోలీస్ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఇలాంటి వ్యాఖ్యలు దారుణమని పేర్కొంది. డానియెల్ అడరర్‌పై విచారణకు ఆదేశించింది.

తప్పుడు వివరాలతోనూ..

జాహ్నవిని ఢీకొని ఆమె మరణానికి కారణమైన తోటి పోలీసు అధికారి కెవిన్‌ను కాపాడేందుకు డానియెల్ ప్రయత్నించిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ప్రమాద సమయంలో కెవిన్ కారును గంటకు 50 మైళ్ల వేగంతోనే నడుపుతున్నాడని, కారు అదుపు తప్పలేదని డానియల్ దర్యాప్తు నివేదికలో పేర్కొన్నాడు. తప్పు జాహ్నవిదే అన్నట్టుగా చూపడానికి ప్రయత్నించాడు. అయితే కెవిన్ కారును పరిమితికి మించి 74 మైళ్ల వేగంతో నడిపాడని, కారు అదుపు తప్పిందని తర్వాత ఫోరెన్సిక్, ఇతర దర్యాప్తు నివేదికల్లో తేలడం గమనార్హం.

- రాష్ట్రంలోని సుమారు ఆరువందల మండలాల్లో కేవలం 16 మంది రెగ్యులర్ ఎంఈవోలు పనిచేస్తున్నారని శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ తెలిపారు. వారిలో ఐదుగురు ఎస్సీ, 11 మంది ఎస్టీలు కాగా, 18 ఏళ్లుగా వీరికి బదిలీలు లేవని పేర్కొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

- వెల్‌నెస్, స్పా, మసాజ్ కేర్ సెంటర్లకు హైకోర్టు ఆదేశం
- రోజువారీ కార్యకలాపాల్లో జోక్యం వద్దని అధికారులకు స్పష్టం



సాక్షి, హైదరాబాద్: వెల్‌నెస్, స్పా, మసాజ్ కేర్ సెంటర్ల వ్యాపారాలను బలవంతంగా మూసివేసే బదులు వాటిని క్రమబద్ధీకరించి, అనుమతించాలని హైదరాబాద్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. మసాజ్ సెంటర్ల ముసుగులో అనైతిక కార్యకలాపాలు చేపట్టకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. తమ రోజువారీ వ్యాపారంలో పోలీసులు జోక్యం చేసుకుంటున్నారని, సెంటర్ మూసివేయాలని ఒత్తిడి చేస్తున్నారని సామారా వెల్‌నెస్ అండ్ స్పా సెంటర్‌తో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ.భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి, గతంలో 20 మసాజ్ కేర్ సెంటర్లు దాఖలు చేసిన పిటిషన్లలో హైకోర్టు నిర్దేశించిన షరతులకు లోబడి తాజా పిటిషనర్ల సెంటర్లు నడిపేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. పనివేళల్లో మసాజ్ సెంటర్లు ప్రధాన ద్వారాలను మూసి ఉంచరాదని స్పష్టం చేశారు. మసాజ్, స్పా, వెల్‌నెస్ సెంటర్లు.. విధిగా రికార్డు నిర్వహించాలని, కస్టమర్ల పేర్లు, వారి సందర్శన తేదీ, సమయం, చిరునామా, ఫోన్‌నంబర్ లాంటి వివరాలు నోట్ చేయాలని చెప్పారు. ఈ రికార్డులను అప్పుడప్పుడు సబ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంక్ అధికారులు తనిఖీ చేయాలన్నారు.

భళా అరటి గెల

సాధారణంగా అరటి గెల మూడు నుంచి ఏడు అడుగుల పొడవు పెరుగుతోంది. అయితే ఏలూరు జిల్లా కైకలూరు రిజిస్ట్రార్ ఆఫీసు ఎదురుగా ఆక్వా రైతు దండు రంగరాజు నివాసం వద్ద మాత్రం అరటి గెల ఏకంగా 10 అడుగులు పెరిగి అందర్నీ అబ్బురపరుస్తోంది. ఇంటికి ఇరువైపుల కడియం నుంచి తీసుకొచ్చిన అరటి పిలకలను ఆయన 2015 నుంచి నాటుతున్నారు. -కైకలూరు



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.